మంచిమాట
నీకున్నదంతా ఏదో ఒకరోజున
ఇచ్చేయాల్సిందే. నీవెంట ఏదీ
తీసుకెళ్ళలేవు. అంచేత
ఆ ఇచ్చేదేదో ఇప్పుడే ఇవ్వు.
ఇచ్చే గొప్ప అవకాశాన్ని నువ్వే
వాడుకో. ఇవ్వడంలోని ఆనందాన్ని
అనుభవించాల్సింది నువ్వేకానీ
నీ వారసులు కాదు.

నిజాలు నిగ్గు తేల్చే
# చర్చ
తెలుగు దిన పత్రిక


విలేకరులు కావలెను
ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 25 సంచిక : 56 శుక్రవారం, నవంబర్ 21, 2025 , పేజీలు - 12 వెల : 2/-

## బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం

- 27మంది మంత్రులు కూడా ప్రమాణం
- ప్రమాణం చేయించిన గవర్నర్
- హాజరైన మోడీ, అమిత్ షా, చంద్రబాబు



## తిరుపతి చేరుకున్న రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం

**తిరుచానూరులో పద్మావతి అమ్మవారి దర్శనం**

**నేడు శ్రీవారిని దర్శించుకోనున్న ముర్ము**



**తిరుమల,నవంబర్20 :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత, టీటీడీ ఉన్నతాధికారులతో పాటు కూటమిలోని పార్టీల నేతలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా తిరుచానూరుకు రాష్ట్రపతి చేరుకున్నారు. తిరుచానూరులో మిగతా2లో...



## సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

**వ్యక్తిగత హాజరుతో పూర్తయిన లాంఛనం**

**జగన్ రాకతో అభిమానుల హల్‌చల్**

**హైదరాబాద్,నవంబర్20 :** అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన మిగతా2లో...

# గవర్నర్లు, రాష్ట్రపతికి గడవు విధించలేం

**గవర్నర్లకు మూడు అంశాల్లోనే నిర్ణయం**

**సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు**



**న్యూఢిల్లీ,నవంబర్20:** గవర్నర్,రాష్ట్రపతి అధికారాలపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించిన అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించటం తగదని స్పష్టం చేసింది. కారణం చెప్పకు ండా గవర్నర్‌లు బిల్లులను వెనక్కి పంపలేరని తెలిపింది. బిల్లును నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్‌కు లేదని కూడా తేల్చి చెప్పింది. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి పంపితేనే రాష్ట్రపతి చర్యలు తీసుకోగలరని చెప్పింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు విచక్షణాధికారం ఉందని వెల్లడించింది. తన ముందుకు వచ్చిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపడం, అభిప్రాయాలతో తిరిగి పంపడం, బిల్లును పరిశీలించి సూచనలు ఇవ్వడం వంటివి మాత్రమే చేస్తారని తెలిపింది. రాష్ట్ర పరిపాలనలో తుది అధికారం ఎన్నుకోబడిన మంత్రివర్గానిదేనని స్పష్టం చేసింది. మిగతా2లో...

## దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ

**కేంద్రమంత్రికి సీఎం రేవంత్ సూచన**

**పరిశీలిస్తామన్న మంత్రి ప్రహ్లాద్ జోషి**



**హైదరాబాద్,నవంబర్20:** దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల్లో వినియోగదారులకు సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. గురువారం ఉదయం మిగతా2లో...

## స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నివేదిక

**డిసెంబర్ 11లోపు నోటిఫికేషన్‌కు ఛాన్స్**

**పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి**




**హైదరాబాద్,నవంబర్20:** పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. డెడికేటెడ్ కమిషన్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈనెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయనుంది. ఈనెల 24 లేదా 25న షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. 12,733 పంచాయతీ, 1,12,288 వార్డుల్లో డిసెంబరు 16 వరకు మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది. ఇదిలావుంటే వచ్చే నెల డిసెంబర్ 11వ తేదీ లోపు పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. గురువారం కామారెడ్డి జిల్లా భిక్కనూరులో జరిగిన సభలో ఆమె మాట్లాడారు. అనంతరం మండలంలోని బస్వాపూర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ముందుగా గ్రామ పంచాయతీలకు, తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉంటా యని అన్నారు. పంచాయతీ ఎన్నికలకు మిగతా2లో...




## 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం

**బండి సంజయ్‌పై కేసు కొట్టివేసిన హైకోర్టు**

**మరో కేసులో నాంపల్లి కోర్టుకు హాజరైన బండి**



## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బిగ్ షాక్

**- ఫార్ములా -కారు రేసు కేసు విచారణకు గవర్నర్ అనుమతి**

**హైదరాబాద్,నవంబర్20 :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు బిగ్ షాక్ తగిలింది. ఈ ఫార్ములా -కారు రేసు కేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులోనిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగించేందుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్ అనుమతితో ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు చేయనుందని సమాచారం.ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మిగతా2లో...



## క్రికెటర్ స్మృతి మందాన పెళ్లి

**బాలీవుడ్ సింగర్ పలాశ్ ముచ్చల్‌తో ఏడడుగులు**

**23న పెళ్లి అంటూ కొత్త జంటకు శుభాకాంక్షలు చెప్పిన ప్రధాని**

**న్యూఢిల్లీ,నవంబర్20:** మహిళలవరల్డ్ కప్ విజేత స్మృతి మంధాన పెళ్లి తేదీ వచ్చేసింది. ప్రపంచకప్ టోర్నీ ముగిసినప్పటి నుంచి మంధాన వివాహంపై వస్తున్న కథనాలకు ఎట్టకేలకు వెడ్డింగ్ కార్డ్‌తో ఎండ్ కార్డ్ మిగతా2లో...

# పెట్టుబడులకు హైదరాబాద్ వేదిక

**- తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌లో రేవంత్**




**హైదరాబాద్,నవంబర్20:** పెట్టుబడులకు హైదరాబాద్ వేదికగా మారిందని, తాము పక్క రాష్ట్రాలతో కాకుండా దుబాయ్, సింగపూర్ లాంటి దేశాలతో పోటీ పడతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ వేదికగా 6 రోజుల పాటు రెండు విడతలుగా జరిగే తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావ్, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ వివిధ రంగాల్లో దూసుకుని పోయేలా కార్యాచరణతో ముం దుకు సాగుతున్నామని అన్నారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు.

తెలంగాణతో పాటు పాటు 8 ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 600 మంది పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో మొదటి దశ ఫెస్టివల్‌లో సినిమాలు, సాహి త్యం వంటి అంశాలపై సెమినార్లు, చర్చా గోష్ఠిలు, ప్రదర్శనలు ఉంటాయని, 25 నుంచి 27 వరకు సాగే 2వ విడతలో ఆరోగ్యం, సాంకేతికత వంటి అంశాలపై చర్చలు ఉంటాయని చెప్పారు. రోజూ 2వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, 40 మంది పౌర పురస్కార విజేతలు కూడా దీనికి మిగతా2లో...

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక




# గవర్నర్లు, రాష్ట్రపతికి గడవు విధించలేం

(మొదటి పేజీ తరువాయి)

ఒక రాష్ట్రంలో రెండు ఎగ్జిక్యూటివ్ పవర్స్ ఉండవని, ప్రభుత్వం ఒక్కటే ప్రధాన నిర్ణయాధికారి అని తేల్చి చెప్పింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించటంపై ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పంపిన ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌పై స్పందిస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. రాష్టర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నలపై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని సీజేఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడించింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది. గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి. బిల్లులకు సమ్మతి తెలియజేయడం, కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం, బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం. ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. నిరవధిక ఆలస్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తెలిపారు. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించ లేరు. శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం నిర్దేశించింది. రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మే నెలలో పలు ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవర కు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలను ఆలకించిన ధర్మాసనం సెప్టెం బరు 11న తీర్పు రిజర్వు చేసింది. రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమంటూ తాజాగా తీర్పు వెలువరించింది.

# 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం

**హైదరాబాద్,నవంబర్20:** కేంద్ర హోమ్ శాఖ మంత్రి బండి సంజయ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. గతంలో కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును గురువారం నాడు హైకోర్టు కొట్టేసింది. 2023లో 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై ఈ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో బండి సంజయ్ పేరును ప్రధాన నిందితుడిగా కమలాపురం పోలీసులు చేర్చారు. రాజకీయ కక్షల కారణంగానే ఈ కేసు నమోదు చేశారని హైకోర్టుకు బండి సంజయ్ న్యాయవాది తెలిపారు. కేసు నమోదులో సరైన సెక్షన్లు కానీ.. దర్యాప్తులో పూర్తి వివరాలు కానీ లేవని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ కేసును కొట్టేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలావుంటే బండి సంజయ్ గురువారం నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. గతంలో తనపై నమోదైన పలు కేసుల నేపథ్యంలో విచారణ కోసం కోర్టు వెళ్లారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ పని చేసిన విషయం తెలిసిందే.ఆ సమయంలో నల్గొండలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అలాగే హుజూర్‌నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల లో బండి సంజయ్ కాన్వాయ్‌పై బీఆర్ఎస్ నేతలు రాళ్ల దాడి చేశారు. నాటి ఘటనల్లో బండి సంజయ్‌పై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణలో భాగంగానే కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. అయితే, విచారణ అనంతరం జనవరి 7వ తేదీకి ఈ కేసును న్యాయమూర్తి వాయిదా వేశారు.

# క్రికెటర్ స్మృతి మందాన పెళ్లి

(మొదటి పేజీ తరువాయి)

పడింది. బాలీవుడ్ సింగర్ పలాశ్ ముచ్చల్‌తో ఈ ముద్దుగుమ్మ ఏడడుగులు నడవనుందనే వార్తలు వినిపించాయి. నవంబర్ 23 ఆదివారం ఈ స్టార్ జంట మూడుముళ్ల బంధంలోకి అడుగుపెట్టనుంది. ఈ విషయాన్ని ఏకంగా ప్రధాని నరేంద్ర మోడీ ధ్రువీకరించడం విశేషం. కాబోయే దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన మోడీ.. పెళ్లి తేదీని బహిర్గతం చేశారు. భారత మహిళల జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఈమధ్య నెట్టింట తెగ వైరలైంది. వరల్డ్ కప్‌లో తన ఆటతో పాటు ఆమె పెళ్లి పత్రిక కూడా సోషల్ మీడియాలో తెగ తిరిగింది. నవంబర్ 20వ తేదీన స్మృతి-పలాశ్ వివాహం అంగరంగ వైభవంగా జరగనున్నట్లు ప్రచారం జరిగింది. అంతేనా.. వీరి వివాహ ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో వైరలైంది కూడా. మహారాష్ట్రలోని స్మృతి మంధాన స్వస్థలం సాంగ్లీ లో జరగనుందని.. ఇప్పటికే పలువురికి ఆహ్వానాలు కూడా అందాయని కథనాలు వచ్చాయి. అవన్నీ ఇప్పుడు నిజం కాబోతున్నాయి. కాకపోతే పెళ్లి తేదీ 20 నుంచి 23కు మారిందంతే. ప్రధాని నరేంద్ర మోడీ శుభాకాంక్షల సందేశంతో ఈ విషయం బయటకొచ్చింది. 'స్మృతి మంధాన, పలాశ్ ముచ్చల్ నవంబర్ 23న పెళ్లి చేసుకోబోతున్నారని తెలిసి సంతోషిస్తున్నా. ఈ శుభసందర్భంగా ఇరుకుటుంబా లకు నా హృదయ పూర్వక ధన్యవాదాలు. ఒక్కరిగా ఉంటూ..ఒకరి సమక్షంలో ఒకరు ఐకమత్యంగా ఉంటూ సాగాలని కోరుకుంటున్నా. వారి లక్ష్యాలు నెరవేరాలని, జంటగా వృద్ధి సాధించాలని, పరస్పర అవగాహనతో వీరిద్దరి జీవితం ఆనందమయం కావాలని ఆశిస్తున్నా. మంధాన, పలాశ్‌లు నమ్మకంతో కొత్త జీవితాన్ని ఆరంభించను న్నారు. ఒకరికొకరు మద్దతుగా ఉంటూ, బాధ్యతగా వ్యవహరిస్తూ.. ప్రేమానురాగాలతో వర్ధిల్లాలి' అని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు. ఇటీవలే ఇండోర్‌లోని ప్రెస్ క్లబ్‌లో 'మంధానతో మీ అనుబంధం గురించి చెప్పండి? అని జర్నలిస్టులు పలాశ్‌ను అడిగారు. అందుకు .. 'మంధాన త్వరలోనే ఇండోర్ కోడలు కాబోతోంది. ఇప్పుడు మీకు ఈ విషయం మాత్రమే చెప్పగలను. ఇంకేం చూస్తున్నారు.. మీకు హెడ్‌లైన్ ఇచ్చేశాను' అని పలాశ్ బదులిచ్చాడు. అతడి మాటలతో ఇరువురి పెళ్లిపై స్పష్టత వచ్చేసింది. అయితే.. వరల్డ్ కప్‌లో ఆడతున్న మంధాన కూడా ఈ విషయంపై స్పందించాల్సి ఉంది. ప్రపంచ కప్ ముందు ఆస్ట్రేలియాపై రెండు శతకాలతో చెలరేగిన మంధాన ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డ్ విజేతగా నిలిచింది. ఏడాది జూలై 19, శనివారం ఈ డాషింగ్ ఓపెనర్ 29వ వసంతంలో అడుగుపెట్టింది. పలాశ్ తన కలల రాణికి తన మనసుపుస్తకాన్ని ఆవిష్కరిస్తూ పుట్టిన రోజున శుభాకాంక్షలు తెలిపాడు. మన ప్రయాణం మొదలైనప్పటి నుంచి నువ్వే నా ప్రశాంతత. నా కన్ఫ్యూజన్ కూడా. నా బిగ్గెస్ట్ చీర్ లీడర్ నువ్వే. నాలో స్ఫూర్తిని నింపేది కూడా నీవే. ఒత్తిడిలోనూ కూల్‌గా ఉండడం నిన్ను చూసే నేర్చుకున్నా. హ్యాపీ బర్త్ డే స్మృతీ' అంటూ తన ప్రేమ సందేశాన్ని రాసుకొచ్చాడు. మనసైనోడి నుంచి విషెస్ అందుకున్న మంధాన.. నువ్వే నా హార్ట్ బీట్ అనే అర్థం వచ్చేలా 'థ్యాంక్యూ మై బాయ్' అనే పోస్ట్‌కు లవ్ ఎమోజీలతో బదులిచ్చింది.

# బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బిగ్ షాక్

(మొదటి పేజీ తరువాయి)

ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జిషీట్ దాఖలు చేయనుంది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ-1 గా, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను ఏ-2గా ఏసీబీ పేర్కొంది. ఇప్పటికే కేటీఆర్ ఈ కేసు విషయంలో ఏసీబీ విచారణకు నాలుగు సార్లు హాజరయ్యారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు ఇప్పటికే కేంద్రంలోని డీఓపీటీకు లేఖ రాశారు. గవర్నర్ అనుమతి నేపథ్యంలో, చార్జిషీట్ దాఖలుకు ముందు ఏసీబీ అధికారులు మరోసారి కేటీఆర్‌ను లేదా ఇతర కీలక వ్యక్తులను విచారించే అవకాశం ఉంది. ఈ కేసుపై గవర్నర్ అనుమతి లభించడంతో, రాజకీయ వర్గాలలో, పరిపాలనా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ త్వరలో దాఖలు చేయబోయే చార్జిషీట్‌తో ఈ కేసు విచారణ కీలక మలుపు తిరగనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఇక, 2024లో ఫార్ములా ఈ-కారు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కార్ రేస్ వ్యవహారంలో 2024 డిసెంబర్ నెలలో ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటికే కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను 3 సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. తాజాగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ( ఏసీబీ) అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు. కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా- ఈ కార్ రేసు నిర్వహణ కోసం యూకేకు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్స్ట్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పురపాలకశాఖ 2022 అక్టోబరు 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్ రేస్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ భరించాలి.

# నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

● రేపు తిరిగి పుట్టపర్తికి ముర్ము ప్రయాణం



**హైదరాబాద్,నవంబర్20:** తిరుమల పర్యటన ముగించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం మధ్యాహ్నం 1.10 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఆమె రాజ్ భవన్‌కు వెళ్తారు. మధ్యాహ్నం భోజనం చేసి.. రాజ్ భవన్‌లో విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత 3:50 గంటలకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి ఆమె చేరుకుంటారు. సాయంత్రం 4.00 గంటలకు రాష్ట్రపతి నిలయం వేదికగా నిర్వహించే భారతీయ కళా మహోత్సవాన్ని రాష్ట్రపతి ముర్ము ప్రారంభిస్తారు. తిరిగి సాయంత్రం 6:15 గంటలకు ఆమె తిరిగి రాజ్ భవన్‌కు చేరుకుంటారు. రాత్రి తెలంగాణ రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ముర్ము బస చేయనున్నారు. 22వ తేదీ అంటే..శనివారం ఉదయం 9:30 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో ఆంధ్రప్రదేశ్ శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తికి బయలుదేరి వెళ్తారు.

# బీహార్ సిఎంగా నితీశ్ ప్రమాణం



**పాట్నా,నవంబర్20:** బిహార్ సీఎంగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. సిఎంగా ఆయన ప్రమాణస్వీకారం చేయడం ఇది పదోసారి. పట్నాలోని గాంధీ మైదానంలో నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయగా.. సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హాలకు డిప్యూటీ సీఎం పదవులు దక్కాయి. గవర్నర్ అరీఫ్ మహ్మద్ ఖాన్ సిఎం, మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అదరగొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్డీయే ఏకంగా 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. తాజాగా ప్రమాణస్వీకారం చేసిన 27 మంత్రుల్లో.. 14 మంది బీజేపీ నుంచి కాగా, 9 మంది జేడేయూకు చెందిన నేతలు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పని చేశారు. ఇప్పుడు ఎన్డీయే కూటమి మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో పదోసారి సీఎంగా ప్రమాణం చేశారు. పదోసారి బిహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నితీశ్ రాజకీయంలో ఎంతో అనుభవం ఉన్న నాయకుడు. రాష్ట్రంలో మంచి పాలన అందించిన వ్యక్తి అనే అద్భుతమైన రికార్డు ఆయనకు ఉందని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

# తిరుపతి చేరుకున్న రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

కొలువు తీరిన శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారి తీర్థ ప్రసాదాలను రాష్ట్రపతికి వేద పండితులు అందజేశారు. ఇక రాష్ట్రపతి పర్యటన సందర్భంగా తిరుచానూరు లో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. స్థానికుల రాకపోకలను నిలిపివేశారు. దాంతో స్థానికులు కొంత ఇబ్బంది పడ్డారు. ఇక తిరుచానూరు పర్యటన ముగించుకుని.. సాయంత్రం రోడ్డు మార్గం ద్వారా రాష్ట్రపతి తిరుమల చేరుకుంటారు. రాత్రికి పద్మావతి అతిథి గృహంలో ఆమె బస చేస్తారు. శుక్రవారం ఉదయం శ్రీవెంకటేశ్వర స్వామి వారిని రాష్ట్రపతి దర్శించుకోనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన నేపథ్యంలో తిరుమలలో సైతం పటిష్టమైన భద్రతాను ఏర్పాటు చేశారు. తిరుపతి పర్యటన ముగిసిన అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

# సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

(మొదటి పేజీ తరువాయి)

చేరుకున్నారు. విచారణ అనంతరం జగన్ అక్కడి నుంచి లోటస్‌పాండ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు వైకాపా నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే నిలుచున్నారు. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు జగన్ సీబీఐ కోర్టుకు హాజరుకానున్న నేపథ్యంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ వద్ద వైకాపా కార్యకర్తలు హల్‌చల్ చేశారు. కొందరు రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. ఎయిర్ పోర్టు లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారితో వాగ్వాదానికి దిగారు. మరోవైపు సీబీఐ కోర్టు వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.

# పెట్టుబడులకు హైదరాబాద్ వేదిక

(మొదటి పేజీ తరువాయి)

హాజరవుతారని గవర్నర్ కార్యాలయ కార్యదర్శి దాన కిశోర్ తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వారసత్వం ఇచ్చి పుచ్చుకోవడానికే కాదు ఒకరి ఉత్పత్తులు మరొకరు అమ్మడానికి, కొనడానికి దోహదం చేస్తుందని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి అన్నారు. సంస్కృతి, సహజ వనరుల పరంగా ఈశాన్య రాష్ట్రాలు ఎంతో గొప్పవని.. మన దేశం అతిథి దేవో భవ అంటే వారు అభివృద్ధి దేవో భవ అంటున్నారని తెలిపారు. సంక్షేమ ఫలాలు అందరికీ చేరడమే అసలైన అభివృద్ధి అన్నారు. తొలి రోజు ఉత్తమ ప్రదర్శన కనబరిచిన కళాకారులకు గవర్నర్ బహుమతులు అందజేశారు. మిజోరాం యువజన సర్వీసులు, క్రీడల మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి సన్మానించారు.

# దేశవ్యాప్తంగా

(మొదటి పేజీ తరువాయి)

హోటల్ తాజ్‌కృష్ణలో కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు తినే బియ్యాన్ని సరఫరా చేస్తేనే సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలాగే కేంద్రం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశాన్ని పరిశీలించాలని కేంద్రమంత్రి కోరారు. అవసరమైతే అధ్యయనం చేసి తగు నిర్ణయం తీసుకోవాలని వినతి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. పూర్తిస్థాయి అధ్యయనం తర్వాత పరిశీలించి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణిపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

ముందుగా నిర్వహించకపోతే మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులు ల్యాప్స్ అవుతాయని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న రిజర్వేషన్ల ప్రకారమే 27 శాతం బీసీ రిజర్వేషన్లతో ముందుకు పోతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపారు.

# బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

● జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి









**చర్చ :-కరీంనగర్ :** బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బాలల దినోత్సవ వారోత్సవాల ముగింపు కార్యక్రమం మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలల సంరక్షణ చట్టాల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అన్నారు. స్నేహితా కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ బాలల హక్కులను వివరిస్తున్నామని అన్నారు. బాల బాలికలు తమకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా 1098 హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎలాంటి వేధింపులు ఎదురవుతున్న పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పెట్టెలో ఫిర్యాదు వేయాలని అన్నారు. బాలలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి మాట్లాడుతూ బాల్యవివాహాలను నివారించాలని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లుగా సమాచారం ఉంటే అధికారులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. అలాగే మత్తు పదార్థాల వినియోగం, అమ్మకం గురించి సమాచారం ఉంటే నిర్భయంగా తెలియజేయాలని అన్నారు.
అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్లో పిల్లలకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సైన్ లాంగ్వేజీ లో జాతీయ గేయం పాడిన వారిని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన ప్రభుత్వ క్రీడా పాఠశాల విద్యార్థులను అభినందించారు. పిల్లల దత్తతకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించి బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గంగాధర్, మండల విద్యాధికారి ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు

# నల్గొండ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ లో సులభ కాంప్లెక్స్ సెలవు






**నల్గొండ జిల్లా చర్చ ప్రతినిధి నవంబర్ 20 :**నల్గొండ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ లో కాంప్లెక్స్ ఉన్నటువంటి స్త్రీ పురుషుల వాష్రూమ్స్ నిర్వహణకు ఈరోజు అనగా గురువారం ఇప్పటివరకు స్పందించని డిపో మేనేజర్ దీనికి సంబంధించి అక్కడ ఉన్నటువంటి తాత్కాలిక సిబ్బంది కూడా ఎవరు కనిపియకపోవడంతో ప్రయాణికులు వాష్రూమ్స్ పోవడానికి మహిళలు పురుషులు చాలా ఇబ్బందికరమైన పడి పరిస్థితి ఎదుర్కొంటున్నారు ఇలాంటి విషయాలల్లో కాకుండా చూడాలని అక్కడున్నటువంటి నల్గొండ ఆర్టీసీ ప్రయాణికులు పెద్ద ఎత్తున ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..నిత్యం రద్దీగా ఉండే నల్గొండ డిపో బస్టాండ్ లో సులబ్ కాంప్లెక్స్ పనిచేయకపోవడం చాలా ప్రయాణికులను ఇబ్బందికర పరిస్తితిలోకి నెల్లివేసింది అనేది ప్రధాన అంశం...ఊతవేటు దూరంలో ఉన్న ఉమ్మడి నల్గొండ జిల్లా రీజినల్ ఆఫీస్ సిబ్బంది కానీ అక్కడ ఉన్నటువంటి నిర్వాహకులు గాని ఇలాంటి విషయాల మీద స్పందించకపోవడంతోటి ఆర్టీసీ నల్గొండ బస్టాండ్ లో ప్రయాణిస్తున్నటువంటి అనేకమంది ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు ఇలాంటి పరిస్థితులను ముందస్తుగానే అంచనా వేసుకోవాల్సినటువంటి నల్గొండ డిపో ఆర్టీసీ మేనేజ్మెంట్ ఇప్పటివరకు స్పందించకపోవడం చాలా విచారకరం ఇలాంటి విషయాలను మళ్ళీ పునరుల కావకుండా చూడాలంటూ వివిధ ప్రాంతాలకు నల్గొండ జిల్లా కేంద్రం నుండి వెళున్నటువంటి ప్రయాణికులు పెద్ద ఎత్తున ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇది ప్రస్తుతం నల్గొండ జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి ఆర్టీసీ బస్టాండ్ లో ఉన్నటువంటి సులబ్ కాంప్లెక్స్ సంబంధించిన నిర్వాహక సంబంధించి విషయాలు.....

# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్







**చర్చ బ్యూరో, భద్రాద్రి కొత్తగూడెం :**ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రానున్న నేపథ్యంలో, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. యూనివర్సిటీ క్యాంపస్ మొత్తం పర్యటించిన కలెక్టర్ అకాడమిక్ బ్లాక్ రిపేర్ వర్క్స్, ఆడిటోరియం మరమ్మత్తులు, బాలుర కామన్ మెస్ మరియు బాలికల హాస్టల్ పనుల పురోగతిని పరిశీలించి సంబంధిత శాఖలతో వివరంగా చర్చించారు. ఆడిటోరియంలో మౌలిక వసతులు, సీటింగ్ ఏర్పాట్లు, స్టేజ్ సెటప్, లైటింగ్, ఎలక్ట్రికల్ పనులు వంటి అంశాలన్నీ నాణ్యతతో పూర్తవ్వాలని ఆయన సూచించారు. యూనివర్సిటీ పాత మరియు కొత్త భవనాల సుందరీ కరణ, పార్కింగ్ ప్రాంతాల అభివృద్ధి, క్యాంపస్ అంతటా పరిశుభ్రత, లైటింగ్ పనులను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు%-%సలహాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి ప్రారంభించే శిలాఫలకం ఏర్పాట్లను కూడా పరిశీలించి, దాని వద్ద ఏర్పాట్లు ఆకర్షణీయంగా, సముచిత ప్రమాణాలతో ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల వసతి గృహాల్లో ఫర్నిచర్ అమరిక, నీటి సదుపాయాలు, శౌచాలయాల మరమ్మత్తులు, వసతి ప్రాంతాల పరిశుభ్రత వంటి అంశాలను కూడా ఆయన సమీక్షించారు. క్యాంపస్ ఆవరణ మొత్తం పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలు నాటడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కళాశాల ప్రిన్సిపల్ డా. జగన్మోహన్ రాజును కలెక్టర్ ప్రత్యేకంగా ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యూనివర్సిటీ ప్రారంభోత్సవం జిల్లాకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమని, అన్ని ఏర్పాట్లు అత్యున్నత నాణ్యతతో పూర్తవ్వాలని సూచించారు. విద్యా రంగంలో జిల్లాకు ఇది ఒక ప్రధాన మైలురాయి అవుతుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అన్ని శాఖల సమిష్టి బాధ్యత అని స్పష్టం చేశారు. అధికారులు అత్యంత వేగం మరియు శ్రద్ధతో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాత, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాస్, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు లో సిపిఐ జనసేవాధల్ శిక్షణ

● డిసెంబర్ 26న ఖమ్మం లో జరుగు బహిరంగ సభ కు సిద్ధం కండి

● కవాతు ను ప్రారంభించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు-ముత్యాల విశ్వనాథం





**చర్చ బ్యూరో,భద్రాద్రి కొత్తగూడెం :**మణుగూరులో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో జన సేవాదళ్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం మణుగూరు నేతాజీ సుభాష్ చంద్రబోస్ గ్రౌండ్లో ఉదయం 10 గంటలకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం ప్రారంభించారు. సీపీఐ జనసేవాధల్ శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం హాజరై మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాల శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు ఖమ్మం నగరంలో కనివిని ఎరుగని రీతిలో 5 లక్షల మంది తో బారి ప్రదర్శన , మీటింగ్ నిర్వహించనున్నామని, దీనికి 40 దేశాలనుండి ప్రతినిధులు , జాతీయ నాయకులు హాజరు కానున్నారని, దీనికి రెడ్ షర్ట్స్ వాలంటరీ ఎర్ర జెండా కవాతు, ముందు భాగాన నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి,జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ పహీం, మణుగూరు మండల పట్టణ కార్యదర్శిలు లు జక్కుల రాజబాబు, దుర్గ్యాల సుధాకర్ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్ , జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, ఎడారి రమేష్, అశ్వాపురం మండల కార్యదర్శి అనంతనేని సురేష్,, ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల భిక్షం గడ్డం వెంకటేశ్వర్లు, మహిళా సమైక్య కార్యదర్శు సమ్మక్క ప్రమీల చిదేం ఉష, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్ కొత్తపల్లి సీతారాములు, అదెర్ల సురేందర్ , ఎస్డి ఉమర్, ఆసిఫ్ నాయకులు పవన సాయి, అక్కినపల్లి నాగేంద్రబాబు లు పాల్గొనగా సుమారు 100 వాలంటరీ శిక్షణ లో పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకలు నిర్వహించండి



**చర్చ:- హుస్నాబాద్:**ముదిరాజులే మత్స్యకారులు మత్స్యకారులే ముదిరాజులు అనే నినాదంతో 21 నవంబర్ 2014 న ముదిరాజ్ మహాసభ ఆవిర్భవించింది రేపు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11 వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా గ్రామ గ్రామాల్లో ముదిరాజ్ జెండా ఎగురవేయాలని ఈరోజు హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు పొన్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ గారి ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్చార్జి చొప్పరి శ్రీనివాస్ ముదిరాజు గారు నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు పెండ్యాల ఐలయ్యగారు పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ అధ్యక్షులు పొన్నం మల్లయ్య, అక్కన్నపేట సొసైటీ, మండల అధ్యక్షులు గంగాధర్ రాజయ్య, కాశబోయిన యాదగిరి పొట్లపల్లి అధ్యక్షులు బోడ శంకర్, హుస్నాబాద్ కార్యదర్శి రాగుల శీను,కూరగాయల రవి,రాగుల కనకయ్య తదితరులు పాల్గొన్నారు పొన్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ తెలంగాణ ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ మండల అధ్యక్షులు

# సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సుడా చైర్మన్





**చర్చ :- కరీంనగర్ :**వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రులలో చికిత్స పొంది అర్హత గల వారిని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో 18 మందికి మొత్తం కలిపి 6 లక్షల 70 వేల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఇప్పటి వరకు 846 మందిని నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా ఆదుకున్నామని కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే మా కోరిక అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. లబ్ధి దారులు జుట్టు లక్ష్మీనారాయణ,దారం స్రవంతి,దర్యపల్లి వాణి,పురుమల్ల శ్రీలత,ముజీబున్నీసా బేగం, యాసమీన్ ఫాదౌస్,గుర్రం సురేష్, యెన్నం మహిపాల్,సైద్ సుమర్,మహంకాళి ప్రసాద్,అహ్మద్ అలీ,భూలక్ష్మి,రాజేంద్ర ప్రసాద్, మాచర్ల శేఖర్,సుతారి మల్లేశం, సయ్యద్ మస్తాన్,గుంటి మల్లయ్య,కిష్టయ్య లకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు అగ్రిమెంటు ఇచ్చే బాధ్యతలు ప్రభుత్వమే చేపట్టాలి

● సత్తుపల్లి సిపిఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి డిమాండ్...



**చర్చ, సత్తుపల్లి:**ఖమ్మం జిల్లాలో మొక్కజొన్న వేసే రైతులకు రాశి ,బియర్ కంపెనీల నుండి అగ్రిమెంట్లు ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని సిపిఎం పార్టీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కల్లూరు లో చింతలపూడి జగ్గయ్య భవనం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం అధిక వర్షాల వల్ల పత్తి పంటలు దెబ్బతినడంతో రైతులందరూ మొక్కజొన్న వైపు మొగ్గ చూపడంతో కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చి రైతులను మోసం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. కల్లూరు మండలం లో ఇప్పటికే అగ్రిమెంట్ లేకుండా సుమారు 2 వందల ఎకరాలు మొక్కజొన్న వేశారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న వేసే రైతులకు రాసి, బేయర్ కంపెనీలతో అగ్రిమెంట్లను రాపిచ్చి గిట్టుబాటు ధర కల్పించి రైతులకు నష్టం కలవకుండా చూసే బాధ్యత తీసుకోవాలని అన్నారు. భారతదేశంలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులు కమ్ముకున్నాయని ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు వలన కార్పొరేట్ శక్తులు అన్నీ ముందుకు వచ్చాయని రైతులను నట్టేట ముచ్చుతున్నాయని ఆరోపించారు. రైతులకు అగ్రిమెంట్ ఇప్పించే బాధ్యత ప్రభుత్వందేనని వెంటనే చొరవ తీసుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కార్యవర్గ సభ్యులు తన్నీరు కృష్ణార్జునరావు, మండల కమిటీ సభ్యురాలు తన్నీర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

# సొసైటీ చైర్మన్ మండె హనుమంతరావు కి సన్మానం




**చర్చ, కొత్తగూడెం :**తెలంగాణ సహకార సంఘం హైదరాబాద్ వారి అధ్వర్యంలో నవంబర్ 14 నుండి నవంబర్ 20 వ తారీకు వరకు నిర్వహిస్తున్న అఖిలభారత 72వ సహకార సంఘం వారోత్సవాల సందర్భంగా కొత్తగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులుగా 2005 సంవత్సరం నుండి నేటివరకు అనగా, గత 23 సంవత్సరముల నుండి సేవలు అందింస్తూన్నందుకు గాను, మండె వీరహనుమంతరావు కొత్తగూడెం సంఘం ను సుమారు 2 కొట్ల రూపాయల లాభాలతో నడిపిస్తూన్నందుకు గాను, కొత్తగూడెం సంఘంనకు సుజాతనగర్ గొదాము నందు 300 టన్నుల సామర్థ్యం గా గొదాము నిర్మించటం మరియు రామవరం నందు సుమారు 20 కుంటల సొంత స్థలం ఏర్పాటు చేసుకొవటం మరియు కొత్తగూడెం సంఘం ద్వార మండె వీరహనుమంతరావు అధ్యక్షతన సుమారు 2 కొట్ల రుపాయల విలువ గాల ఎరువులను ప్రతి సంవత్సరం రైతులకు అందింస్తూన్నందుకు గాను, సబ్సిడి పై విత్తనాలు అందింస్తూన్నందుకు గాను, రైతు పండించిన వరి, మొక్కజొన్న, కందులు మొదలగు పంటలను కూడా ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ నిరంతరం రైతులకు సేవ చేస్తున్న సొసైటి చైర్మన్ మండె వీరహనుమంతరావు సేవలను గుర్తిస్తూ సహకార యూనియాన్ వారు ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రం అందజేసారు. ఈ కార్యక్రమానికి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి అన్నపూర్ణ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా నల్గొండ డీసీసీబీ చైర్మెన్ కుంభం శ్రీనివాస రెడ్డి, ఎన్ఏఎఫ్ సిబి వైస్ చైర్మెన్ మరియు కరీంనగర్ డీసీసీబీ చైర్మెన్ కొండూరు రవీందర్ రావు పలు సంఘాల చైర్మెన్ లు పాల్గోన్నారు.

## కొత్తగూడెం పట్టణంలో అన్నపూర్ణ సేవ ట్రస్ట్ వారి సారధ్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం






చర్చ, కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణంలో అన్నపూర్ణ సేవా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో గురువారం అమావాస్య రోజు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తూము చౌదరి, కోనేరు చిన్ని పాల్గొని అన్నప్రసాద వితరణ ప్రారంభం చేశారు. ఈసందర్భంగా అతిథులు మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రతి పౌర్ణమి అమావాస్య రోజున ఈ కార్యక్రమం ఘనంగా జరుగుతుందని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూణెం శ్రీనివాస్, మైనార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ గౌస్ పాషా, దళిత హక్కుల నాయకులు అంతడపుల కృష్ణ, మాజీ సర్పంచ్ బండ వెంకటేశ్వర్లు, ఎండీ అయబ్ ఖాన్, బహుజన నాయకులు ఉయ్యూరు.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

### ఇల్లందు నియోజకవర్గం జగదాంబ సెంటర్ నుండి ప్రభుత్వ పాఠశాల నడుమ పురపాలక సంఘం అధ్వర్యంలో నిర్మించిన షాపులను ఎమ్మెల్యే కనకయ్య పరిశీలన

- స్థానిక వ్యాపారులతో ఎమ్మెల్యే మాట మంతి
- రోడ్డు పై వ్యాపారం కొనసాగిస్తున్న వ్యాపారులతో పురపాలక షాపులలో వ్యాపారం కొనసాగించాలని ఎమ్మెల్యే సూచన.
- లైవ్ లో వ్యాపారం చేస్తున్న వారికే షాపులు కేటాయించాలని పురపాలక అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం





చర్చ బ్యూరో, భద్రాద్రి కొత్తగూడెం :ఇల్లందు మున్సిపాలిటి పరిధిలో గల జగదాంబ సెంటర్ నుండి ప్రభుత్వ పాఠశాల నడుమ పురపాలక సంఘం అధ్వర్యంలో నిర్మించిన షాపులను కలియతిరిగి స్థానికంగా రోడ్డుపై వ్యాపారం కొనసాగిస్తున్న వ్యాపారులకు పురపాలక షాపులలో వ్యాపారం కొనసాగించాలని సూచన చేసి, లైవ్ లో వ్యాపారం కొనసాగిస్తున్న వారికే షాపులు కేటాయించాల్సిందిగా పురపాలక అధికారులకు అదేశాలు జారి చేసిన ఇల్లందు నియోజకవర్గం గౌరవ శాసన సభ్యులు శ్రీ కోరం కనకయ్య. ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు,ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపిపి మండల రాంమహేష్, పురపాలక కమిషనర్ శ్రీకాంత్, నాయకులు మడుగు సాంబ మూర్తి,బోళ్ళ సూర్యం, చిల్లా శ్రీనివాస్, హరిహరక్షేత్రం చైర్మెన్ గందె సదానందం, పురపాలక అధికారులు తదితరులు ఉన్నారు.

## గ్యాస్ సబ్సిడీ పొందాలంటే ఈ కెవైసి చేయించుకోవాలి

- కొత్తగూడెం సివిల్ సప్లై హెచ్‌పి గ్యాస్ మేనేజర్ ఎం.ఎ. అలీం



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:గ్యాస్ వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సిడీ పొందడానికి గ్యాస్ కనెక్షన్‌ను ఈకెవైసి చేయించుకోవాలని కొత్తగూడెం సివిల్ సప్లైస్ హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ ఎం.ఎ.అలీం ఒక ప్రకటనలో తెలిపారు. స్వీయ బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ, గ్యాస్ డెలివరీ బాయ్ ద్వారా బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ చేసుకోవాలని సూచించారు. కొంతమంది గ్యాస్ వినియోగదారులు చనిపోవడం వలన వారి యొక్క ఈకేవైసీ చేయటానికి వీలులేనందున వారి కుటుంబ సభ్యులలో మరొకరి పేరు మీద గ్యాస్ కనెక్షన్ మార్చుకోవలసి ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు చాలామంది వినియోగదారుల వారసుల పేరు మీద గ్యాస్ కనెక్షన్ మార్చుకోని వారి వివరాలను సివిల్ సప్లయ్స్ కార్యాలయం నోటీసు బోర్డులో ప్రచురించడం జరిగిందని తెలిపారు. వారంరోజుల్లో ఏమైనా అభ్యంతరములు ఉన్నచో తెలియజేయాలని సూచించారు. అనంతరం నోటీసు బోర్డులో ప్రచురించబడిన కన్స్యూమర్ నెంబర్లను తాత్కాలికంగా హోల్డ్ చేయబడుతుందన్నారు. ఎవరైతే వినియోగదారులు ఇప్పటివరకు ఈకేవైసీ చేసుకోలేదో, వారు తప్పనిసరిగా ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు. లేనిపక్షంలో వారికి రాష్ట్ర ప్రభుత్వం వారిచే వచ్చే సబ్సిడి శాశ్వతముగా నిలిచిపోతుందని హెచ్చరించారు. ఇతర వివరాలకు కొత్తగూడెం హెచ్‌పి గ్యాస్ కార్యాలయం, 08744 242340ను సంప్రదించాలని కోరారు.

## గ్రంధాలయాలు జ్ఞానానికినిలయాలు,పుస్తకాలు జ్ఞానాన్నిపెంపొందిస్తాయి

ఫోన్ వదలండి పుస్తకం పట్టండి



చర్చ, సత్తుపల్లి:58వ జిల్లా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక విశ్వశాంతి విద్యాలయం విద్యార్థులు సత్తుపల్లి శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు.
అక్కడ వివిధ రకాల అరుదైన పుస్తకాలను,



చారిత్రక గ్రంథాలను పరిశీలించారు. వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులతో మాట్లాడారు.
కథలు పుస్తకాలు, ప్రముఖుల జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలు, చరిత్ర సంస్కృతి , ప్రముఖుల విజయ గాదులకు పుస్తకాలను పరిశీలించారు.పుస్తక ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకులు మల్లికార్జున రావు మాట్లాడుతూ...గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు...విజ్ఞాన భాండాగారాలు. బుక్ రీడింగ్ తో విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సెల్ఫోన్ వ్యసనము వదిలి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విశ్వశాంతి ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ... జ్ఞానానికి నిలయమైన గ్రంథాలయం అందరికీ ఉచితంగా జ్ఞానం అందిస్తుంది అన్నారు.

## మావోయిస్టు చీఫ్ తిప్పరి తిరుపతి ఆచూకీ ఎక్కడ

- నెక్ట్స్ టార్గెట్ తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ






హైదరాబాద్, (చర్చ):మావోయిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, ఎక్కడున్నారు అన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ సరిహద్దు అటవీ ప్రాంతమైన మారేడుమిల్లి టైగర్ ఫారెస్ట్ లో నిన్న జరిగిన ఎన్కౌంటర్లో హిడ్మాతో పాటు ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు.
ఈ క్రమంలో దేవ్ జీ, ఎక్కడున్నాడు అనే చర్చ ప్రారంభమైంది.. తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, నిన్న జరిగిన ఎన్కౌంటర్ నుంచి తప్పించుకున్నాడా? లేక పోలీసుల అదుపులో ఉన్నా డా? అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.... అయితే ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీపీ, మహేష్ చంద్ర లడ్డా, మీడియా సమావేశంలో దేవ్ జీ,తను పోలీసుల అదుపులో లేరని ప్రకటించారు. దీంతో ఆయన ఎక్కడ ఉన్నారనేది చర్చ మొదలైంది..మావోయిస్టులు తమ సానుభూతిపరులను విజయవాడతోపాటు ఇతర ప్రాంతాల్లో రెక్కి నిర్వహిం చేందుకు తమవెంట తీసుకొచ్చి ఉంటారని అనుమానిస్తున్నారు. పలు చోట్ల డంప్‌లు ఏర్పాటు చేసినట్లు పోలీసులకు అందిన సమాచారంతో వాటి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. మరోవైపు భద్రత భద్రతా బలగాల నెక్ట్స్ టార్గెట్ తిప్పిరి తిరుపతి అలియాస్? దేవ్ జీ..! ఇప్పుడు ఇతని కోసమే గాలింపు కొనసాగుతోంది. ప్రస్తుతం ఆంధ్రా– ఒడిశా సరిహద్దుల్లో దేవ్ జీ ఉన్నట్లు భద్రత బలగాల అనుమానం మొత్తంగా ఓవైపు మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా భద్రతా బలగాలు ముందుకు సాగుతుండగా.. మరో వైపు మావోయిస్టు దళాలకు, నాయకత్వానికి పట్టణ ప్రాంతాల నుంచి ఆర్థిక, సైద్ధాంతిక మద్దతునిస్తున్న వారిపై కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు దృష్టి సారించాయి.

## స్థానిక సంస్థ ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని





చర్చ :- కరీంనగర్ నవంబర్ 20, 2025: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డి.జి.పి. శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు – కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులతో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతిభద్రతల అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికలను 3 విడతలలో నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్థవంతంగా అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందని అన్నారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డిఆర్వో వెంకటేశ్వర్లు, జెడ్పి సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.


## మీసేవ కేంద్రాల ఆకస్మిక తనిఖీ




చర్చ, కొత్తగూడెం: జిల్లాలోని పలు మండలాల్లోగల మీసేవా కేంద్రాలను ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు, టి.జి.టి.ఎస్ జిల్లా మేనేజర్ కృష్ణమూర్తి కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, కొత్తగూడెం మండలాల్లోని మీ సేవా కేంద్రాలను తనిఖీ చేసి మీసేవ కేంద్రాల నిర్వహణ, శుభ్రత, సాంకేతిక వసతులు, సిబ్బంది ప్రవర్తన, సేవల వేగం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. కేంద్రాలకు వచ్చే ప్రజలు సమర్పిస్తున్న దరఖాస్తులు ముఖ్యంగా ఆదాయ ధ్రువపత్రాలు, మౌలిక వృత్తి ధ్రువపత్రాలు, రేషన్ కార్డులు, జనన/మరణ ధ్రువపత్రాలు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తులు, వాటి ప్రాసెసింగ్ స్థితిని పరిశీలించారు. మీసేవ ఆపరేటర్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రామాణిక రుసుముల ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని అధికారులు స్పష్టం చేశారు. సూచిక బోర్డులు, సేవల జాబితా, సేవలకు సంబంధించిన రుసుముల వివరాలు కేంద్రంలో స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక రుసు ములు వసూలు చేయరాదని, అలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ప్రజలను ఎట్టి విధంగానూ మో సగించకూడదనీ, పారదర్శకతతో సేవలు అంది ంచాలనీ, ప్రతి వినియోగదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని వారు సూచించారు.

## వేంసూరులో రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- నన్నాపేదెవరు అంటున్నా పట్టించుకోని మైనింగ్ అధికారులు



చర్చ, సత్తుపల్లి:ఖమ్మం జిల్లా, వేంసూరు మండలంలోని ఎర్రగుంటపాడు గ్రామం అక్రమ మట్టిదందాతో అల్లకల్లోల మవుతోంది.తమ సొంత స్థలంలో లేదా వ్యవసాయ భూమి లో మట్టి త్రవ్వుకోవడానికి సదరు యజమానులు ప్రభుత్వ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది అలాంటిది ఎవరి మామూళ్లు వాళ్ళకి ఇచ్చాం మమ్మల్ని ఎవరు అడ్డుకుంటారు?" అన్నట్టు మట్టి మాఫియా రెచ్చిపోతూ మూడు పువ్వులు ఆరు కాయలుగా,రాజకీయ పరిరక్షణతో రోజూ రాత్రింబగళ్లూ మట్టి టిప్పర్లు గ్రామ రహదా రులపై అడ్డూఅదుపు లేకుండా తిరుగుతు న్నాయి.గ్రామ పరిసరాల్లో గుట్టలు కరిగిపో యేంతగా మట్టి తవ్వకాలు సాగుతున్నా సహజ వనరులు ధ్వంసం ఔతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసులు సహా సంబంధిత శాఖలు మాత్రం కనిపించకుండా పోయాయి. అధికారుల నిర్లక్ష్యం మట్టి మాఫియాకు మరింత బలం చేకూర్చింది. ఈ అక్రమాల ద్వారా కొందరు వ్యక్తులు లక్షలాది రూపాయలు సంపా దిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ అధికారుల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా నిరంతరం తిరుగుతున్న అక్రమ మట్టి టిప్పర్ల వలన గ్రామ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంటపొలాలకు వెళ్లే రైతులు ప్రతి రోజూ ఇబ్బందులు పడుతున్నారు. చిన్న వాహనాలు, ఆటోలు సైతం వెళ్లలేని దుస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు.మట్టి టిప్పర్లు దూసుకు పోతుంటే ప్రజల సమస్యలు ఎవరి దృష్టికి రావు అని గ్రామస్తుల వేదన.ఎర్రగుంటపాడు గ్రామ ప్రజలు తక్షణమే అధికార యంత్రాంగం మొద్దు నిద్ర వీడి స్పందించి అక్రమ మట్టిదందాను అరికట్టాలని, గ్రామ రహదారులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల నుండి లంచం తీసుకున్న రేగళ్ళపాడు సెక్రటరీ సస్పెండ్



చర్చ, సత్తుపల్లి:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఎలాంటి అవినీతికి తావు లేకుండా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం కొంతమంది అధికారుల వల్ల అభాసుపాలు కావడానికి ఎట్టి పరిస్థితుల్లో సహించదు అనడానికి నిదర్శనం ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల నుండి లంచం తీసుకున్న రేగళ్ళపాడు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్ .ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేగళ్లపాడు గ్రామపంచాయతీ లోని లబ్ధిదారులు టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి రేగళ్లపాడు గ్రామపంచాయతీ సెక్రటరీ శివ మాధవరావు పై ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ వద్ద డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేయడం జరిగింది. దీనిపై వెంటనే స్పందించిన హౌసింగ్ ఎండి వీపీ గౌతమ్ విచారణ అధికారిగా పీడీ శ్రీనివాస్ ను నియమించి పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక అందిన వెంటనే జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. హౌసింగ్ ఎండి ఆదేశాలు అందిన వెంటనే ఖమ్మం జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ బుధవారం సాయంత్రం రేగళ్లపాడు గ్రామపంచాయతీ సెక్రటరీ శివ మాధవరావును సస్పెండ్ చేయడం జరిగింది.

## ముగిసిన గ్రంధాలయ వారోత్సవాలు



చర్చ, కొత్తగూడెం:జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ముఖ్య అత్యిధిగా హాజరైన కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ చేతులమీదుగా బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ రెహమాన్ మాట్లాడుతూ శ్రద్ధగా చదివి మంచి పేరు తెచ్చుకోవాలని, తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు, సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని, ఫోన్‌లలో పుస్తకాలు చదవడం వల్ల సమయం వృథా అవుతుందన్నారు. చిన్నతనం నుంచి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, ఇలా అలవాటు చేసుకున్న వారు తప్పనిసరిగా ఒక ఉన్నత స్థానంలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి నాగ సీతారాములు, కాంగ్రెస్ మహిళా అధ్యక్షులు తోట దేవి ప్రసన్న, గ్రంథాలయ కార్యదర్శి కే. కరుణ కుమారి, ఆఫీస్ ఇంచార్జ్ ఎం.నవీన్ కుమార్, గ్రంథపాలకురాలు మణి మృదుల, మధుబాబు, వంశీకృష్ణ, వాణి, రుక్మిణి, గీత, గ్రంథాలయ సిబ్బంది, కాంగ్రెస్ యువజన నాయకుడు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖోఖో జిల్లా జట్టు ఎంపిక



చర్చ, సత్తుపల్లి:ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్ 17 సంవత్సరాల బాలురు, బాలికల ఖమ్మం జిల్లా ఖోఖో జట్టు ఎంపిక చేయబడిందని సెలక్షన్ కమిటీ తెలిపారు. స్థానిక మినీ స్టేడియం క్రీడా ప్రాంగణంలో గురువారం 150 మంది క్రీడాకారులు భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం జిల్లాలో నలుమూలల నుంచి పాల్గొన్నారు.వీరిలో అత్యంత ప్రతిభ కనపరచినటువంటి క్రీడాకారులను ఎంపిక చేసినారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు సెలెక్ట్ చేయబడిన క్రీడాకారులు యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగేటటువంటి రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య కార్యదర్శి వై రామారావు,మండల విద్యాశాఖ అధికారి పత్తిపాటి నివేదిత,ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడ బీమా, పసుపులేటి వీరరాఘవయ్య,సెలక్షన్ కమిటీ మెంబర్స్ పి నర్సయ్య, ఎస్ రామారావు, నక్క వెంకటేశ్వర్లు,ఏ కృష్ణ పవన్ కుమార్ వి కృష్ణారావు, వి రాజకుమారి,జి రమాదేవి, ఎస్కే రంజాన్,స్టేడియం కోర్సెస్ గౌతమ్, గోపి, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ దర్శకులు పాల్గొని క్రీడలను విజయవంతం చేయడం జరిగినది.క్రీడలలో పాల్గొనటానికి వచ్చినటువంటి 150 మంది క్రీడాకారులకు ఉచిత భోజనం వసతి ఏర్పాటు చేసిన పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఖమ్మం వాటికి కృతజ్ఞతలు తెలిపారు.

## హక్కులను సాధించుకునేందుకు కృషి చేయాలి



చర్చ. పాల్వంచ: స్థానిక బంజారా భవన్ లో గురువారం బంజారా జేఏసీ ముఖ్య కార్యవర్గ సమావేశం ఏసీ ప్రధాన కార్యదర్శులు భూక్య చందు నాయక్ బానోత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు, రేగళ్ల క్రాస్ రోడ్ లో తుల్జా భవాని జాతర, బంజారా వన భోజనాలు, సేవాలాల్ గుడి నిర్మాణం పలు అంశాలపై చర్చించారు ముఖ్యఅతిథిగా జేఏసీ చైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్ పాల్గొని ఆయన మాట్లాడుతూ కమిటీని ఉద్దేశించి అందరూ మన ఏదైతే మన నిర్ణయాలను మన ఎజెండాను మన కు సంబంధించిన హక్కులను సాధించుకునేందుకు కృషి చేయాలన్నారు అలాగే భద్రాద్రి జిల్లాకు సంబంధించిన జేఏసీ నాయకులు అందరు పాల్గొని జరగబోయే నిర్ణయాలను విజయవంతం చేయాలని కోరారు
ఈ సభకు బంజారా భవన్ అధ్యక్షులు బాలు నాయక్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య చందు నాయక్ సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు బద్రు నాయక్ శివా నాయక్ యువసేన జిల్లా అధ్యక్షులు భరత్ నాయక్ పాల్వంచ మండల అధ్యక్షుడు పరమేష్ నాయక్ కోర రాములు బానోతు నాగేశ్వరావు వీరన్ గాంధీ సేవాలాల్ సేన మహిళా ప్రధాన కార్యదర్శి మంజుల బాయ్ సూరారం మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్ ఇస్లావత్ రాందాస్ నాయక్ రవి నాయక్ హీరాలల్ బాలకృష్ణ జవాన్ బానోత్ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని సందర్శించిన ఉప కమిషనర్



చర్చ:- హుస్నాబాద్: శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని సందర్శించినదేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ ఉప కమిషనర్ కే ఎన్ సంధ్యారాణి , సిద్దిపేట జిల్లా ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయానికి సంబంధించిన సర్వేనెంబర్ 265 లోని విస్తీర్ణం నాలుగు ఎకరాల నాలుగు గుంటలు భూమిపై విచారణ నిర్వహించడం జరిగింది. అనంతరం దేవాలయంలో జరుగుచున్న అభివృద్ధి పనుల గురించి సమీక్షించారు. అనంతరం ఆలయ ఈవో పి. కిషన్ రావు వారికి తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న, మాజీ ఆలయ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ గౌడ్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిత్తారి రవీందర్, నాయకులు ఉన్న సది, వడ్డేపల్లి వెంకట రమణ, పూదరి శ్రీనివాస్ గౌడ్, పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, షర్ఫుద్దీన్, పెరుమాండ్ల నర్సాగౌడ్, పూదరి చంద్రమౌళి, గౌడ్, పూదరి వరప్రసాద్ గౌడ్, మరియాల రాజిరెడ్డి, దేవాలయ సిబ్బంది తాటికొండ పరమేశ్వర్ శర్మ, అర్చకులు నీల కుమారస్వామి, హనుమంతు, గీకురు రమేష్, రాజయ్య, వీర రాజు పాల్గొన్నారు.

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
నవంబర్ 21, 2025



# పోలీసులపై పెరిగిన భరోసా.. 'డయల్ 100' అద్భుత విజయం

- ఆపదలో మేమున్నామంటూ ఒక్క కాల్‌తో ముందుకొస్తున్న కరీంనగర్ పోలీసులు
- కరీంనగర్ కమీషనరేటులో విజయవంతంగా అమలవుతున్న "నేర నివారణాత్మక పోలీసింగ్" (ప్రివేంటివ్ పోలీసింగ్) విధానం.
- 10 నెలల్లో 43 వేల మందికి తక్షణ సాయం
- మహిళల్లో పెరిగిన చైతన్యం – ధైర్యంగా ఫిర్యాదులు
- నేరాల నియంత్రణలో 'బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్' భేష్
- కరీంనగర్ పోలీస్ కమీషనర్ – గౌష్ ఆలం





**చర్చ బ్యూరో :-కరీంనగర్ :**"ఆపదొస్తే 100కి కాల్ చేయండి.. పోలీసులు క్షణాల్లో మీ ముందుంటారు.." అనే నినాదం కరీంనగర్ కమీషనరేటులో వందశాతం అమలవుతోంది. ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం రెట్టింపయ్యింది. ఏ చిన్న సమస్య వచ్చినా, అర్ధరాత్రి ఆపద వచ్చినా 'డయల్ 100' ఆపద్బాంధవుడిలా మారుతోంది. జిల్లా పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ, బ్లూ కోల్ట్స్ సిబ్బంది అంకితభావం వెరసి.. గడిచిన 10 నెలల్లో (జనవరి 1, 2025 నుండి అక్టోబర్ 31, 2025 వరకు) ఏకంగా 43,105 మంది బాధితులకు పోలీసులు అండగా నిలిచారు. ఇది కేవలం సంఖ్య మాత్రమే కాదు.. 43 వేల సార్లు పోలీసులు ప్రజల చెంతకు చేరి వారికి భరోసా కల్పించిన వైనం.

### సమస్య చిన్నదైనా.. స్పందన వేగవంతం:

గతంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితుల నుండి, నేడు ఫోన్ చేస్తే చాలు పోలీసులు ఇంటి ముందే వాలతున్నారంటే 'డయల్ 100' ఎంత విజయవంతమైందో అర్థం చేసుకోవచ్చు. లి మొత్తం కాల్స్‌లో అత్యధికంగా 22,830 కాల్స్ చిన్న చిన్న తగాదాలు, న్యూసెన్స్ వంటి వాటికి సంబంధించినవే ఉన్నాయి. దీన్ని బట్టి గొడవ పెద్దది కాకముందే పోలీసులు జోక్యం చేసుకుని, కౌన్సిలింగ్ ఇచ్చి శాంతిభద్రతలను కాపాడుతున్నారని స్పష్టమవుతోంది.

### మహిళల్లో వెల్లువెత్తిన ధైర్యం:

మహిళా భద్రత విషయంలో జిల్లా పోలీసులు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఒకప్పుడు వేధింపులను మౌనంగా భరించే మహిళలు, ఇప్పుడు ధైర్యంగా డయల్ 100ని ఆశ్రయిస్తున్నారు. గత పది నెలల్లో 5,641 మంది మహిళలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తెచ్చారు. దీనివల్ల ఎంతోమంది మహిళలకు తక్షణ రక్షణ లభించడమే కాకుండా, నేరస్థులకు పోలీసులు గట్టి హెచ్చరికలు జారీ చేయగలిగారు. ఈ చైతన్యం మహిళా సాధికారతకు నిదర్శనం.

### పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత సేవలు:

అర్బన్ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ డయల్ 100 సేవలు విస్తృతం అయ్యాయి. అత్యధిక జనసాంద్రత కలిగిన కరీంనగర్ టూ టౌన్ (5,176 కాల్స్), కరీంనగర్ వన్ టౌన్ (5,006 కాల్స్) పరిధిలో పోలీసులు రికార్డు స్థాయిలో సేవలు అందించారు. కరీంనగర్ నగర శివార్ల పరిధిగాగల కొత్తపల్లి (3,803), కరీంనగర్ రూరల్ (3,486) స్టేషన్ల పరిధిలోనూ ప్రజలు పోలీసు సేవలను విస్తృతంగా వినియోగించుకుంటున్నారు.

### ప్రాణదాతలుగా పోలీసులు:

కేవలం నేరాలే కాదు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు కూడా ప్రజలు అంబులెన్స్ కంటే ముందు 100కే కాల్ చేస్తున్నారు. ఇలా 2,288 రోడ్డు ప్రమాద ఘటనల్లో పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించి ఎంతోమంది ప్రాణాలను కాపాడారు. అలాగే 561 ఆత్మహత్యాయత్న ఘటనల్లో సమయానికి స్పందించి నిండు ప్రాణాలను నిలబెట్టారు. మొత్తంగా చూస్తే.. కరీంనగర్ జిల్లాలో 'డయల్ 100' అనేది కేవలం ఒక నంబర్ కాదు, అది ప్రజల రక్షణ కవచం అని ఈ గణాంకాలు ఘంటాపథంగా చెబుతున్నాయి.

### కొన్ని ఉదాహరణలు

1. కొత్తపల్లి మండలం బావుపేటలో కుటుంబ గొడవలతో వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించిన సన్నీ (దయాసాగర్) అనే యువకుడిని కానిస్టేబుల్ విజయరావు రక్షించారు. గత జూన్ నెలలో 01వ తేదీన ఆదివారం డయల్ 100 సమాచారం అందగానే ఘటనా స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్, యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యను పరిష్కరించి అతన్ని సురక్షితంగా కిందకు దించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ విజయరావును అప్పటి ఎస్సై సాంబమూర్తి అభినందించారు.

2. కుటుంబ సమస్యలతో శనివారం అర్ధరాత్రి ఎల్ఎండీ డ్యామ్ వద్ద ఆత్మహత్యకు యత్నించిన వేల్పుల సంపత్ (39) అనే వ్యక్తిని బ్లూ కోల్ట్స్ హోంగార్డు మామిడిపల్లి శ్రీనివాస్ సమయస్ఫూర్తితో కాపాడారు. బాధితుడికి కౌన్సెలింగ్ ఇచ్చి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ శ్రీనివాస్ ను సీపీ గౌష్ ఆలం అభినందించారు.

### ప్రజల నమ్మకానికి నిదర్శనం – ఈ అంకెలే సాక్ష్యం

(01.01.2025 నుండి 31.10.2025 వరకు)
మొత్తం అందిన పిలుపులు: 43,105
చిన్న సమస్యలు న్యూసెన్స్ పరిష్కారం 22,830
వ్యక్తిగత తగాదాల నివారణ 8,754
మహిళలకు రక్షణగా 5,641
ఆస్తి రక్షణలో 3,031
క్షతగాత్రులకు సాయం 2,288
ప్రాణాలను కాపాడినవి 561,
కమీషనరేట్ వ్యాప్తంగా ఈ పదినెలల్లో డయల్ 100 ద్వారా అత్యధిక సేవలు అందించిన మొదటి మూడు పోలీసు స్టేషన్లు వరుసగా:
కరీంనగర్ టూ టౌన్ (5,176)
కరీంనగర్ వన్ టౌన్ (5,006)
కొత్తపల్లి (3,803)

### పోలీసు కమీషనర్ గౌష్ ఆలం వివరణ – విజ్ఞప్తి:

న్యూసెన్స్ కాల్స్ ఎక్కువగా రావడం ఆందోళనకరం, "డయల్–100" సేవలు ప్రజల అత్యవసర సమస్యలను పరిష్కరించేందుకు అత్యంత కీలకమైనది. అయితే, మొత్తం 43,105 కాల్స్‌లో, 22,830 కాల్స్ న్యూసెన్స్, పునరావృత కాల్స్‌గా నమోదవడం పోలీసు విభాగానికి భారంగా మారుతోంది. ఈ కాల్స్ వల్ల నిజమైన అత్యవసర ఫిర్యాదులపై స్పందనలో ఆలస్యం ఏర్పడే అవకాశం ఉన్నదాని సీపీ తెలిపారు. "డయల్–100" సేవలను అవసరం ఉన్నప్పుడు మాత్రమే వినియోగించండి. అవాస్తవ లేదా అప్రయోజక కాల్స్ చేయవద్దు" అని సీపీ గౌష్ ఆలం ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

# పిల్లల హక్కులను కాలరాయకండి బంగారు బాల్యాన్ని బలి చేయకండి

### పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుదాం




**చర్చ:- కోహెడ :**లికోహెడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం పోస్టర్‌ఆవిష్కరణ చేసి ఈ సందర్భంగా ప్రముఖ సామాజికవేత్త బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ బాల కార్మిక చట్టాలు బాలల హక్కుల చట్టాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని ఆయనే కోరారు పిల్లలు వారి హక్కులను తెలుసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ కోసం అందరం కృషి చేద్దామని పేర్కొన్నారు చిన్నారి బాలలకు సమాచారాన్ని పంచుకోడాన్ని పరస్పర అవగాహన పెంచుకోవడానికి ప్రోత్సహించేందుకు అందరం కృషి చేద్దామని ఆయన అన్నారు నేటి బాలులే రేపటి బావి భారత పౌరులని ఆయన పేర్కొన్నారు బాలల చే ఎవరైనా పని చేపించినట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం అందించాలని ఆయన కోరారు చిన్నారి బాలల వారి హక్కులను కాల రాయకూడదని అన్నారు వారికోసం స్వచ్ఛమైన వాతావరణంలో వారికి సంపూర్ణమైన ఆరోగ్యం కోసం తల్లిదండ్రులు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు చిన్నారి బాలబాలికలను తల్లిదండ్రులు విద్య అందించేందుకు ప్రోత్సహించాలని పేర్కొన్నారు మా బాలల హక్కుల ప్రజావేదిక గత రెండు దశాబ్దాలుగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన బాల్య వివాహాల నిర్మూలన కోసం బాలల హక్కుల కోసం నిరంతరంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు తెలంగాణ బాల కార్మిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు ప్రభుత్వ పాఠశాలను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని ఆయన కోరారుచిన్నారి బాలబాలికలు భవిష్యత్ తరాలకు ఆదర్శం నిలిచేందుకు శ్రమించాలని అన్నారు చిన్నారి బాలబాలికలు చిన్ననాటి నుండి పట్టుదల విద్య పైన దృష్టి పెట్టి విజ్ఞానాన్ని పెంచుకోవాలని మహనీయుల పుస్తక పఠన చేయాలని ఆయన కోరారు చిన్నారులు తల్లిదండ్రుల కోసం కలను నిజం చేసేందుకు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిరంతరంగా శ్రమించాలని ఆయన పేర్కొన్నారు నవంబర్ మాసం అంటేనే బాలలకు పండుగ రోజే లే చిన్నారి బాలబాలికలతో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం వేడుకలు సామాజికవేత్త బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ చిన్నారులతో పంచుకున్నారు చిన్నారుల హక్కుల కోసం పనిచేస్తున్నామని అని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ మహిముద్ మాజీ విద్యా కమిటీ చైర్మన్ గాజుల వెంకటేశ్వర్లు బాలల హక్కుల ప్రజా వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బైరి చంద్రశేఖర్ చిన్నారి బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పేపర్ లీక్ కేసులో బండి సంజయ్ నిర్దోషిగా కోర్టు తేల్చిన నేపథ్యంలో బిజెపి శ్రేణుల సంబరాలు




**చర్చ :-కరీంనగర్ :**పదవ తరగతి పేపర్ లీక్ కేసులో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ నిర్దోషిగా హై కోర్టు తేల్చిన నేపథ్యంలో గురువారం రాత్రి కరీంనగర్ బిజెపి శ్రేణులు స్థానిక తెలంగాణ చౌక్లో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ ప్రోగ్రాంలో పాల్గొన్న బిజెపి నేతలు మాజీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిల్లపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు కేసులతో బండి సంజయ్ కుమార్ ను అనేక ఇబ్బందులు పట్టే ప్రయత్నం చేసిందన్నారు. కెసిఆర్ నియంతృత్వ వ్యతిరేక విధానాలను బండి సంజయ్ కుమార్ ప్రజా క్షేత్రంలో ఎండగడితే జీర్ణించుకోలేని స్థితిలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక తప్పుడు కేసులు పెట్టిందని తెలిపారు. అందులో పదోతరగతి పేపర్ లీక్ కేసు కూడా ఒకటని , 2023 పదవ తరగతి పేపర్ లీక్ చేసినట్టు బండి సంజయ్ కుమార్ ను నాడు కెసిఆర్ ప్రభుత్వం అక్రమ కేసు పెట్టి అరెస్టు చేసి జైలుకు తరలించి శునకానందం పొందిందన్నారు. నాడు అక్రమంగా బండి సంజయ్ మీద పెట్టిన కేసును కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు నేడు తీర్పు ఇవ్వడం హర్షనీయమన్నారు. ప్రజల తరపున పోరాటం చేసినందుకు కక్షపూరితంగా బండి సంజయ్ పై కేసు పెట్టిన నాటి టిఆర్ఎస్ సర్కారుకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చిందన్నారు. ప్రజల కోసం పోరాటం చేసే బండి సంజయ్ లాంటి నాయకులను అణిచివేయాలని ప్రయత్నించిన బిఆర్ఎస్ కు ప్రజలే తగిన గుణపాఠం చెప్పారని , ఆ పార్టీ పని అయిపోయిందని , ఆ పార్టీని ఎవరు విశ్వసించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మీడియా కన్వీనర్ కటకం లోకేష్ , ఎండి ముజీబ్ , రాపర్తి ప్రసాద్ , కోలగని శ్రీనివాస్ , వంగల పవన్ , బండ రమణా రెడ్డి, లెక్కల వేణుగోపాల్ , కరీంనగర్ జోన్ అధ్యక్షులు బండారు గాయత్రి, అవదుర్తి శ్రీనివాస్, తణుకు సాయి,పార్వజ్, జాడి బాల్ రెడ్డి, నాగ సముద్రం ప్రవీణ్,ఉప్పరపల్లి శ్రీనివాస్, సురేష్, సంపత్, రాజు , వరాల జ్యోతి, మాసం గణేష్, మాడిశెట్టి సంతోష్, సమీ వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# గులాబీ పువ్వుల రెక్కలను ఇలా నాచురల్‌గా ఉపయోగించి మీ అందాన్ని మరింత పెంచుకోండి



గులాబీ పువ్వులను కవులు అందానికి మారుపేరుగా వర్ణిస్తారన్న విషయం తెలిసిందే. గులాబీ పువ్వుల అంత అందంగా ఉన్నావని అంటుంటారు. అయితే వాస్తవానికి గులాబీ పువ్వులను వివిధ రకాల సౌందర్య సాధన ఉత్పత్తుల తయారీలోనూ ఉపయోగిస్తారు. గులాబీ పువ్వులను సబ్బులు, షాంపూలు, ఆయిల్స్, క్రీములు వంటి వాటి తయారీలో వాడతారు. ఇవి మన చర్మానికి, శిరోజాలకు సంరక్షణను అందిస్తాయి. అయితే ఆయా ఉత్పత్తులు అన్నీ కృత్రిమమైనవి. వాటిల్లో రసాయనాలు అధికంగా ఉంటాయి. కనుక అవి దీర్ఘకాలంలో మన చర్మానికి హాని చేస్తాయి. కనుక ఆయా ఉత్పత్తులను వాడడం కన్నా నేరుగా గులాబీ పువ్వులను వాడితేనే ఎక్కువ మేలు జరుగుతుంది. గులాబీ పువ్వులతో పలు ఇంటి చిట్కాలను పాటించడం వల్ల చర్మాన్ని సంరక్షించుకోవచ్చు. దీంతో ముఖంపై ఉండే ముడతలు, మొటిమలు, మచ్చలను తగ్గించుకోవచ్చు. వృద్ధాప్య ఛాయలు తగ్గి యవ్వనంగా కనిపిస్తారు. చర్మం కాంతివంతంగా మారుతుంది.మార్కెట్‌లో మనకు కంపెనీల్లో తయారు చేసిన రోజ్ వాటర్ లభిస్తుంది. కానీ దీన్ని మనం ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. గులాబీ పువ్వుల రెక్కలను సేకరించి నీటిలో వేసి 48 గంటల పాటు నానబెట్టాలి. దీంతో ఆ రెక్కలలో ఉండే సారం నీటిలోకి వెళ్తుంది. దీని వల్ల రోజ్ వాటర్ రెడీ అవుతాయి. ఈ వాటర్‌ను పలు చిట్కాలలో ఉపయోగించవచ్చు. లేదా నేరుగా కూడా వాడవచ్చు. ఈ వాటర్‌ను సీసాలో నిల్వ చేసుకుంటే ఎప్పుడు కావాలంటే అప్పుడు ఉపయోగించవచ్చు. ఇక ఈ వాటర్‌ను రాత్రి పూట ముఖానికి రాసి మరుసటి రోజు ఉదయం కడిగేయాలి. దీంతో ఈ వాటర్ చక్కని టోనర్‌లా పనిచేస్తుంది. ముఖంపై ఉండే మృత కణాలు తొలగిపోతాయి. చర్మానికి కాంతి లభిస్తుంది. అందంగా కనిపిస్తారు. అలాగే కాస్త గంధం తీసుకుని అందులో మెత్తగా చేసిన గులాబీ పువ్వుల రెక్కలు, రోజ్ వాటర్, కొన్ని చుక్కల తేనెను వేసి కలపాలి. దీంతో పేస్ట్‌లా మారుతుంది. ఈ పేస్ట్‌ను ముఖానికి రాసుకుని పది నిమిషాల తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేయడం వల్ల మొటిమలు, మచ్చలు తగ్గుతాయి. ముఖం కాంతివంతంగా మారుతుంది. నల్లని వలయాలకు.. రోజ్ వాటర్‌లో రెండు దూది ఉండల్ని నానబెట్టి అనంతరం వాటిని తీసి కళ్ల మీద ఉంచాలి. అలా పది నిమిషాల పాటు ఉంచిన తరువాత వాటిని తీసేయాలి. అనంతరం గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా ప్రతి రోజూ రాత్రి నిద్రపోయే ముందు చేయాలి. దీని వల్ల కళ్ల కింద ఉండే నల్లని వలయాలు తొలగిపోతాయి. ఇక పొడి చర్మం ఉన్నవారికి గులాబీ పువ్వుల రెక్కలు ఎంతో మేలు చేస్తాయి. చర్మానికి కావల్సిన తేమను అందించి చర్మం మృదువుగా మారేలా చేస్తాయి. గులాబీ పువ్వుల రెక్కలను సహజసిద్ధమైన మాయిశ్చరైజర్‌గా కూడా ఉపయోగించవచ్చు. కనుక చలికాలంలో వీటితో ఎంతో మేలు జరుగుతుంది. గులాబీ పువ్వుల రెక్కల్లో ఉండే సహజసిద్ధమైన నూనెలు చర్మాన్ని పొడిబారకుండా చూస్తాయి. దీంతో చలికాలంలో చర్మం పగలకుండా ఉంటుంది. గులాబీ పువ్వుల రెక్కలను మెత్తని పేస్ట్‌లా మార్చి అందులో కాస్త రోజ్ వాటర్‌ను కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మారుతుంది.

# తోటకూరను లైట్ తీసుకోకండి.. దీంతో కలిగే లాభాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు

ఆకుకూరలను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటారు. ఇవి మనకు అనేక పోషకాలను అందిస్తాయి. అయితే ఆకుకూరల్లో దేనికదే ప్రత్యేకం అయినప్పటికీ తోటకూర చాలా మందికి ఫేవరెట్‌గా ఉంటుంది. తోటకూరతో అనేక రకాల వంటలను చేసి తింటారు. దీంతో వేపుడు, పులుసు, పప్పు వంటి కూరలను చేసుకోవచ్చు. ఇవి ఎంతో రుచిగా ఉంటాయి. అలాగే పలు రైస్ వంటకాల్లోనూ తోటకూరను వేస్తుంటారు. చిన్నారులకు తల్లులు తరచూ తోటకూరను ఆహారంలో భాగంగా పెడుతుంటారు. దీని వల్ల వారికి ఎన్నో పోషకాలు లభిస్తాయి. అయితే తోటకూర ఆరోగ్యకరమని తెలుసు కానీ దీంతో ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి, ఇది మనకు ఏయే పోషకాలను అందిస్తుంది..? అన్న విషయాలు చాలా మందికి తెలియవు. కానీ ఈ విషయాలను పోషకాహార నిపుణులు చెబుతున్నారు. తోటకూరను తరచూ తినాలని వారు సూచిస్తున్నారు.ప్రోటీన్లు అధికం..తోటకూరలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇతర ఆకుకూరలతో పోలిస్తే ఇందులో ప్రోటీన్ల శాతం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల తోటకూరను తింటే కండరాలు నిర్మాణమవుతాయి. కండరాలకు మరమ్మత్తులు జరిగి ఆరోగ్యంగా ఉంటాయి. కండరాల నొప్పి తగ్గుతుంది. కండరాలు వృద్ధి చెందుతాయి. దేహ దారుఢ్యం పెరుగుతుంది. తోటకూరలో అమైనో ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి కావల్సిన శక్తిని అందిస్తాయి. దీని వల్ల తోటకూరను తింటే ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి. తోటకూరలో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. పాలు లేదా పాల ఉత్పత్తులను తీసుకోని వారు తోటకూరను తినవచ్చు. దీని వల్ల పెద్ద మొత్తంలో క్యాల్షియంను పొందవచ్చు. క్యాల్షియం వల్ల ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. వృద్ధాప్యంలో ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే విరిగిన ఎముకలు త్వరగా అతుక్కు ంటాయి .గర్భిణీలకు..తోటకూరలో విటమిన్ కె కూడా



అధికంగానే ఉంటుంది. ఇది ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేస్తుంది. దీంతో తీవ్ర రక్త స్రావం జరగకుండా అడ్డుకోవచ్చు. తోటకూరలో ఐరన్, ఫోలేట్ అధికంగా ఉంటాయి. అందువల్ల తోటకూరను తింటే హిమోగ్లోబిన్ ఉత్పత్తి పెరుగుతుంది. దీని వల్ల రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. అలాగే ఫోలేట్ వల్ల గర్భిణీలకు ఎంతో మేలు జరుగుతుంది. వారు తోటకూరను తింటే ఫోలేట్ లభించి గర్భస్థ శిశువు ఎదుగుదలకు సహాయం చేస్తుంది. దీని వల్ల పిల్లలకు పుట్టుక లోపాలు రాకుండా ఉంటాయి.

# ముఖ సౌందర్యానికి ఈ సుగంధ ద్రవ్యాలను రాస్తున్నారా



భారతీయ వంటింట్లోని సుగంధ ద్రవ్యాలు ఆహారం రుచిని పెంచడానికి మాత్రమే కాదు.. చర్మ సంరక్షణలోనూ విస్తృతంగా ఉపయోగిస్తారు. చాలామంది ముఖానికి సుగంధ ద్రవ్యాలను వినియోగించి చర్మాన్ని కాంతివంతంగా మార్చుకోవాలని ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో పలువురు పొరపాట్లు చేస్తుంటారు. కొన్ని సుగంధ ద్రవ్యాలు చర్మానికి రాసినప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తుందని చాలా మందికి తెలియదు. పలు సుగంధ ద్రవ్యాల్లోని ఘాటైన పదార్థాలు చర్మంపై పొరను దెబ్బతిస్తాయి. చర్మం ఎర్రబారడంతో పాటు దురద వస్తుంది. కొన్నిసార్లు దద్దుర్లు వస్తాయి. కొన్నిసార్లు అలెర్జీకి కారణమవుతాయి. దాంతో వైద్యుడికి వద్దకు వెళ్లాల్సి వస్తుంది. మీరు ఇంట్లోనే ఫేస్ ప్యాక్లను తయారు చేసుకొని వేసుకుంటుంటే.. ఎలాంటి సుగంధ ద్రవ్యాలకు దూరంగా ఉండాలో తెలుసుకోవడం ఉత్తమం.

చాలా మంది దాల్చిన చెక్కను ముఖానికి ప్యాక్లా వేసుకునేందుకు ఇష్టపడుతుంటారు. ఎందుకంటే ఇది యాంటీ బ్యాక్టీరియల్. కానీ దాని వేడి లక్షణాలు చర్మం పైపొరను దెబ్బతీస్తాయి. సిన్నమాల్డిహైడ్ సమ్మేళనం చర్మంపై చికాకు, ఎరువు ఎర్రబారడం, వాపునకు కారణమవుతుంది. చర్మం సున్నితంగా ఉంటే దాల్చిన చెక్కను వాడకుండా ఉండడం మంచిది.లవంగాలులవంగా నూనెను తరచుగా మొటిమలకు చికిత్స చేయడానికి ఉపయోగిస్తారు. దాన్ని చర్మంపై నేరుగా ఉపయోగించడం వల్ల కాలిపోతుంది. బొబ్బలు వస్తాయి. లేదంటే చికాకును కలిగిస్తుంది. లవంగాల నూనె లేదంటే పొడిని నేరుగా చర్మానికి రాయకుండా కొబ్బరి నూనె, కలబంద జెల్ వంటి క్యారియర్ ఆయిల్తో కలిపి రాసుకోవడం ఉత్తమం.

ఇంగువా..ఇంగువా (ఆసాఫోటిడా)లో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలుంటాయి. కానీ, దాన్ని ముఖానికి రాయడం వల్ల పలుసార్లు చికాకుకు కారణమవుతుంది. కొన్నిసార్లు అలెర్జీ వస్తుంది. చర్మంపై దద్దర్లు వస్తాయి. ముఖ్యంగా పొడి, సున్నితమైన చర్మం ఉంటే.. ముఖానికి నేరుగా రాయకపోవడం మంచిది.

ఆవాల పొడిఆవాల పొడిలో విటమిన్ ఈ పుష్కలంగా ఉంటుంది.

నిజాల నిగ్గు తేల్చే
చర్య
తెలుగు దిన పత్రిక

# అఫిడవిట్ దాఖలు చేయాల్సిందే వారికి స్పీకర్ నోటీసులు



**హైదరాబాద్, నవంబర్ 20:** పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కుంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేయగా.. అందులో ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రం ఇప్పటి వరకు అఫిడవిట్‌లు దాఖలు చేయని పరిస్థితి. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి.. స్పీకర్ నోటీసులకు స్పందించని విషయం తెలిసిందే. దీంతో వారిరువురికి స్పీకర్ మరోసారి నోటీసులు జారీ చేశారు. అనర్హత పిటిషన్లపై అఫిడవిట్ దాఖలు చేయాలని అసెంబ్లీ స్పీకర్ స్పష్టం చేశారు.ఇక.. పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కుంటున్న ఎమ్మెల్యేల విచారణ నేటితో (గురువారం)తో ముగియనుంది. కేసు విచారణ ఆలస్యంపై సుప్రీం సీరియస్ అవడంతో పాటు నాలుగు వారాలు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణలో వేగం పెంచాలని అసెంబ్లీ స్పీకర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా రెండో విడత విచారణలో భాగంగా నలుగురు ఎమ్మెల్యేలను నేడు విచారణకు పిలిచారు. ఉదయం ఎమ్మెల్యేల విచారణ మొదలైంది. పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ జగదీశ్ రెడ్డి కేసును స్పీకర్ విచారించారు. ఇరు వర్గాల ఓరల్ ఆర్గ్యుమెంట్స్‌ను స్పీకర్ విన్నారు. అలాగే మధ్యాహ్నం అరికెపూడి గాంధీ వర్సెస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కేసు విచారించనున్నారు. వీరి విచారణ తో మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తి అవుతుంది.ఢిల్లీకి దానం.మరోవైపు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ పెద్దలను కలవనున్నారు. నేటితో ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ ముగియనున్నప్పటికీ ఇప్పటి వరకు దానం అఫిడవిట్లు దాఖలు చేయలేదు. విచారణకు హాజరైతే వేటు పడుతుందని దానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేటు పడితే ఆరు సంవత్సరాల పాటు పోటీ చేయడానికి నో ఛాన్స్. ఈ క్రమంలో రాజీనామా చేసేందుకు దానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. రాజీనామా చేస్తే తన పరిస్థితి ఏంటని పార్టీ పెద్దలతో దానం సంప్రదింపులు జరుపనున్నట్లు తెలుస్తోంది.

# టార్గెట్ ఫిక్స్ తెలంగాణలో రెండు రోజుల్లో కీలక పరిణామం




**హైదరాబాద్, నవంబర్ 20:** తెలంగాణలో మరో రెండు రోజుల్లో కీలక పరిణామం చోటుచేసు కోబోతుంది. దేశవ్యాప్తంగా మావోయిస్టుల ఏరివేత తారా స్థాయికి చేరుకున్న నేపథ్యంలో తెలంగాణలో రెండు రోజుల్లో సం చలన పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. మావోయిస్టు ఏరిఏ ేతనే ప్రధాన లక్ష్యంగా బలగాలు పనిచేస్తున్నాయి.వచ్చే మార్చి నాటికి మావోయిస్టు లేకుండా చేస్తామన్న కేంద్ర హెూం మంత్రి అమిత్ షా మాటలు నిజం కావటానికి దగ్గర పడే సమయం ఆసన్నమైంది. ఈ తరుణంలో నవంబర్ 28న ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా అన్ని రాష్ట్రాల డీజీపీలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర హెూంమంత్రి అమిత్ షా సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో మావోస్టులప ప్రధానంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తెలంగాణలో టార్గెట్‌ను పూర్తిచేయాలని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఇందులో భాగంగా మావోయిస్టు లొంగుబాట్లలో తెలంగాణ తమ టార్గెట్ ను పూర్తి చేయాలని భావిస్తున్నారు. రెండు రోజుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులుగా ఉన్న కీలక నేతలు తెలంగాణ డీజీపీ ముందు లొంగిపోనున్నట్లు తెలుస్తోంది. మల్ల రాజిరెడ్డి, ఆజాద్, దామోదర్ వంటి అగ్రనేతలు అడవిని వదిలి జనజీవన స్రవంతిలో కలవనున్నట్లు సమాచారం. మరోవైపు మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ కోసం ఏపీ పోలీసులు ఇప్పటికే తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అతడు లక్ష్యంగానే ఏపీలో ఇంకా కూంబింగ్ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో దేవ్ జీ సైతం తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయే అవకాశం కనిపిస్తుంది.ఒకవేళ అదే జరిగితే తెలంగాణ పోలీసులు రికార్డు సృష్టించినట్టే..! ఇప్పటికే దేశవ్యాప్తంగా మావోయిస్టు లొంగుబాటులో సంఖ్యాపరంగా తెలంగాణ పోలీసులు ముందు ఉన్నారు. తెలంగాణ పోలీసుల ముందే వందల సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. ఇక దేవ్ జీ కూడా తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోతే అమిత్ షా మాటలు నిజమైనట్టుగానే భావించాలి.మావోయిస్టు పార్టీ అగ్రనాయకత్వం తెలంగాణతో ముడి పడి ఉంది. తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన వ్యక్తులే కేంద్ర కమిటీ సభ్యుల్లో ఎక్కువగా ఉన్నారు. ఇప్పటికే మల్లోజుల వేణుగోపాల్‌తో పాటు చంద్రన్న లాంటి అగ్రనేతలు అరణ్యాన్ని వదిలి జనారణ్యంలో కలిశారు. ఇక మిగిలిన వారిని కూడా లొంగిపోయేలా తెలంగాణ పోలీసులు వ్యూహాలు రచిస్తున్నారు. ఈ లొంగుబాటు చర్యలను ఛత్తీస్‌గఢ్ లో జరగనున్న డీజీపీ కాన్ఫరెన్స్ లోపే పూర్తి చేయాలని తెలంగాణ పోలీసులు భావిస్తున్నారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు



**హైదరాబాద్, నవంబర్ 20:** ఇందిరమ్మ చీరల పంపిణిపై అధికారులకు మంత్రి సీతక్కకీలక ఆదేశాలు జారీ చేశారు. ఇంటిం టికి ఇందిరమ్మ చీర పంపిణీ చేయాలని.. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చీరలు పంచాలని ఆదేశించారు. గ్రామ స్థాయి లో బృంద సభ్యులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బొట్టుపెట్టి చీరలు అందజేయాలన్నారు. ఎస్‌హెచ్‌జీ వెలుపల ఉన్న మహిళలకు వెంటనే సభ్యత్వం వెను వెంటనే చీర పంపిణీ చేయాలని మంత్రి తెలిపారు. మహిళా స్వయం సహాయక బృందాల ప్రాముఖ్యతపై నియోజకవర్గ, మండల స్థాయి కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.పంపిణీ వివరాలు తప్పనిసరిగా ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ క్రమశిక్షణగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకు చీర అందాలన్నారు. కొత్త లబ్ధిదారుల గుర్తింపుకు పౌర సరఫరా శాఖ సహకారం తీసుకోవాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు.కాగా.. తెలంగాణ వ్యాప్తంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మొదలైంది. కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైన మహిళలకు రెండు దశల్లో చీరలను పంపిణీ చేయనున్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా (బుధవారం) నుంచి ఈ కార్యక్రమం మొదలవగా.. తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం (డిసెంబర్ 9) మొదటి దశలో గ్రామీణ ప్రాంతాల్లో చీరలను పంపిణీ చేస్తారు. ఇక రెండవ దశలో మార్చి 1 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంటే మార్చి 8 వరకు పట్టణాల్లో చీరలను పంచనున్నారు. ఇందిరమ్మ చీరలకు సంబంధించి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) పలు మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. ప్రతీ మహిళకు బొట్టు పెట్టి చీరలు పంపిణీ చేయాలని స్పష్టం చేసింది. చీరలు తీసుకునేందుకు లబ్ధిదారులు ఆధార్ కార్డు చూపించాల్సి ఉంటుంది. అలాగే చీరలు తీసుకున్నాక ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా రికార్డు చేయాలి. సెర్ప్ సభ్యులు ముఖ గుర్తింపు యాప్ ద్వారా వారి ఆధార్ నంబర్‌ను చేసి, లబ్ధిదారుల ఫొటోను తీసి చీర అందజేస్తారు.

# సర్పంచులు లేక స్మశానాలుగా గ్రామాలు



**కరీంనగర్:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలు జరపకపోవడం వల్ల గ్రామాలు వల్లకాడులుగా మారాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటి పోయిన సర్పంచ్ ఎన్నికలు నిర్వహించక పోవడం సిగ్గుచేటు అన్నారు పోవడం సిగ్గుచేటు అన్నారు. గ్రామాల్లో బల్బులు పెట్టే వాళ్ళు లేరు, మురికి కాలువలు సాఫ్ చేసేవారులేరన్నారు. ప్రజల అవసరాలను పట్టించుకునే నాధులే లేడని, 15 ఫైనాన్స్ కమిషన్ నిధులు, పర్ క్యాపిటా నిధులు ఎన్నికలు జరగకుంటే రావన్నారు. అవి వస్తేనే గ్రామంలో అభివృద్ధి జరుగుతుందని, రెండేళ్లుగా అభివృద్ధి కుంటుపడిందన్నారు.సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవని, రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మరోసారి మోసగించేం దుకు 42 పర్సెంట్ రిజర్వేషన్లను పార్టీ పరంగా అమలు చేస్తామని చెబుతుందన్నారు. అసలు గుర్తులేలేని ఎన్నికలకు పార్టీ పరంగా ఎలా రిజర్వేషన్లు కల్పిస్తారని నిలదీశారు. గ్రామాల్లో ఉండి ప్రజలకు సేవ చేసి సమస్యలను పరిష్కరిస్తానని విశ్వాసం కల్పించే వారిని ఎన్నుకుంటారన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కువ మందిని గెలిపించడానికి బీజేపీ నాయకుడిగా నా ప్రయత్నం చేస్తున్నామన్నారు. బిల్లులు రాక సర్పంచులు ఉపసర్పంచ్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. బకాయిలన్నీ వెంటనే చెల్లించి పోటీ చేసే వారిలో విశ్వాసాన్ని నెలకొల్పాల న్నారు.నాయకుల మధ్య విభేదాలు మీడియా సృష్టిమా నాయకుల మధ్య విభేదాలు ఉన్నాయనేది కొన్ని ఛానెల్స్, యూ ట్యూబ్ చానల్స్, సోషల్ మీడియా సృష్టిస్తుందన్నారు. మా మధ్య ఎలాంటి విభేదాలు లేవని, మేమంతా భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో పనిచేస్తున్నామన్నారు. కొన్ని ఛానల్లు తమ రేటింగ్ పెంచుకునేందుకు తమ మధ్య విభేదాలు ఉన్నాయని ప్రసారం చేయడం సరికాదన్నారు


# ధర్మంపై తప్పుగా మాట్లాడితే ఏం జరుగుతుందో చూపిస్తాం



ముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఇటీవల గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో హనుమంతుడిపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అవుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ.. పలు హిందూ సంఘాలు బీజేపీ నేతలు రాజమౌళిని విమర్శిస్తూ వీడియోలు విడుదల చేయడమే కాకుండా అతడు క్షమాపణలు చెప్పాలంటే డిమాండ్ చేశారు. అయితే రాజమౌళి వ్యాఖ్యలపై తాజాగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రంగా స్పందించారు. రాజమౌళి నిజమైన నాస్తికుడైతే బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే రాజమౌళి తెరకెక్కించే ప్రతీ సినిమాను హిందూ సమాజం బహిష్కరించాలని రాజాసింగ్ పిలుపునిచ్చారు.దేవుళ్లపై సినిమాలు తీసి కోట్లు సంపాదించిన రాజమౌళి. ఇప్పుడు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఏకంగా రాజమౌళి సినిమాలను బహిష్కరించండంటూ హిందువులకు పిలుపు ఇవ్వడం సెన్సేషన్‌గా మారింది. తాజాగా దీనిపై ఆయన ఓ వీడియో రిలీజ్ చేసి.. దర్శకుడు రాజమౌళిపై ఫైర్ అయ్యారు. రాజమౌళి సినిమాలను చూడొద్దని హిందువులకు పిలుపునిచ్చారు. విశ్వాసం లేదంటూ అదే దేవుళ్ళు, ధర్మంపై సినిమాలు తీసి కోట్లు సంపాదిస్తున్నారు. మూవీ ప్రచారం కోసం హనుమంతుడిపై కామెంట్స్ చేశావా.? నిజంగా నాస్తికుడివా డిక్లేర్ చేయ్.? అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు రాజాసింగ్. 'నీలాంటి డైరెక్టర్‌ను హిందువులు పట్టించుకోరు. గతంలో కూడా హిందూ దేవుళ్ళపై ఇష్టారీతిన మాట్లాడావు. ఇలాంటి నాస్తికుడు డైరెక్టర్‌గా తీసే సినిమాలు జనం చూడకండి. మన ధర్మంపై తప్పుగా మాట్లాడితే ఏమవుతుందో చూపిద్దాం' అంటూ గోషామహల్ ఎమ్మెల్యే వీడియోలో పేర్కొన్నారు. దేవుళ్లు అంటే నమ్మకం లేనప్పుడు ఆ సినిమాలు తీయడం ఎందుకు? అని రాజాసింగ్ ప్రశ్నించారు. గతంలో కూడా దేవుళ్లపై రాజమౌళి ఇష్టారీతిన వ్యాఖ్యలు చేశారని రాజా సింగ్ అన్నారు. అంతేగాకుండా తన కొత్త చిత్రం 'వారణాసి' ప్రమోషన్స్ కోసమే రాజమౌళి ఉద్దేశపూర్వకంగా అలా మాట్లాడారా అనే దానిపై వెంటనే క్లారిటీ ఇచ్చి క్షమాపణ చెప్పాలని రాజాసింగ్ డిమాండ్ చేశారు. అలాగే ధర్మంపై ఎవరు తప్పుగా మాట్లాడిన ఏం జరుగుతుందో చూపిస్తాం అని రాజాసింగ్ తీవ్రంగా హెచ్చరించారు. అయితే ఈ వ్యాఖ్యలపై రాజమౌళి ఎలా స్పందిస్తారనేది వేచి చూడాలి.అసలు ఏం జరిగిందంటేగ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో జక్కన్న తండ్రి విజయేంద్రప్రసాద్ రాజమౌళి వద్దకు వచ్చి హనుమంతుడిని తలచుకో అంతా సెట్ అవుతుందని చెబుతాడు. అయితే ఈ విషయంపై రాజమౌళి మాట్లాడుతూ.. నేను మాములుగా దేవుడిని నమ్మను. నాన్న గారు వచ్చి ఇందాక హనుమాన్ వెనకాల ఉంటాడు.. గుండెతట్టి నడిపిస్తాడు అని చెప్పారు.. ఇలా అయిన వెంటనే కోపం వచ్చిందండిఇదేనా నడిపించేది అని. మా ఆవిడకి హనుమంతుడు అంటే చాలా చాలా ఇష్టం.. ఫ్రెండ్ లాగా మాట్లాడుతది అతడితో.. మా ఆవిడా మీద కూడా కోపం వచ్చింది%% ఏంటి ఇదేనా చేసేది అని చెప్పుకోచ్చాడు. అయితే రాజమౌళి చేసిన వ్యాఖ్యలు పలు హిందు సంఘాలతో పాటు బీజేపీ నేతల మనోభావాలను దెబ్బతీశాయి. దీంతో రాజమౌళి వెంటనే క్షమాపణలు చెప్పాలంటూ సనతాన ధర్మ రక్షకులు డిమాండ్ చేస్తున్నారు.

# బీఆర్ఎస్ సీనియర్ నేత కన్నుమూత

## - బీఆర్ఎస్ నేత బోయపల్లి లింగంగౌడ్ మృతి



**హైదరాబాద్:** గోల్నాక డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బోయపల్లి లింగంగౌడ్(66) మృతిచెందాడు. లింగంగౌడ్ తన ద్విచక్ర వాహనంపై శివంరోడ్ వైపు వెళ్లి తిరిగి వస్తుండగా కిందపడడంతో గాయాలు కాగా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. లింగంగౌడ్ బీఆర్ఎస్?లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్?కు అతి సన్నిహితుడుగా కొనసాగుతున్నాడు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నగరంలో లేకపోవడంతో విషయం తెలియగానే ఎమ్మెల్యే సతీమణి,మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మావెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ దంపతులు, పార్టీ నాయకులు ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని దగ్గరుండి పరిశీలిస్తుండగా వైద్యులు మృతిచెందాడని చెప్పగా వెంటనే అక్కడి నుంచి గోల్నాక డివిజన్ న్యూగంగానగర్‌లోని ఆయ న నివాసానికి మృతదేహాన్ని తీసుకవచ్చా రు. బుధవారం ఉదయం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు, సన్నహితులు, గౌడసంఘం పెద్దలు,బీసీ సంఘాల నాయకులు ఆయన నివాసానికి తరలివచ్చి నివాళ్లు అర్పించారు. లింగంగౌడ్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. లింగంగౌడ్ పార్థీవదేహంపై ఎమ్మెల్యే సతీమణి కాలేరు పద్మావెంకటేష్ బీఆర్ఎస్ జెండాను కప్పి నివాళ్లులర్పించారు. అంతిమయాత్రలో ఎమ్మెల్యే తనయుడు కాలేరు మణికాంత్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని నివాళులర్పించారు. హ స్రాసపెంటలోని అంబర్‌పేట హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

# కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలు సరికాదు



**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలు సరికాదు అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. సమాజంలో ప్రజల అంశాలపై ప్రశ్నించే గొంతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కే ప్రయత్నం చేయడం రాజ్యాంగ విరుద్ధం అని మండిపడ్డారు. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్‌లో రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నది కాంగ్రెస్ సర్కార్ అని విమర్శించారు.హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నడు రేవంత్ రెడ్డి అని వినోద్ కుమార్ ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికం. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. సీఎం రేవంత్ రెడ్డి కుట్రలను న్యాయపరంగా ఎదుర్కొంటాం అని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

# కోర్టుకు హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, నవంబర్ 20:** కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ (గురువారం) నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. గతంలో తనపై నమోదైన పలు కేసుల నేపథ్యంలో విచారణ కోసం కోర్టు వెళ్లారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ పని చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో నల్గొండలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.అలాగే హుజూర్‌నగర్ నియోజకవర్గం నేరేడుచర్లలో బండి సంజయ్ కాన్వాయ్‌పై బీఆర్ఎస్ నేతలు రాళ్ల దాడి చేశారు. నాటి ఘటనల్లో బండి సంజయ్‌పై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణలో భాగంగానే కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. అయితే, విచారణ అనంతరం జనవరి 7వ తేదీకి ఈ కేసును న్యాయమూర్తి వాయిదా వేశారు.బండి సంజయ్‌కు హైకోర్టులో ఊరటకేంద్ర హెూం శాఖ మంత్రి బండి సంజయ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. గతంలో కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును గురువారం హైకోర్టు కొట్టేసింది. 2023లో 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై ఈ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో బండి సంజయ్ పేరును ప్రధాన నిందితుడిగా కమలాపురం పోలీసులు చేర్చారు.రాజకీయ కక్షల కారణంగానే ఈ కేసు నమోదు చేశారని హైకోర్టుకు బండి సంజయ్ న్యాయవాది తెలిపారు. కేసు నమోదులో సరైన సెక్షన్లు కానీ.. దర్యాప్తులో పూర్తి వివరాలు కానీ లేవని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ కేసును కొట్టేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

# ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి



**జనగామ చౌరస్తా, నవంబర్ 20 :** ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం జనగామ పట్టణంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మావోయిస్టులను వచ్చే మార్చిలోపు ఏరి వేస్తామని స్వయంగా కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడడం రాజ్యాంగ విరుద్ధం అని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశిస్తే, అమిత్ షా అమలు చేస్తున్నాడని పేర్కొన్నారు. డెడ్ లైన్‌లు పెట్టి మరీ మావోయిస్టుల ప్రాణాలు తీయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.కేంద్ర ప్రభుత్వం చేస్తున్న బూటకపు ఎన్ కౌంటర్లను ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు. లొంగి పోవడానికి వచ్చిన మావోయిస్టులను కేంద్ర బలగాలు పట్టుకొని కాల్చి చంపుతున్నారని విమర్శించారు. ఏ వ్యక్తిని కూడా చంపే అధికారం ప్రభుత్వానికి కానీ పోలీసులకు కానీ లేదన్నారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టు అగ్రనేత తిరుపతిని న్యాయస్థానం ఎదుట ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. జరుగుతున్న బూటకపు ఎన్ కౌంటర్లపై న్యాయస్థానాలు సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ జరపాలని సూచించారు. దేశంలో మనుధర్మ శాస్త్రాన్ని బీజేపీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.సామాజిక, రాజకీయ అసమానతలు ఉన్నంతకాలం ఉద్యమాలు ఉంటాయని తెలిపారు. పోరాటాలు, ఉద్యమాలను ఆపడం మోదీ కాదు కదా తను తాత వల్ల కూడా కాదని ఎద్దేవా చేశారు. నియంత హిట్లర్ లాంటి వాళ్లనే మట్టికరిపించిన చరిత్ర ఎర్రజెండాకు ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా దేశంలో జరుగుతున్న ఉగ్రవాద చర్యలను మతపరంగా, రాజకీయంగా బిజెపి సర్కార్ ఉపయోగించుకుంటుందని విమర్శించారు. ఢిల్లీలో జరిగిన ఉగ్రవాద చర్యను బీహార్ ఎన్నికకు ముందు బీజేపీ ఉపయోగించుకోవడం దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్, కార్యదర్శి మోకు కనకా రెడ్డి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, రాపర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

నిజాల నిగ్గు తేల్చే
చర్య
తెలుగు దిన పత్రిక

శుక్రవారం,
నవంబర్ 21, 2025



# రైతు బజార్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





**విజయవాడ, నవంబర్ 20:** నగరంలోని పటమట రైతు బజార్‌ను కలెక్టర్ లక్ష్మీ శా (గురువారం) ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు బజార్‌లో ప్లాస్టిక్ వాడకం, పరిశుభ్రతపై ఎస్టేట్ ఆఫీసర్ రమేష్‌ను కలెక్టర్ ప్రశ్నించారు. రైతు బజార్‌లో బాగానే పరిశుభ్రత పాటిస్తున్నారని, ఇంకా బాగా చేయాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం చాలా వరకు తగ్గించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం లక్ష్మీ శా మీడియాతో మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా రైతు బజార్‌లు, మార్కెట్‌లు తనిఖీ చేస్తున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రత, కూరగాయల నాణ్యత, ధరలను పరిశీలించామని తెలిపారు.పటమట రైతు బజార్‌లో శుభ్రతను పాటిస్తున్నారని చెప్పారు. షాపుల్లో రైతులే ఉంటున్నారా, దళారులు ఉంటున్నారా అని చెక్ చేశామన్నారు. డ్వాక్రా మహిళలు ఎక్కడ నుంచి కూరగాయలు తెస్తున్నారనేది పరిశీలించామని అన్నారు. ధరల విషయంలో ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నామన్నారు. పాలిథిన్ కవర్లు వాడకూడదని చెబుతున్నామని.. పూర్తిగా ప్లాస్టిక్ మహమ్మారిని తరిమి కొట్టాలని వెల్లడించారు. రైతు బజార్లలో ప్లాస్టిక్ వాడకూడదని చెప్పామన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు.పాలిథిన్ కవర్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి షాపు ఎదుట ధరల పట్టిక, కూరగాయల వివరాలు ఉంచాలని ఆదేశించారు. వినియోగదారులు కూరగాయల కోసం రైతు బజార్లకు వస్తారన్నారు. ఇక్కడ నుంచే ప్రజల్లో అవగాహన కలిగించి, ఎకో ఫ్రెండ్లీ రైతు బజార్లుగా మారుస్తామని కలెక్టర్ లక్ష్మీ శా పేర్కొన్నారు.

# ఆపరేషన్ సంభవ్ కొనసాగుతుంది ఏపీ డీజీపీ స్పష్టం




**అల్లూరి జిల్లా, నవంబర్ 20:** ఏపీలో ఆపరేషన్ సంభవ్ సక్సెస్ అయ్యిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. గురువారం ప్రత్యేక హెలికాప్టర్‌లో రంపచోడవరం చేరుకున్న డీజీపీ.. ఏవోబీ ప్రాంతంలో ఏరియల్ సర్వే చేశారు. ఆపై జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన రెండు వరుస ఎన్ కౌంటర్లలో మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలించారు. ఏకే 47 గన్స్, రైఫిల్, పేలుడుకు ఉపయోగించిన వస్తువులను పరిశీలించారు. అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ.. మారేడుమిల్లిలో జరిగిన రెండు ఎన్ కౌంటర్లలో 13 మంది మావో యిస్టులు మృతి చెందారని తెలిపారు.50 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశామన్నారు. ఈ ఏడాది జూన్‌లో రంపచోడవరంలో జరిగిన ఎన్ కౌంటర్‌లో లొంగిపోవాలని మావోయిస్టులను హెచ్చరి ంచామని తెలిపారు. మావోయిస్టులు లేని ఏపీగా చేయాలనుకున్నామని వెల్లడించారు. ఆపరేషన్ సంభవ్ కొనసాగుతుందని డీజీపీ హరీష్ గుప్తా స్పష్టం చేశారు.కాగా.. రెండు రోజుల క్రితం అల్లూరు సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో అగ్రనేతలు నేలరాలిన విషయం తెలిసిందే. మొదటి ఎన్‌కౌంటర్‌లో మావో అగ్రనేత హిడ్మా, ఆయన సతీమణితో పాటు.. నలుగురు మావోయిస్టులు మరణించారు. రెండో రోజు జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడు మంది మావోలు హతమయ్యారు. వీరిలో కీలక నేతలు కూడా ఉన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో లభించిన డైరీ ఆధారంగా ఏపీలోని పలు జిల్లాలో పోలీసులు, గ్రేహౌండ్స్, అక్టోపస్ బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు 50 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. వారికి వైద్య పరీక్షల కోర్టులో హాజరుపర్చగా.. కోర్టు వారికి రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.

# మావోయిస్టు అగ్రనేతల ఆచూకీపై హైకోర్టులో పిటిషన్




**అమరావతి, నవంబర్ 20:** మావోయిస్టుల ఆచూకీ విషయంలో ఏపీ హైకోర్టులో దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై (గురువారం) విచారణ జరిగింది. మావోయిస్టు అగ్రనేతలు దేవజీ, మల్లా రాజిరెడ్డిలను కోర్టులో హాజరుపర్చేలా పోలీసులను ఆదేశించాలంటూ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలైంది. రాజిరెడ్డి కుమార్తె స్నేహ లత, దేవజీ సోదరుడు ఈ పిటిషన్‌ను దాఖలు చేయగా.. ఈరోజు న్యాయస్థానంలో విచారణ జరిగింది. వారు ఇరువురు తమ వద్ద లేరని హైకోర్టుకు పోలీసులు నివేదించారు. అరెస్ట్ చేసిన మావోయిస్టులను సంబంధిత మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చామని వివరణ ఇచ్చారు.వారు ఇరువురు పోలీసులు వద్ద ఉన్నారనేందుకు ఆధారాలను కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్లకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మావోయిస్టు కీలక నేతలు తమ ఆధీనంలో ఉన్నారని పోలీసులు ప్రెస్ స్టేట్‌మెంట్ ఇచ్చారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రెస్ స్టేట్‌మెంట్‌ను కోర్టు ముందు ఉంచుతామని పిటిషనర్ వెల్లడించారు. ఈ క్రమంలో వ్యాజ్యంపై విచారణను హైకోర్టు (శుక్రవారాని)కి వాయిదా వేసింది.

# తిరుపతికి చేరుకున్న రాష్ట్రపతి పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న ముర్ము



**తిరుపతి :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం తిరుపతి కి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక విమానంలో వచ్చిన రాష్ట్రపతికి రేణిగుంట విమానశ్రయంలో రాష్ట్ర మంత్రులు , ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆమె రోడ్డు మార్గాన తిరుచనూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయ అధికారులు ఆమెకు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. ఆలయంలో కొనసాగుతున్న కార్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా పద్మావతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆమెను శాలువాతో సన్మానించి , తీర్థ ప్రసాదాలు అందజేశారు.అనంతరం రాష్ట్రపతి తిరుమలకు చేరుకుని పద్మావతి గెస్ట్‌హౌజ్‌లో బస చేయనున్నారు. శుక్రవారం తిరుమలలో ముందుగా వరహాస్వామిని అనంతరం వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారని అధికారులు తెలిపారు.

# సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరైన జగన్ ఆరేళ్ల తర్వాత వ్యక్తిగతంగా హాజరు






**హైదరాబాద్ :** వాహనదారులకు అలర్ట్. నేడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ఆస్తుల కేసులో ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేడు (నవంబర్ 20) ఉదయం 10:30 గంటలకు నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో కోర్టు పరిసర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు గుమిగూడే అవకాశం ఉంది. దీని కారణంగా తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉన్నందున.. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ డైవర్షన్స్ ప్రకటించారు. ప్రయాణికులు నాంపల్లి కోర్టు మార్గంలో వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచించారు.ట్రాఫిక్ మళ్లింపులు ఇలా.మసబ్ట్యాంక్, అల్సభా కేఫ్ మీదుగా నాంపల్లి క్రిమినల్ కోర్టు వైపు వచ్చే ట్రాఫిక్‌ను మేరోజ్ కేఫ్ వద్ద దారి మళ్లించి దర్గా-ఏక్ మినార్ - తాజ్ ఐలాండ్స్ మీదుగా పంపనున్నారు.తాజ్ ఐలాండ్స్, దర్గా మీదుగా నాంపల్లి క్రిమినల్ కోర్టు వైపు వచ్చే ట్రాఫిక్‌ను మేరోజ్ కేఫ్ వద్ద దారి మళ్లించి బజార్ఘాట్- గోకుల్‌నగర్ వైపు మళ్లించనున్నారు.లక్డీకాపూల్-రాయలసీమ రుచులు లేన్-ఫిక్కీ బిల్డింగ్ మీదుగా వచ్చే వాహనాలను ఫిక్కీ మార్గ్ వద్ద దారి మళ్లించి న్యూ హిమాలయా కేఫ్ - బజార్ఘాట్ వైపు డైవర్ట్ చేస్తారు.ఎంజే మార్కెట్ నుంచి తాజ్ ఐలాండ్స్ మీదుగా ఏక్ మినార్, దర్గా, నాంపల్లి క్రిమినల్ కోర్టు వైపు వెళ్లాలనుకునే వాహనాలను అవసరాన్ని బట్టి తాజ్ ఐలాండ్స్ వద్ద దారి మళ్లించి నాంపల్లి మెట్రో స్టేషన్ - చాపెల్ రోడ్ - అసెంబ్లీ మెట్రో స్టేషన్ వైపు మళ్లిస్తారు.మసబ్ట్యాంక్- అల్సభా కేఫ్- బజార్ఘాట్ మీదుగా వచ్చే వాహనాలను బజార్ఘాట్ చౌరస్తా వద్ద దారి మళ్లించి నీలోఫర్ కేఫ్ లేన్ - అయోధ్య జంక్షన్ - పీటీఐ బిల్డింగ్ వైపు మళ్లించనున్నారు.ఉదయం 10:30 గంటల సమయంలో నాంపల్లి కోర్టు మార్గంలో ప్రయాణించే వాహనదారులు, మెట్రో రైలును లేదా ప్రత్యామ్నాయ దారులను ఉపయోగించుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఏదైనా ట్రాఫిక్ ఇబ్బంది ఎదురైతే, వెంటనే ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలని కోరారు.కాగా, ఆస్తుల కేసులో జగన్ చివరి సారిగా 2020 జనవరి 10న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు. ఆ తర్వాత ఆయన ఇప్పుడు మళ్లీ ఐదేళ్ల తర్వాత కోర్టుకు హాజరవుతున్నారు. మొత్తం 11 ఛార్జ్ షీట్ల విచారణలో భాగంగా ఏసీబీ న్యాయమూర్తి ఎదుట హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు కోర్టు పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

# కుప్పం ప్రజలకు అండగా ఉంటాం: నారా భువనేశ్వరి



**చిత్తూరు, నవంబర్ 20:** కుప్పం నియోజకవర్గ ప్రజలకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ భవన్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. కుప్పంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం శాంతిపురంలోని తన నివాసంలో నారా భువనేశ్వరి గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుంచి అర్జీలను ఆమె స్వీకరించారు.డీకే పల్లి వద్ద కృష్ణా జలాలకు నారా భువనేశ్వరి జల హారతి ఇచ్చారు. అంతకు ముందు గంగమ్మ ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణమ్మకు చీర సారె అందించడం తన పూర్వ జన్మ సుకృతమని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో నారా భువనేశ్వరిని కలిశారు. స్వచ్ఛ భారత్ అవార్డులు గెలుచుకున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను ఆమె అభినందించారు. దయాళ్ శ్రవణ్ ఫౌండేషన్ స్పాన్సర్ చేసిన వినికిడి పరికరాలను పంపిణీ చేశారు.అనంతరం డీకే పల్లి వద్ద కృష్ణా జలాలకు ఆమె జల హారతి ఇచ్చారు. అంతకు ముందు గంగమ్మ ఆలయంలో నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణమ్మకు చీర సారె అందించడం తన పూర్వ జన్మ సుకృతమని ఆమె పేర్కొన్నారు. కుప్పంలో ఇలా శ్రీశైలం నుంచి వచ్చిన కృష్ణా జలాలను చూడడం తన జన్మలో మర్చిపోలేని అనుభూతిని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో మహిళలు తరలి వచ్చారు.నాలుగు రోజుల పాటు.కుప్పంలో నారా భువనేశ్వరి నాలుగు రోజుల పాటు పర్యటించనున్నారు. అందుకోసం బుధవారం ఆమె కుప్పం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కుప్పం, శాంతిపురం, గుడిపల్లి, రామకుప్పం మండలాల్లో నారా భువనేశ్వరి పర్యటించనున్నారు.

# తిరుమల శ్రీవారి భక్తులు వాళ్లకు డబ్బులు ఇవ్వొద్దు హెచ్చరించిన టీటీడీ



**తిరుమల:** శ్రీవారి భక్తుల్ని టీటీడీ అలర్ట్ చేసింది.. విరాళాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరించారు. ఈ మేరకు టీటీడీ ఒక ప్రకటనను విడుదల చేసింది. 'తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్న సంస్థలకు ఎట్టి పరిస్థితుల్లోనూ శ్రీవారి భక్తులు విరాళం ఇవ్వొద్దు. అంతేకాదు భక్తులు పేర్లతో వ్యవహరిస్తున్న కొందరు వ్యక్తులు తిరుమల, తిరుపతి, తిరుచానూరు ప్రాంతాలను పుణ్యక్షేత్రాలుగా ప్రకటించేందుకు నవంబర్ 29న ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తూ మోసపూరిత చర్యలతో విరాళాలు సేకరించేందుకు భక్తులను తప్పుదారి పట్టిస్తున్నారని మా దృష్టికి వచ్చింది. ఈ విధమైన అనుమానాస్పద సంస్థలకు విరాళాలు ఇవ్వకుండా, వారి వలలో పడకుండా భక్తులు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తిరుమల పవిత్రతను కాపాడేందుకు, భక్తుల విశ్వాసం నిలబెట్టేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నాము' అని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.తిరుచానూరు పద్మావతి కార్తీక బ్రహ్మోత్సవాలు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం ఉదయం కల్పవృక్ష వాహనంపై శ్రీ మురళీకృష్ణ అలంకారంలో శ్రీ పద్మావతి అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల గోష్టితో అమ్మవారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ, చిరుజల్లుల మధ్య వాహనసేవ కోలాహలంగా జరిగింది.పాలక దలిని అమృతం కోసం మథించిన వేళ లక్ష్మీదేవికి తోబుట్టువైంది కల్పవృక్షం. ఆకలిదప్పుల్ని తొలగించి, పూర్వ జన్మస్మరణను ప్రసాదించే ఈ ఉదార దేవతావృక్షం అన్ని కోరికలనూ తీరుస్తుంది. ఖడ్గాన్ని, యోగదండాన్ని ధరించే గోపకిశోరుడిలా గోసంపదను పరిరక్షించే మంగళదేవత అలమేలుమంగ. మంగమ్మ పాదాలు కల్పతరువు చిగురును తలపిస్తున్నాయని అన్నమయ్య కీర్తించాడు. కోర్కెలను ఈడేర్చే కల్పవృక్షంపై విహరి స్తున్న అలమేలుమంగ ఆశ్రితభక్తులకు లేముల్ని తొలగించే పరిపూర్ణశక్తి. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వీ వీరబ్రహ్మం, సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, అర్చకులు బాబుస్వామి, అర్చకులు , ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొ న్నారు.సింహ వాహనంపై పద్మావతి అమ్మవారు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవ రోజు బుధవారం రాత్రి సింహ వాహనంపై యోగనరసింహుడి అలంకారంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. సింహం పరాక్రమానికి, శీఘ్రగమనానికి, వాహనశక్తికి ప్రతీక. అమ్మవారికి సింహం వాహనంగా సమకూరిన వేళ దుష్టశిక్షణ, శిష్టరక్షణ అవలీలగా చేస్తుంది. భగవతి పద్మావతి ఐశ్వర్యం, వీరత్వం , యశస్సు, శ్రీ (ప్రభ), జ్ఞానం, వైరాగ్యం అనే ఆరు గుణాలను భక్తులకు ప్రసాదిస్తుంది. శ్రీ వేంకటేశ్వర హృదయేశ్వరిని స్వామితో మమేకమైన శక్తిగా ధ్యానించడం సంప్రదాయం. వాహనసేవలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్, ఆలయ డిప్యూటీ ఈవో ఆలయ అర్చకులు బాబు స్వామి,అర్చకులు,ఇతరఅధికారులు,విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# సుబ్బారెడ్డికి బిగుస్తున్న ఉచ్చు



హైదరాబాద్, నవంబర్ 20: శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని సిట్ అధికారుల బృందం విచారిస్తోంది. గురువారం హైదరాబాద్‌లోని వైవీ సుబ్బారెడ్డి నివాసంలోనే ఆయన్ని సిట్ అధికారులు విచారిస్తున్నారు. భోజన విరామానికి గంట సమయం ఇచ్చి.. అనంతరం మళ్లీ విచారణను చేపట్టారు. ఇప్పటికే ఈ కేసులో వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్నతోపాటు టీటీడీ మాజీ ఈవో ఏవీ ధర్మారెడ్డి పలువురు ఉన్నతాధికారులకు సిట్ అధికారులు విచారించిన సంగతి తెలిసిందే. వారిచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా వైవీ సుబ్బారెడ్డిని సిట్ అధికారులు విచారిస్తున్నారు.అంతేకాదు.. గతంలో సదరు అధికారులు ఇచ్చిన స్టేట్‌మెంట్లతోపాటు పలు కీలక డాక్యుమెంట్లను సైతం వైవీ సుబ్బారెడ్డి విచారణ సందర్భంగా హైదరాబాద్‌కు సిట్ అధికారులు తీసుకు వచ్చారు. వీటిని ముందు పెట్టి.. వైవీ సుబ్బారెడ్డిని సిట్ అధికారులు విచారిస్తున్నారు.

తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై సిట్ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే టీటీడీలోని పలువురు ఉన్నతాధికారులను సిట్ విచారించింది. ఈ విచారణలో వెలుగు చూసిన అంశాల ఆధారంగా టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో టీటీడీ అధికారులు చెప్పిన స్టేట్‌మెంట్లతోపాటు పలు డాక్యుమెంట్ల ఆధారంగా వైవీ సుబ్బారెడ్డికి సిట్ అధికారులు ప్రశ్నలు వేస్తున్నారు. ఈ విచారణలో వైవీ సుబ్బారెడ్డికి సంధించిన పలు ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుంటే.. ఈ డాక్యుమెంట్లతోపాటు సేట్‌మెంట్లను ఆయన ఎదుట సిట్ అధికారులు ఉంచినట్లు తెలుస్తోంది.

# జగన్ బయట ఉంటే ప్రమాదమే




**అమరావతి, నవంబర్ 20:** వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మరోసారి ధ్వజమెత్తారు. కోర్టుకు వెళ్తూ పెళ్లి పీటలు ఎక్కే వాడిలా బిల్డప్ ఇస్తూ జగన్ కోర్టు బోనులోకి వెళ్లారంటూ వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు సిగ్గు శరం ఉందో లేదో అర్థం కావడం లేదని మండిపడ్డారు. 12 ఏళ్లుగా బెయిల్ మీద ఉండి రాష్ట్రాన్ని రాక్షస పాలనతో విధ్వంసం చేశారని విమర్శించారు. బిహార్ సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పేదలకు సేవ చేసే నాయకులు వెళ్లారని... జగన్ తప్పులు చేశారు కాబట్టి కోర్టులో ఉన్నారని.. ఇదే దేవుడి స్క్రిప్ట్ అని అన్నారు. 2020లో సీఎంగా నాంపల్లి కోర్టులో హాజరు అయ్యారని.. ఈరోజు పులివెందుల ఎమ్మెల్యేగా హాజరు కావడం నిజమైన స్క్రిప్ట్ అంటూ దుయ్యబట్టారు.ఇప్పటివరకు న్యాయస్థానాలకు రాకుండా కుంటి సాకులతో వాయిదాలు వేయించారని మండిపడ్డారు. ప్రజల కోసం వచ్చినట్లు రూట్ మ్యాప్‌లు ఇచ్చి కోర్టుకు వెళ్లడం హాస్యాస్పదమన్నారు. కోర్టుకు వచ్చే టైమ్ కూడా జగనే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. న్యాయ వ్యవస్థనూ జగన్ అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. జగన్‌లా చంద్రబాబు ఎప్పుడూ అవినీతి కేసులపై జైలుకు వెళ్లలేదన్నారు. చంద్రబాబును అరెస్ట్ చేస్తే 110 దేశాల్లో ఆయన కోసం ఆందోళనలు చేశారని... అదీ బాబు ట్రాక్ అంటూ చెప్పుకొచ్చారు.జగన్ సీఎంగా ఉన్నా, ప్రతిపక్షంగా ఉన్నా, ప్రజలను భయభ్రాంతులను గురి చేస్తున్నారని మండిపడ్డారు.

చర్చ
తెలుగు దిన పత్రిక




# 10వసారి సీఎంగా నీతీశ్ కుమార్ ప్రమాణ స్వీకారం - మోదీ, అమిత్ షా, చంద్రబాబు హాజరు

బిహార్ ముఖ్యమంత్రిగా జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ గురువారం పదోసారి ప్రమాణం చేశారు. పట్నాలోని గాంధీ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, ఏపీ సీఎం చంద్రబాబు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి నీతీశ్‌తోపాటు 19 మంది మంత్రులు ప్రమాణం చేశారు. బీజేపీ నుంచి సీనియర్ నాయకుడు సామ్రాట్ చౌధరి, దిలీప్ జైశ్వాల్, మంగల్ పాండే, రామ్‌కృపాల్ యాదవ్, సంతోష్ సుమన్ తదితరులు మంత్రులుగా ప్రమాణం చేశారు. జేడీయూ నుంచి విజయ్ కుమార్ చౌధరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్, శ్రోవన్ కుమార్, లేసి సింగ్, సునీల్ కుమర్ల చేత గవర్నర్ అమాత్యులుగా ప్రమాణం చేయించారు. ఎల్జేపీ- రామ్‌విలాస్ పాసవాన్, రాష్ట్రీయ లోక్ మోర్చా, హిందూస్తాన్ అవామ్ మోర్చా నుంచి ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. జనవరిలో కేబినెట్ విస్తరణ ఉంటుందని ఎన్డీయే వర్గాలు తెలిపాయి.అయితే బుధవారం జరిగిన ఎన్డీయే ఎమ్మెల్యేల సమావేశంలో శాసనసభాపక్ష నేతగా ఆయనను ఎన్నుకున్నారు. తాను ఎన్నిక కాగానే సీనియర్ నేతలు వెంటరాగా నీతీశ్, గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ వద్దకు వెళ్లారు. రాజీనామా సమర్పించి కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు



ఆహ్వానించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తనకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన లేఖను ఆయనకు అందజేశారు. నీతీశ్ రాజీనామాను ఆమోదించిన గవర్నర్, కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని సూచించారు. విరామం లేకుండా వెంటనే కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభమైంది.ఎన్నికల్లో ఎన్డీఏ ఆధిపత్యంబిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నీతీశ్ మోదీ కాంబినేషన్ మరోసారి ఫలించింది. మొత్తం 243 స్థానాల్లో ఎన్డీయే 202 సీట్లు గెలుచుకొని ఘన విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో అత్యధిక విజయాలు సాధించిన పార్టీగా బీజేపీ నిలిచింది. 101 స్థానాల్లో పోటీ చేసిన భాజపా 89 సీట్లు గెలుచుకుంది. స్ట్రైక్ రేట్ 88 శాతానికి చేరింది. అదే సంఖ్యలో పోటీ చేసిన జేడీయూ 85 స్థానాలు గెలిచి తక్కువ తేడాతో రెండో స్థానంలో నిలిచింది. ఎన్డీఏ విజయోత్సాహంలో భాగంగా 19 మంది ఎమ్మెల్యేలతో కొత్త మంత్రివర్గం రూపుదిద్దుకుంది. పార్టీవారీగా కొత మంత్రుల సంఖ్య ఇలా ఉంది:బీజేపీ 10జేడీయూ 6ఆర్ఎల్ఎం, హెచ్ఏఎం, లోక్ జన్‌శక్తి (రాంవిలాస్) ఒక్కొక్కరి చొప్పునఇలా పెద్ద కూటమిలోని చిన్న పార్టీలకు కూడా ప్రాతినిధ్యం లభించింది.పదోసారి సీఎం అరుదైన రికార్డుబిహార్ రాజకీయాల్లో అత్యంత కాలం పదవిలో కొనసాగిన ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇప్పటి వరకు మొత్తం 19 సంవత్సరాలు బిహార్‌ను నడిపించారు. 2000లో కేవలం ఏడు రోజులు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన, తర్వాత క్రమంగా రాజకీయ బలం పెంచుకొని, వివిధ కూటములతో కలిసి అనేక దఫాలు అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు పదోసారి సీఎంగా ప్రమాణం చేసి అరుదైన రికార్డు సృష్టించారు.

# చెన్నై నగరంలో 10 లక్షల ఓట్ల గల్లంతు



**చెన్నై:** రాజధాని నగరం చెన్నైలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో సుమారు 10 లక్షల మంది ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి బూత్‌లోనూ అడ్రస్ మారిన ఓటర్లు 300 మంది వరకు ఉన్నారని గుర్తించడంతో సవరణ పనుల్లో తీవ్ర చిక్కులు ఏర్పడతాయని అధికారులు తెలిపారు. ఈ నెల నాలుగున ప్రారంభమెన ఈ ప్రత్యేక సమగ్ర సవరణ పనులు మందకొడిగానే జరుగుతున్నాయి.రాష్ట్రమంతటా ఈ సవరణ పనుల కోసం ముద్రించిన 6.41 కోట్ల దరఖాస్తులను ఓటర్లకు అందజేశారు. ఆ దరఖాస్తు ఎలా పూర్తి చేయాలో తెలియక ఓటర్లంతా తలపట్టుకుంటున్నారు. నగరంలో 40 లక్షలకు పైగా ఓటర్లున్నారు. 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుతం జరుగుతున్న సవరణ ప్రక్రియంలో బీఎల్వోల పరిశీలనలో ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ 200 నుండి 300 మంది వరకు ఓటర్లు వేరే నియోజకవర్గాల్లో నివసిస్తున్నట్లు తేలింది.ఆ ప్రాకారం సుమారు 10లక్షల మంది ఓటర్లు వేర్వేరు చిరునామాల్లో నివసిస్తున్నట్లు గుర్తించారు. ప్రతి బూత్ వద్ద 60 శాతం మంది ఎన్నిలక సంఘం సిబ్బంది ఇచ్చే దరఖాస్తులను సులువుగా నింపగలుగుతున్నారు. తక్కిన 40 శాతం మంది ఆ ఫారాలను ఎలా పూర్తి చేయాలో తెలియక సతమతమవుతున్నారు. ఇక అడ్రసలు మారిన ఓటర్లంతా ప్రస్తుతం తాము నివసిస్తున్న నియోజకవర్గంలో హక్కు పొందటానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమేంటని ప్రశ్నిస్తున్నారు.

# గవర్నర్ - రాష్ట్రపతి అధికారాల పై సుప్రీం కోర్టు కీలక తీర్పు



**న్యూఢిల్లీ:** గవర్నర్ %-% రాష్ట్రపతి అధికారాలపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించిన అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించటం తగదని స్పష్టం చేసింది. కారణం చెప్పకుండా గవర్నర్‌లు బిల్లులను వెనక్కి పంపలేరని తెలిపింది. బిల్లును నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్‌కు లేదని కూడా తేల్చి చెప్పింది. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి పంపితేనే రాష్ట్రపతి చర్యలు తీసుకోగలరని చెప్పింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు విచక్షణాధికారం ఉందని వెల్లడించింది.గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి పంపడం, అభిప్రాయాలతో తిరిగి పంపడం, బిల్లును పరిశీలించి సూచనలు ఇవ్వడం వంటివి మాత్రమే చేస్తారని తెలిపింది. రాష్ట్ర పరిపాలనలో తుది అధికారం ఎన్నుకోబడిన మంత్రివర్గానిదేనని స్పష్టం చేసింది. ఒక రాష్ట్రంలో రెండు ఎగ్జిక్యూటివ్ పవర్స్ ఉండవని, ప్రభుత్వం ఒక్కటే ప్రధాన నిర్ణయాధికారి అని తేల్చి చెప్పింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించటంపై ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పంపిన ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌పై స్పందిస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది.

# భక్తుల రద్దీ- ఇక నుంచి శబరిమలలో రోజుకు 5000 స్పాట్ బుకింగ్స్- హైకోర్టు ఆదేశాలు

**కేరళ :** కేరళ లోని శబరిమల అయ్యప్ప ఆలయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో ట్రావెన్?కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) కీలక నిర్ణయం తీసుకుంది. అయ్యప్ప దర్శనం కోసం రోజువారీ స్పాట్ బుకింగ్‌లను గరిష్ఠంగా 5,000కి పరిమితం చేసింది. సోమవారం వరకు ఇదే పరిమితి కొనసాగనుంది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో అటవీ మార్గం ద్వారా వచ్చే యాత్రికుల సంఖ్యను రోజుకు 5,000కి పరిమితం చేయాలని టీబీడీ నిర్ణయించింది. కాగా, మండల- మకరవిళక్కు వార్షిక తీర్థయాత్ర నేపథ్యంలో శబరిమలలో నెలకొన్న భక్తుల రద్దీపై కేరళ హైకోర్టు ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇచ్చిన ఆదేశాల మేరకు ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.అనియంత్రిత రద్దీ నేపథ్యంలో, దేవస్థానం బోర్డు గతంలో స్పాట్ బుకింగ్ లను 20,000కి తగ్గించాలని నిర్ణయించింది. పంబాలో రద్దీని తగ్గించడానికి నీలక్కల్ లో మరో ఏడు స్పాట్ బుకింగ్ కౌంటర్లను తెరవాలని కూడా నిర్ణయం తీసుకుంది. అయితే శబరిమలలో నెలకొన్న రద్దీ, ఏర్పాట్లపై వివిధ పిటిషన్లపై విచారణ జరిపింది కేరళ హైకోర్టు. ఈ క్రమంలో రద్దీని పూర్తిగా నియంత్రించడానికి సోమవారం వరకు రోజుకు 5,000 స్పాట్ బుకింగ్ లను మాత్రమే అనుమతించాలని టీడీబీని ఆదేశించింది. యాత్రికుల రద్దీని నియంత్రించడానికి శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని కోరింది.రద్దీ తగ్గితే రోజుకు 10వేల స్పాట్ బుకింగ్ హైకోర్టు ఆదేశాల మేరకు శబరిమలలో భక్తుల రద్దీని నివారించడానికి టీడీబీ కీలక చర్యలు తీసుకుంది. పంబాలోని ఒకటి, నీలక్కల్‌లో ఏడు స్పాట్ బుకింగ్ కౌంటర్లను అందుబాటులోకి తెచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ హైకోర్టు ఆదేశించినదానికంటే ఎక్కువ స్పాట్ బుకింగ్?లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుం



టోంది. సన్నిధానం (ప్రధాన ఆలయ సముదాయం) వద్ద పరిస్థితిని సమీక్షించిన తర్వాత రోజుకు స్పాట్ బుకింగ్ల పరిమితిని 10,000కి పెంచడాన్ని పరిగణలోకి తీసుకుంటామని టీడీబీ తెలిపింది. మరోవైపు ఈ నెలాఖరు వరకు మొత్తం వర్చువల్ క్యూ బుకింగ్?లు ఇప్పటికే పూర్తయ్యాయి.యాత్రికుల కోసం వసతి ఏర్పాట్లులాగే రోజువారీ పరిమితికి మించి వచ్చే యాత్రికులను నియంత్రించడానికి అధికారులు కృషి చేస్తున్నారు. అలాగే నీలక్కల్ వద్ద వేచి ఉన్న యాత్రికుల కోసం వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. అలాగే యాత్రికులకు తాగునీరు, స్నాక్స్, కాఫీ అందించడానికి ఈ కాంప్లెక్స్‌ల్లో అదనపు సిబ్బందిని నియమించారు. అలాగే యాత్రికులు అయ్యప్ప దర్శనం పూర్తి చేసుకున్న వెంటనే పంబా నుంచి తిరిగి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.శబరిమలకు పోటెత్తిన భక్తులుమండల-మకరవిళక్కు సీజన్ నేపథ్యంలో శబరిమల అయ్యప్ప ఆలయాన్ని ఆదివారం తెరిచారు. అప్పటి నుంచి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల వరకు వర్చువల్ క్యూ, స్పాట్ బుకింగ్ ల ద్వారా మొత్తం 1,96,594 మంది యాత్రికులు అయ్యప్పను దర్శించుకున్నారు. ఆదివారం సాయంత్రం ఆలయం తెరిచిన తర్వాత 53,278 మంది, సోమవారం 98,915 మంది, మంగళవారం మధ్యాహ్నం వరకు 44,401 మంది శ్రీధర్మశాస్త్రుడిని దర్శించుకున్నారురంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ రోవైపు, శబరిమలలో రద్దీ నేపథ్యంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. త్రిస్సూర్ ప్రాంతీయ డిజాస్టర్ దళానికి చెందిన 30 మంది సభ్యుల బృందం నవంబర్ 19న సన్నిధానానికి చేరుకుంది. చెన్నై నుంచి 38 మంది సభ్యుల బృందం నవంబర్ 19 రాత్రికి చేరుకుంటుంది. యాత్రికులకు సీపీఆర్ చేయడంతో పాటు అత్యవసర వైద్య సహాయం అందించడానికి వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. శబరిమల ఏడీఎం, పోలీసు ప్రత్యేక అధికారి సూచనల మేరకు ఈ బృందం పనిచేస్తుందని ఎన్డీఆర్ఎఫ్ టీమ్ కమాండర్ ఇన్ స్పెక్టర్ జీసీ ప్రశాంత్ తెలిపారు.కేరళ ప్రభుత్వానికి కర్ణాటక విజ్ఞప్తితమ రాష్ట్రం నుంచి వచ్చే భక్తులకు సౌకర్యాలు, భద్రతను కల్పించాలని కేరళ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ జయతిలకకు కర్ణాటక ప్రధాన కార్యదర్శి డాక్టర్ షాలిని రజనీశ్ లేఖ రాశారు. కర్ణాటక నుంచి ప్రతి సంవత్సరం పెద్ద సంఖ్యలో భక్తులు శబరిమలను సందర్శిస్తారని లెటర్ లో పేర్కొన్నారు. కర్ణాటక యాత్రికులకు రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. అవసరమైన వైద్య సహాయం, అత్యవసర ప్రతిస్పందన సేవలు అందించాలని కోరారు. యాత్రికుల సంక్షేమాన్ని నిర్ధారించడానికి, ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రదేశాలలో పోలీసులను మోహరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఢిల్లీలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం



**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదిరింపులు మరోసారి కలకలం రేపాయి. నగరంలోని ఓ పాఠశాలకు గురువారం ఉదయం బెదిరింపులు వచ్చాయి. చాణక్యపురిలోని సంస్కృతి పాఠశాలకు బెదిరింపు మెయిల్ వచ్చింది. అప్రమత్తమైన పాఠశాల యాజమాన్యం ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు తెలియజేసింది.అప్రమత్తమైన పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో పాఠశాలకు చేరుకొని తనిఖీలు చేపట్టారు. ముందు జాగ్రత్తగా విద్యార్థులు, సిబ్బందిని అక్కడి నుంచి ఖాళీ చేయించి సోదాలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ బెదిరింపు బూటకమని పోలీసులు తేల్చారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.కాగా, రెండు రోజుల క్రితం కూడా ఢిల్లీలోని పలు కోర్టులు, పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులే వచ్చిన విషయం తెలిసిందే. సాకేత్ కోర్టు, పాటియాలా హౌస్ కోర్టు, తీస్ హజారీ కోర్టు సహా ఇతర జిల్లా కోర్టులకు మంగళవారం ఉదయం బాంబు బెదిరింపులు వచ్చాయి. అంతేకాదు నగరంలోని ద్వారకా, ప్రశాంత్ విహార్ ప్రాంతాల్లోని సీఆర్‌పీఎఫ్ పాఠశాలలను లక్ష్యంగా చేసుకొని బెదిరింపులకు పాల్పడ్డారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే భద్రతా చర్యలు చేపట్టారు.

# నేపాల్‌లో మళ్లీ జెన్-జీ నిరసనలు కర్ఫ్యూ విధింపు

**నేపాల్:** నేపాల్‌లో యువత మరోసారి నిరసనల బాట పట్టడంతో కలకలం రేగుతోంది. బారా జిల్లాలోని సిమారా చౌక్‌లో యువత నిరసనలకు దిగడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఆ తరువాత కర్ఫ్యూ విధించారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు భాష్పవాయువు ప్రయోగించినట్టు కూడా తెలిసింది. ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు కూడా కొంత సేపు నిలిచిపోయాయి వచ్చే ఏడాది మార్చ్‌లో నేపాల్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో సీపీఎన్ యూఎమ్ఎల్ పార్టీ నేతలు కొందరు బుధవారం బారా జిల్లాకు వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న తమపై యూఎమ్ఎల్ నేతలు దాడి చేశారని జెన్ జీ ఉద్యమ నేత ఒకరు ఆరోపించారు. తమపై అకారణంగా దాడి చేసిన వారిని ఇంకా ఎందుకు అరెస్టు చేయలేదంటూ యువత గురువారం నిరసనలకు దిగింది. దీంతో, పోలీసులు రంగంలోకి దిగి కర్ఫ్యూ విధించారు. నేటి రాత్రి 8 గంటల వరకూ కర్ఫ్యూ కొనసాగనుంది. కాగా,



బుధవారం నాటి ఘర్షణలకు సంబంధించి పోలీసులు ఇప్పటికే ఇద్దరు సీపీఎన్-యూఎమ్ఎల్ పార్టీ నేతలను అరెస్టు చేశారు. మరోవైపు, యువత సమ్యమనం పాటించాలని నేపాల్ ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సుశీల కర్కీ కోరారు. రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవ ద్దని రాజకీయ పార్టీలకు కూడా సూచించారు.సెప్టెంబర్‌లో తలెత్తిన జెన్-జీ నిరసనలతో కేపీ ఓలీ శర్మ సారథ్యంలోని యూఎమ్ఎల్ ప్రభుత్వం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఆ నిరసనల్లో ఏకంగా 76 మంది కన్నుమూశారు. సోషల్ మీడియాపై బ్యాన్‌తో మొదలైన నిరసనలు చివరకు అసమర్థ, అవినీతిమయ ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా రూపాంతరం చెందింది. ప్రజాస్వామ్య ప్రభుత్వ ఏర్పాటు కోసం వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి.

# 350 సుంకాలతో భారత్ పాక్‌ను బెదిరించా

**అమెరికా :** భారత్- పాకిస్థాన్ యుద్ధాన్ని ఆపడం గురించి మరోసారి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాత పాటే పాడారు. భారత్, పాకిస్థాన్‌ను 350 శాతం సుంకాలతో బెదిరించి, ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించానని తెలిపారు. తాము యుద్ధానికి వెళ్లబోవడం లేదని భారత ప్రధాని నరేంద్ర మోదీ తనకు ఫోన్ చేశారని పేర్కొన్నారు. కాగా, కాల్పుల విరమణను పాకిస్థాన్ కోరిందని, ఇందులో మూడో పక్షం జోక్యం లేదని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసినప్పటికీ, ట్రంప్ ఇదే విషయాన్ని ఇప్పటి వరకు 60 సార్లు రిపీట్ చేయడం గమనార్హం.'యుద్ధాల ను ఆపడంలో నేను నిపుణుడ్ని"వివాదాలను పరిష్కరించడంలో నేను నిపుణుడిని. నేను పలు దేశాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించాను. యుద్ధాలు జరగకుండా అడ్డుకున్నాను. భారత్, పాకిస్థాన్ అణ్వాయుధాలతో యుద్ధానికి సిద్ధం అయ్యాయి. అప్పుడు నేను రెండు దేశాలను హెచ్చరించాను. మీరు యుద్ధం చేసుకోవచ్చు, కానీ రెండు దేశాలపై 350 శాతం సుంకాలు విధిస్తానని వార్నింగ్ ఇచ్చాను. ఇకపై అమెరికాతో వ్యాపారం చేయలేరని చెప్పాను. నా దగ్గరకు వస్తే ఇరుదేశాల మధ్య సమస్యలను పరిష్కరిస్తారని చెప్పాను. భారత్. పాక్ ఒకరిపై ఒకరు అణుయుద్ధానికి దిగి లక్షలాది మంది ప్రాణాలు తీసుకో వద్దని సూచించాను. అణు ధూళి లాస్ ఏంజిల్స్ పై తేలియా డటాన్ని



నేను చూడలేను" అని సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ హాజరైన యూఎస్-సౌదీ ఇన్వెస్ట్ మెంట్ ఫోరమ్‌లో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.ఎనిమిది యుద్ధాలను ఆపాను'భారత్, పాక్?లు యుద్ధాన్ని ఆపేస్తే, ఇరుదేశాలతో యూఎస్ మంచి వాణిజ్య ఒప్పందాలను చేసుకుంటుందని హామీ ఇచ్చానని చెప్పారు ట్రంప్. ఎందుకంటే అప్పటికే అమెరికాతో ఇరుదేశాలకు వాణిజ్య చర్చలు జరుగుతున్నాయని అన్నారు. "ఇప్పటివరకు మరే ఇతర అధ్యక్షుడు కూడా నాలా చేసి ఉండడు. ఈ యుద్ధాలన్నింటినీ పరిష్కరించడానికి నేను సుంకాలను ఉపయోగించాను. టారిఫ్ లను ఉపయోగించి ఎనిమిది యుద్ధాలను ఆపాను. ఎనిమిది యుద్ధాలలో ఐదు ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, సుంకాల కారణంగా పరిష్కరమయ్యాయి" అని 'పాక్, భారత ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు'అలాగే యుద్ధం జరగకుండా ఆపి లక్షలాది మంది ప్రాణాలను కాపాడినందుకు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలిపారని ట్రంప్ అన్నారు. ఆ తర్వాత భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా కృతజ్ఞతలు తెలియజేశారని వెల్లడించారు. భారత్- యూఎస్ మధ్య ఒక మంచి ఒప్పందం కుదుర్చుకుందామని అన్నారని గుర్తుచేసుకున్నారు. ఇప్పటివరకు అనేక యుద్ధాలను ఆపి, లక్షలాది మందిని రక్షించారని అన్నారు.పాక్?పై ప్రతీకారం తీర్చుకున్న భారత్ఈ ఏడాది ఏప్రిల్?లో పహల్గాంలో అమాయక పర్యటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 26 మంది మరణించారు. దీంతో పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్రస్థావరాలపై భారత్ మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ క్రమంలో వందలాది మంది ముష్కరులు హతమయ్యారు. దీంతో భారత్- పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధ వాతావరణం నెలకొంది. భారత్?పై పాక్ వైమానిక దాడుల యత్నించగా, ఇండియా సైన్యం వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టింది. కరాచీ పోర్టు, సైనిక స్థావరాలపై భారత సైన్యం దాడులు చేసి దాయాది దేశాన్ని తీవ్రంగా దెబ్బకొట్టింది.

# ఢిల్లీ పేలుడు కేసులో మరో నలుగురు అరెస్ట్

**ఢిల్లీ :** ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుళ్లతో సంబంధం ఉన్న మరో నలుగురు నిందితులను పట్టుకుంది. ఇవాళ శ్రీనగర్‌లో వీరిని అరెస్ట్ చేసింది. దీంతో ఈ దాడితో సంబంధం ఉన్న మొత్తం అరెస్టులు 6కి పెరిగాయి. నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట దగ్గర జరిగిన పేలుడు ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ ముమ్మరంగా దర్యాప్తు సాగిస్తోన్న సంగతి తెలిసిందే. జిల్లా సెషన్స్ జడ్జి, పాటియాలా హౌస్ కోర్టు జారీ చేసిన ఆర్డర్ల మేరకు నలుగురు



నిందితులను జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు.వారిని జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనై, జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌కు చెందిన డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన డాక్టర్ షాహీన్ సయీద్ ఇంకా, జమ్మూ కాశ్మీర్‌లోని షోపియన్‌కు చెందిన ముఫ్తీ ఇర్ఫాన్ అహ్మద్ వాగేగా గుర్తించారు. వీరందరూ ఢిల్లీ బ్లాస్ట్ లో ముఖ్యమైన పాత్ర పోషించారని దర్యాప్తు ఏజెన్సీ చెబుతోంది.

# రాజకీయమంటే హంగామా చేయడమా !



రాజకీయాలు పూర్తిగా కలుషితమయ్యాయి. నేరచరిత్ర ఉన్నవారు కూడా హంగామా చేస్తున్నారు. కోర్టులో కేసుకు హాజరు కావడం కోసం హంగామా చేయడం దారుణం కాక మరోటి కాదు. దానికోసం పోలీసులు హైరానా పడడం, భారీగా బందోబస్తు ఏర్పాటు చేయడం పరిపాటిగా మారింది. వీరికోసం ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీస్ సిబ్బంది సమయాన్ని, శక్తిని వృధా చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లో సిబిఐ కోర్టుకు హాజరయ్యేందుకు వచ్చిన జగన్ యధావిధిగా తన మార్క్ హంగామాతో వచ్చారు. పదినిముషాల పాటు కోర్టులో హాజరు కావడానికి మందీబార్బలంతో రావడం, ఇతరులకు అసౌకర్యం కలిగించడం, ఆయన గారి కోసం పోలీసులు నానా హడావిడి చేయడం, రక్షణ కోసం అంటూ జనాన్ని రోడ్డుమీది నుంచి తరిమెయ్యడం లాంటివి చూశాం. గరువారం హైదరాబాద్‌లో జగన్ చేసిన హంగామా చూశాక ఇలాంటి నేతలను ఎన్నకుందుకు ప్రజలు సిగ్గుపడాలి. మన ఓట్లతో వీరు ఊరేగడమేంటని ఆలోచన చేయాలి. జగన్ ఎన్నికయ్యాక ఇప్పటి వరకు అసెంబ్లీకి రావడం లేదు. అలాగే ప్రతిపక్షనేత హోదా ఇస్తేనే వస్తానని మొండి కేశారు. ఇక విశాఖ వచ్చినా, గుంటూరుకు వెళ్లినా ఇదే రకంగా హంగామా చేశారు. ఆయన ర్యాలీగా వచ్చే తోవలో ప్రాణాలు పోగ్గొట్టుకుంటే మాకేంది అన్న రీతిలో జగన్ అహంకారంగా సాగుతున్నారు. ఇకపోతే గతంలో కెటిఆర్ కూడా ఒకటి రెండు సందర్భాల్లో ఇలాగే చేశారు. ఇ- కార్ రేసులో విచారణకు వచ్చిన ప్పుడు, మరో సందర్భంలో ఇలా చేశారు. భారీ కాన్వాయ్‌లతో రావడం, హంగామా చేయడం అవసరమా అన్నది ఆలోచన చేయాలి. కోర్టులు ఆంక్షలు విధిస్తే తప్ప వీరు ర్యాలీలు ఆపేలా లేరు. కనీసం కోర్టుకు విచారణకోసం వచ్చే సందర్భంలో అయినా కోర్టులే ఆంక్షలు విధిస్తే మంచిందని ప్రజలు కోరుకుంటున్నారు. అధికారంలో ఉండగా అడ్డదిడ్డంగా సంపాదించడం, ప్రజలను పురుగుల్లా చూడడం, ఓట్ల కోసం దండాలు పెట్టడం, పీఠమెక్కగానే హంగామాలు చేయడం భారత రాజకీయాల్లో పరిపాటిగా మారింది. ప్రజలే దీనిగురించి ఆలోచించాలి. ఇలాంటి వారిని రాజకీయాలకు దూరం పెట్టాలి. అధికారంలో ఉంటే తమంత గొప్పవారు లేరని భావించడం,అధికారం పోయాక, అధికారంలో ఉన్నవారిని విమర్శించడం ఇప్పుడు కొత్త తరం రాజకీయాలు చూస్తున్నాం. ప్రత్యర్థులను వేధించడమే అధికారం పరమావధి అన్నట్టుగా తెలుగునాట రాజకీయాలను మార్చిన ఘనత కేసీఆర్, జగన్‌రెడ్డిలకు దక్కింది. ఓటుకునోటు కేసులో పట్టుకుని జైలులో వేసిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కావడాన్ని కేసీఆర్, కేటీఆర్,హరీష్ రావులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ కారణంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్,హరీష్ రావులు ఒంటికాలి మీద లేస్తున్నారు. అసభ్యంగా వాడు, వీడు అని సంబోధిస్తున్నారు. జగన్ కూడా అప్పుడే ఎపిలో అంతా అయిపోయిందన్న భావనలో మాట్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం దారుణంగా ఉందని రంకెలు వేస్తున్నారు. ఇలాంటి జగన్,కేసీఆర్‌లనే ప్రజలు మట్టికరిపించారని మరచి మాట్లాడుతున్నారు. ఇకపోతే ఏం జరుగుతుందో తెలుసుకోకుండా అటు జగన్, ఇటు కెటిఆర్ అర్జంటుగా గద్దెమీద ఊరోచ్చేవాలన్న తొందరలో ఏదిపడితే అది మాట్లాడేస్తున్నారు. సోషల్ మీడియాలో ఎవరు పడితే వాళ్లు, ఏదిపడితే అది వాగుతున్నారు. తమచేతిలో సోషల్ మీడియా ఉందన్న గర్వంతో ఇష్టానుసారం పోస్టులు పెడుతున్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత వీరిద్దరూ సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. బలమైన సోషల్ మీడియా సైన్యాన్ని ఏర్పాటు చేసుకుంటే ఎన్నికల్లో గెలిచిపోవచ్చునని, అలా లేనందునే గత ఎన్నికల్లో ఓడిపోయామని కేటీఆర్ గతంలో ఓ సందర్భంలో అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌కు బలమైన సోషల్ మీడియా సైన్యం ఉండి కూడా గత ఎన్నికల్లో ఓటమిని తప్పించుకోలేదు. తాను చేసిందంతా ప్రజల మంచికోసమే అన్న భ్రమలో బటన్ నొక్కుతూ పోయారు. ఇప్పుడేమో ర్యాలీలు, హంగామాలతో మళ్లీ తన ప్రతాపం చాటుతున్నారు. ప్రజల్ని తక్కువ అంచనా వేయడం వల్లే తాము ఓడిపోయామని ఈ రెండు పార్టీల వాళ్లు ఇంకా గుర్తిచడం లేదు. తాము అధికారంలో ఉంటే అంతా సవ్యంగా ఉందని, ఇతరులు అధికారంలో ఉంటే సర్వనాశనం అయిపోతోందని ఎపిలో జగన్, తెలంగాణలో కెటిఆర్ భావిస్తున్నారు. కెసిఆర్ ఉన్నప్పుడే తెలంగాణ బాగుండేదని, ఇప్పుడు ప్రమాదంలో పడిందని కెటిఆర్ నిరంతరంగా ప్రచారం చేయించు కుంటున్నారు. జగన్ అనుయాయులు కూడా ఇదే తరహాలో మీడియా సమావేశాలు పెట్టివాపోతున్నారు. మధ్యలో తెలంగాణ సెంటిమెంట్‌తో బిఆర్‌ఎస్ నేతలు మళ్లీ తమ రాజకీయ పాచికలు వేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తర్వాత కూడా కొంత కాలం పాటు ఇదే సెంటిమెంట్‌ను రగిలించి బీఆర్‌ఎస్ రాజకీయంగా లాభపడింది. అధికారం పోవడంతో ఈ ఇద్దరు నేతలు సొంత మీడియాలో అసత్య కథనాలు, అబద్దాలను ప్రచారం చేసుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎవరేమిటో తెలుసు. అందుకే జూబ్లీహిల్స్‌లో బిఆర్‌ఎస్ బోల్తాపడింది. బిజెపి కూడా అతిగా ఊహించుకుని బొక్కబోర్లా పడింది. ఇవన్నీ ఒక ఎత్తయితే హంగామా రాజకీయాలను రాజకీయ పార్టీల నేతలు మానుకోవాలి. ప్రజలను పరామర్శించ డానికి హంగామా అవసరం లేదు. కోర్టుకు హాజరయినప్పుడు కూడా మందీమార్బలంతో ర్యాలీలు అవసరం లేదు. ఈ విషయాలు అన్ని పార్టీలకు అవసరం. అధికారంలో ఉన్నా, లేకపోయిన పార్టీలు ఈ సూత్రాన్ని పాటించాలి. తమ బలప్రదర్శన కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దు. తమను ఆదరించి అక్కున చేర్చుకున్న వాళ్లే ఎన్నికల్లో ఎందుకు తిరస్కరించారో ఓడిన ప్రతి నాయకుడు తెలుసుకోవాలి. గుణపాఠం నేర్చుకోవాలి. ఓడిపోతే ఎదుటి పార్టీ వారిపై నెపం నెట్టి తప్పించుకోవడం రాజకీయ లక్షణం కాదని గుర్తించాలి. తెలంగాణలో తమకు తిరుగులేదని భావించిన బీఆర్‌ఎస్‌కు ఈ దుస్థితి ఎందుకు ఏర్పడిందో, ఎపిలో బటన్లు నొక్కినా ఎందుకు ప్రజలు తిరస్కరించారో గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకొంటేనే ఈ రెండు పార్టీలకు మనుగడ ఉంటుంది.అహంకారపూరిత పోకడలను సమాజం హర్షించదని ప్రతి రాజకీయ నేతా గుర్తించాలి.

---

### జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంలో

# కీలక పరిణామాం

### ఫైల్స్ విడుదల బిల్లుపై అధ్యక్షుడు ట్రంప్ సంతకం



వాషింగ్టన్,నవంబర్20(ఆర్ఎన్ఎ): గతంలో అగ్రరాజ్యం అమెరికాను కుదిపేసిన జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించిన కీలక ఫైల్స్ విడుదలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను విడుదల చేసే బిల్లుపై ట్రంప్ సంతకం చేశారు. ఈ విషయాన్ని తన సోషల్ మీడియా ఖాతా ట్రూత్ ద్వారా వెల్లడించిన ట్రంప్.. ఈ సందర్భంగా డెమొక్రాట్లపై పలు ఆరోపణలు చేశారు. 'లైంగిక నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో డెమొక్రాట్లకు ఉన్న అనుబంధాల గురించి త్వరలోనే బయటపడవచ్చు. ఎందుకంటే నేను ఆ కేసుకు సంబంధించిన బిల్లుపై సంతకం చేశానని ట్రంప్ పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి బాలికలు, యువతలకు జెఫ్రీ ఎప్‌స్టీన్ డబ్బు ఆశ చూపించి ఇళ్లకు రప్పించి పలు అఘాయిత్యాలకు పాల్పడేవాడని అతడిపై ఆరోపణలు వచ్చాయి. ఆ ఆరోపణలు నిజమని తేలడంతో ఎప్‌స్టీన్‌ను అరెస్ట్ చేశారు. జైల్లో ఉన్న సమయంలోనే 2019లో అనుమానాస్పద స్థితిలో ఎప్‌స్టీన్ మరణించాడు. ఈ సెక్స్ కుంభకోణంలో ఎప్‌స్టీన్‌తో పాటు అమెరికాకు చెందిన పలువురు ప్రముఖులు కూడా ఉన్నట్టు వార్తలు వచ్చాయి.తన పరపతి పెంచుకోవడం కోసం జెఫ్రీ ఏళ్ల తరబడి టీనేజ్ అమ్మాయిలను ఎరగా వేశాడు. 2002-2005 మధ్య కాలంలో మైనర్ బాలికలను, యువతులకు డబ్బు ఆశ చూపించి తన మాన్‌హట్టన్ భవనం, పామ్ బీచ్ ఎస్టేట్, ఫ్లోరిడా, న్యూయార్క్, వర్జిన్ ఐలాండ్స్, మెక్సికోల్లోని నివాసాలకు పిలిపించి అఘాయిత్యాలకు పాల్పడేవాడని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలతో 2019 జులైలో ఎప్‌స్టీన్‌ను అరెస్ట్ చేశారు. ఇక అదే ఏడాది ఆగస్టు 10న మాన్‌హట్టన్ జైలు గదిలో అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన సన్నిహితుల జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా, మాజీ అధ్యక్షులు, రాజకీయ, వ్యాపార వేత్తలు కూడా ఉన్నట్లు ఇటీవలే వార్తలు వచ్చాయి. దీంతో ఎప్‌స్టీన్‌కు సబంధించిన అన్ని అంశాలు బహిర్గతం చేయాలని ఇటీవల అమెరికా న్యాయశాఖ ఆదేశాలు ఇవ్వడంతో ఈ వివాదం తెరపైకి వచ్చింది. ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదల బిల్లును మంగళవారం ప్రతినిధుల సభ ముందుకు తీసుకురాగా.. 427-1 ఓట్లతో ఆమోదం లభించింది. తర్వాత సెనెట్‌లో దీనికి ఏకగ్రీవ ఆమోదం లభించడంతో.. తాజాగా ట్రంప్ దానిపై సంతకం చేశారు. ఇక ఈ జాబితాలో పలువురి రాజకీయ నేతలు, జర్నలిస్ట్‌లు, వ్యాపారవేత్తలు, బిజినెస్ అండ్ టెక్ టైకూన్స్, సినిమా వాళ్ల పేర్లు తెరపైకి వచ్చాయి.

---

### అంగారకుడి ఉపరితలంపై

# మిస్టీరియస్ శిల

### అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా గుర్తింపు

### రోవర్ పంపిన చిత్రాలపై మరిన్ని పరిశోధనలు

**న్యూయార్క్,నవంబర్20:** అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా అంగారకుడి ఉపరితలంపై మిస్టీరియస్ రాయిని గుర్తించింది. ఈ రాయి మార్స్ సహజ, భౌగోళిక నిర్మాణంతో పూర్తిగా భిన్నంగా కనిపిస్తున్నది. శాస్త్రవేత్తలు 80 సెంటీమీటర్ల పొడవున్న ఈ రాయికి 'ఫిప్సాక్స్‌లా' అని నామకరణం చేశారు. ప్రస్తుతానికి ఈ రాయిని ఎలియన్ రాక్‌గా పేర్కొంటున్నారు. ఈ రాయిని



సెప్టెంబర్ 19న గుర్తించారు. నాసా పెర్సెవరెన్స్ రోవర్ పంపిన ఈ రాయిని చూసి నాసా శాస్త్రవేత్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రోవర్ జెజెరో క్రేటర్ సమీపంలోని వెర్నోడెన్ ప్రాంతంలోని రాళ్లపై అధ్యయనం జరుపుతున్నది. రోవర్ మాస్ట్‌క్యామ్-జెడ్ కెమెరా ఈ రాయిని గుర్తించి ఫొటో తీసింది. ఈ ఫొటోను నాసా బ్లాగ్ పోస్ట్‌లో షేర్ చేసింది. ఫిప్సాక్స్‌లా మరో సౌర వ్యవస్థకు చెందింది కావొచ్చునని తెలిపింది.ఈ రాయి చిన్న డెస్క్‌ను పోలి ఉంటుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. మరో సిద్ధాంతం ఏంటంటో ఇది ఉల్కాపాతం ఫలితంగా కూడా వచ్చి ఉండవచ్చని పేర్కొంటున్నారు. క్యూరియాసిటీ రోవర్ 2014లో రెండు మీటర్ల వెడల్పు లెబనాన్ ఉల్కను, 2023లో కాకో ఉల్కను గుర్తించింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు జెజెరో క్రేటర్‌లో ఇలాంటి లోహాలను గుర్తించాలని ఆశించారు. ఈ రాక్‌ను నాసా పరిశోధకుల బృందం గతవారంలో నిశితంగా పరిశీలించింది. రాయి ఆకారం, పరిమాణం, చుట్టుపక్కల ప్రాంతాల్లోని రాళ్లతో పోలిస్తే భిన్నంగా ఉందని పేర్కొంది.

---

# సోషల్ మీడియా చర్చలో ఎగ్‌ఫ్రీజింగ్



### ముందే దాచుకున్న అండాలతో ఎప్పుడైన గర్భం

### ఉపాసనా కామినేని పోస్ట్‌తో ఇప్పుడు సర్వత్రా ఆసక్తి

**హైదరాబాద్,నవంబర్20:** టాలీవుడ్ నటుడు రామ్ చరణ్ భార్య ఉపాసన కామినేని కొణిదల. ఇటీవల ఐఐటీ హైదరాబాద్ ఈవెంట్‌లో ఎగ్ ఫ్రీజింగ్‌పై చేసిన వ్యాఖ్యలు వివాదం సృష్టించాయి. అలాగే ఇప్పుడు ఎగ్ ఫ్రీజ్‌పై చర్చలు మొదలయ్యాయి. దీనిపై సర్వత్రా ఆసక్తి కూడా కనిపిస్తోంది. ఇదో రకంగా మంచిదే. కొత్త అంశాలను నవదంపతులు తెలుసుకునే అవకాశం రావడంతో సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. ఇక వివరాల్లోకి వెళితే...ఈ వివాదం నేపథ్యంలో ఉపాసన మళ్లీ స్పందించారు. ఎక్స్ అకౌంట్‌లో తన వ్యాఖ్యలను సమర్థిస్తూ ఓ పోస్టు చేశారు. కెరీర్‌పై దృష్టి పెట్టే మహిళలు.. తమ ఎగ్స్‌ను ఫ్రీజ్ చేసుకోవాలని, ఆ తర్వాత తమకు నచ్చిన సమయంలో గర్భాన్ని దాల్చాలని ఉపాసన సలహా ఇచ్చారు. ఆ సలహాపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. డాక్టర్లు, ఇన్‌ఫ్లూయన్సెర్లు, సోషల్ మీడియా యూజర్లు ఉపాసన వ్యాఖ్యలను తొలుత తప్పుపట్టారు. ఆ వ్యాఖ్యల పట్ల స్పష్టత కావాలని కొందరు ఆన్‌లైన్‌లో ఆమెను అడిగారు. ఈ నేపథ్యంలో ఉపాసన మళ్లీ ఎగ్ ఫ్రీజింగ్ గురించి స్పందించారు. అండాల సంరక్షణపై ఆరోగ్యకరమైన చర్చ జరుగుతున్నట్లు ఆమె చెప్పారు. తన వ్యాఖ్యలు ప్రజల్లో చర్చకు దారితీయడం సంతోషకరమని అన్నారు. ప్రజల స్పందన గౌరవిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎగ్ ఫ్రీజింగ్ వల్ల కలిగే లాభనష్టాల గురించి ఆమె వెల్లడించారు. తన వ్యక్తిగత అనుభవాలను ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. పెళ్లి, ఫలదీకరణ గురించి ఆమె తన పోస్టులో రాశారు. తనకు 27 ఏళ్ల వయసులో పెళ్లి జరిగిందని, తన ఇష్టపూర్వకంగా జరిగిందని, 29 ఏళ్ల వయసులో వ్యక్తిగత, ఆరోగ్య కారణాల దృష్ట్యా తన అండాలను ఫ్రీజ్ చేయాలని నిర్ణయించుకున్నానని, 36 ఏళ్ల వయసులో తనకు తొలి సంతానం కలిగిందని, 39 ఏళ్ల వయసులో కవల పిల్లలకు జన్మనివ్వనున్నట్లు ఉపాసన తన పోస్టులో తెలిపారు. పెళ్లి, కెరీర్ మధ్య పోటీ సహజమే అని, కానీ నిండు జీవితంలో అవి రెండు ముఖ్యమే అని, అయితే నేను ఆ రెండింటికి టైం ఫిక్స్ చేసుకున్నానని, తన హక్కును తాను వినియోగించుకున్నట్లు ఉపాసన పేర్కొన్నారు. మర్యాద పూర్వకంగా స్పందిస్తున్న తన ఫాలోవర్లకు ఉపాసన థ్యాంక్స్ చెప్పింది. ఉద్యోగ సంస్థలు మహిళలకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలన్న అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేసింది. ఐఐటీ హైదరాబాద్‌లో జరిగిన కెరీర్ కౌన్సిలింగ్‌లో మాట్లాడుతూ.. మహిళలకు అతిపెద్ద బీమా తమ అండాలను ఫ్రీజ్ చేసుకోవడమే అని ఆమె అన్నారు. ఎందుకంటే ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి, ఎప్పుడు పిల్లలను కనాలన్న అంశాలపై నిర్ణయం తీసుకోవడం సులువు అవుతుందన్నారు. ఆర్థికంగా బలోపేతం అయిన తర్వాత ఆ నిర్ణయాలను అమలు చేయవచ్చు అని ఆమె అన్నారు. ఎంత మంది పెళ్లి చేసుకోవాలని విద్యార్థులను ఉపాసన ప్రశ్న అడిగిన సమయంలో.. అమ్మాయిల కన్నా అబ్బాయిలే ఎక్కువ మంది చేతులు లేపారు. దీనిపై ఉపాసన స్పందిస్తూ.. ఇది ప్రగతిశీల భారత్‌కు నిదర్శనమన్నారు. ఉపాసన చేసిన ఆ సూచన వల్ల ఆన్‌లైన్‌లో విమర్శలు వెల్లువెత్తాయి. తన సలహా జీవసంబంధమైన పరిమితులకు భిన్నంగా ఉన్నట్లు కొందరు విమర్శకులు పేర్కొన్నారు. ఫెర్టిలిటీ చికిత్స సులువైన అంశం కాదన్నారు. ఐవీఎఫ్, ఎగ్ ఫ్రీజింగ్ వల్ల ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు.

# పిల్లలకు క్రమశిక్షణ నేర్పిద్దాం!

తల్లిదండ్రులు ఓపికగా వ్యవహరిస్తేనే పిల్లలు చెప్పినమాట విని క్రమశిక్షణ నేర్చుకుంటారు. ఆడుతూ పాడుతూ పిల్లలను దారిలోకి తెచ్చుకోవడానికి నిపుణులు సూచిస్తున్న చిట్కాలు

పిల్లలను చీటికీ మాటికీ కోప్పడకుండా వాళ్లు చేసే పనులను గమనిస్తూ ఉండాలి.మొదట పిల్లలు చేసిన పనిని పొగిడి చిన్న బహుమతి ఇస్తే చాలు.తరవాత తల్లిదండ్రులు ఏమి చెప్పినా పిల్లలు వినడానికి సిద్ధంగా ఉంటారు.
తల్లిదండ్రులు ప్రతిరోజూ కొంత సమయాన్ని పిల్లలతో గడపాలి. వాళ్లతో మాట్లాడుతూ ఆటలు ఆడించాలి. దీంతో పిల్లలు తమ భావాలను తల్లిదండ్రులతో పంచుకోవడం మొదలుపెడతారు. ఈ సమయంలోనే పిల్లలకు మంచి చెడూ వివరించి చెప్పాలి.



పిల్లలు ఏ విషయమైనా చెబుతున్నప్పుడు శ్రద్ధగా వినాలి.తరవాత వాళ్లు అడిగే ప్రశ్నలకు క్లుప్తంగా సమాధానాలు చెప్పాలి. పిల్లలవైపు చూస్తూ మృదు స్వరంతో లాలనగా సంభాషించాలి. అప్పుడే తల్లిదండ్రులు చెప్పిన మాటలు విని గుర్తుపెట్టుకోవాలనే భావన పిల్లల్లో కలుగుతుంది.
పిల్లలతో ప్రేమగా,ప్రశాంతంగా,సహనంగా వ్యవహరించాలి.ఇదే క్రమంలో నైతిక విలువలు,మర్యాద, ఇచ్చి పుచ్చుకునే ధోరణి, స్నేహం, దయ,సహాయం లాంటి వాటి గురించి వివరించి చెప్పాలి. దీంతో పిల్లలు పరస్పర గౌరవాన్ని అర్థం చేసుకోగల్గుతారు.
సమయానికి పడుకోవడం,నిద్ర లేవడం, హోంవర్క్, పుస్తకాలు సర్దుకోవడం,వ్యక్తిగత శుభ్రతల గురించి పిల్లలకు తెలియజెప్పాలి. దీనివల్ల పిల్లలకు స్వీయ క్రమశిక్షణ అలవడుతుంది.
ఇంటి పనుల్లో పిల్లలను భాగస్వాములను చేయాలి. స్నేహితులు, బంధువులతో మాట్లాడే విధానాన్ని వివరించి చెప్పాలి.
స్కూల్ బ్యాగ్ సర్దుకోవడం, డైనింగ్ టేబుల్ క్లీన్ చేయడం, బట్టలు–బొమ్మలను నిర్దేశిత ప్రదేశాల్లో ఉంచడం లాంటి పనులను పిల్లలకే వదిలివేస్తే వాళ్లలో బాధ్యత,స్వతంత్ర భావాలు పెరుగుతాయి. ముందుజాగ్రత్త అలవడుతుంది.

# వాల్ నట్స్‌ను రోజూ తింటే ఎన్ని పోషకాలు లభిస్తాయో తెలుసా..? ఆరోగ్యంగా ఉంటారు..!

మన శరీరానికి పోషకాలను అందించే ఎన్నో రకాల ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి.ఎవరైనా సరే తమ ఇష్టాలు, అభిరు చులకు అనుగుణంగా,తమ స్థోమతను బట్టి ఆయా ఆహారాలను తింటుంటారు.మన శరీరానికి పోషకాలను అందించే ఎన్నో రకాల ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ ఇష్టాలు, అభిరుచులకు అనుగుణంగా, తమ స్థోమతను బట్టి ఆయా ఆహారాలను తింటుంటారు. అయితే పోషకాల విషయానికి వస్తే మనకు నట్స్ ఎంతో దోహదం చేస్తాయని చెప్పవచ్చు. నట్స్‌లో వాల్ నట్స్ మనకు ఎక్కువ లాభాలను అందిస్తాయి.కానీ జీడిపప్పు, బాదం పప్పు అంటే చాలా మందికి ఇష్టంగాఉంటుంది. వాల్ నట్స్‌ను వాటి రుచి కారణంగా చాలా మంది తినరు.అయినప్పటికీ వీటిల్లోనే పోషకాలు అధికంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను రోజు వారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.వాల్ నట్స్‌ను రోజూ నానబెట్టి తినాలని వారు సూచిస్తున్నారు.వాల్ నట్స్‌లో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి.

**అధిక బరువు తగ్గుతారు..**

వాల్ నట్స్‌లోఆల్ఫా–లినోలీనిక్ యాసిడ్ (ఆలా) అనే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్ల ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి.హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తాయి. అలాగే మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి.మెదడు యాక్టివ్‌గా పని చేసేలా చేస్తాయి.వాల్ నట్స్‌లో ప్రోటీన్ల కూడా సమృద్ధిగానే ఉంటాయి.ఇవి శరీర కణజాలాన్ని పునర్నిర్మించేందుకు సహాయపడతాయి. కణజాలం మరమ్మత్తులకు గురై ఆరోగ్యంగా ఉంటుంది. కణజాలం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వాల్ నట్స్‌ను తీసుకోవాలి.వాల్ నట్స్‌లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది.జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.దీంతో బరువు కూడా నియంత్రణలో ఉంటుంది. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. కొవ్వు కరుగుతుంది. ముఖ్యంగా పొట్ట దగ్గర ఉన్న కొవ్వుతొలగిపోతుంది.



**చర్మ సంరక్షణకు..**

వాల్ నట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.వీటిల్లో విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది.ఇది యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది.అందువల్ల ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా ఆరోగ్యంగా ఉంటాయి.వాల్ నట్స్‌ను తింటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మం కాంతివంతంగా మారి తేమగా ఉంటుంది. మృదువుగా మారుతుంది.ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు దరిచేరవు. ముఖంపై ఉండే ముడతలు, ౨చ్చలు పోతాయి. వాల్ నట్స్‌లో ఫోలేట్ (విటమిన్ బి9) అధికంగా ఉంటుంది.ఇది డీఎన్ఏ ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది.ఎర్ర రక్త కణాలు తయారయ్యేందుకు దోహదం చేస్తుంది.కనుక వాల్ నట్స్‌ను గర్భిణీలు తింటే శిశువులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. వారిలో పుట్టుక లోపం రాకుండా చూడవచ్చు.

**కండరాల పనితీరుకు..**

వాల్ నట్స్‌లో మెగ్నిషియం అధికంగా ఉంటుంది.ఇది కండరాల పనితీరును మెరుగు పరుస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది.నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు రోజూ వాల్ నట్స్‌ను తింటుంటే ప్రయోజనం ఉంటుంది.అలాగే వాల్ నట్స్‌లో ఉండే మెగ్నిషియం ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది.దీని వల్ల మైండ్ రిలాక్స్ అయి రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది.పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు.వాల్ నట్స్‌లో అధికంగా ఉండే ఫాస్ఫరస్ ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది.వాల్ నట్స్‌ను రోజూ తినడం వల్ల వృద్ధాప్యంలో ఆస్టియోపోరోసిస్, ఆర్థరైటిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండాచూసుకోవచ్చు.

# మీల్ మేకర్ మీరు కూడా తింటున్నారా..? అయితే ఈ పొరపాట్లు అస్సలు చేయకండి..!

మీల్ మేకర్ అనేది ప్రోటీన్ అధికంగా కలిగిన శాకాహార ఆహారం.ఇది శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంతో పాటు కండరాల బలాన్ని పెంచుతుంది.అయితే దీన్ని అధిక మోతాదులో తీసుకోవడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు రావొచ్చు.మీల్ మేకర్ ఆరోగ్య ప్రయోజనాలు, దుష్ప్రభావాలను ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.
మీల్ మేకర్ అనేది ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, మినరల్స్ కలిగి ఉన్న ఒక పోషకాహారం. ప్రతి 100 గ్రాములలో 52 గ్రాముల ప్రోటీన్, 13 గ్రాముల ఫైబర్, 35 గ్రాముల విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఇది శరీరానికి కావలసిన ప్రోటీన్ ను అందిస్తుంది. అందువల్ల కోడిగుడ్లు, మాంసం వంటి ఆహారాలకు సమానంగా దీనిని పరిగణించవచ్చు. మీల్ మేకర్ తినడం ద్వారా మన ఆరోగ్యానికి మేలుచేస్తుంది.మీల్ మేకర్ లో ఉన్న ప్రోటీన్,ఫైబర్ మన శరీరానికి బలాన్నిస్తుంది.శరీరంలోని కండరాలు బలపడేందుకు, శక్తి పెరగడానికిఈ ఆహారం సహాయపడుతుంది.ఈ ఆహారంలో ఉండే విటమిన్లు, మినరల్స్ అనేవి శరీరానికి అవసరమైన పోషకాలుగా పనిచేస్తాయి.ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి.శరీరంలోని విటమిన్ లోపాల ను తీరుస్తాయి.ఈ ఆహారం తినడం ద్వారా శారీరక శక్తి పెరుగుతుందంటూ నిపుణులు చెబుతున్నారు.మగవారు ఈ ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు ఎదురుకావచ్చు.ముఖ్యంగా మీల్ మేకర్ ఎక్కువగా తీసుకున్నప్పుడు ఛాతి పరిమాణం పెరగడం వంటి ఇబ్బందులు రావచ్చు.అలాగే అధిక ప్రోటీన్ తీసుకోవడం వల్ల విరోచనాలు, మలబద్ధకం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.ఎక్కువసార్లు మూత్రానికి వెళ్లాల్సిన అవసరం కూడా ఉండవచ్చు. అందుకే మగవారు ఈ ఆహారాన్ని తక్కువ పరిమాణంలో తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.మహిళలు ఈ ఆహారాన్ని ఎక్కువ మోతాదులో తీసుకుంటే చర్మంపై ప్రభావం చూపవచ్చు.ముఖ్యంగా మొటిమలు వంటి సమస్యలు రావచ్చు.ఈ ఆహారంలోని కొన్నిరకాల పోషకాలు అధిక మోతాదులో ఉండటంతో శరీరంలో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది.కనుక మహిళలు కూడా ఈ ఆహారాన్ని సరైన మోతాదులో మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.మీల్ మేకర్ తినే ముందు కొంచెం జాగ్రత్తలు తీసుకోవాలి.సాధ్యమైనంత వరకు ఈ ఆహారాన్ని ఓ పౌషక ఆహారం అనిపించే స్థాయిలో మాత్రమే తీసుకోవాలి. అత్యధికంగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు పొందడంలో కొన్ని ఇబ్బందులు ఉండవచ్చు. కాబట్టి సరైన పరిమాణంలో తీసుకోవడం ద్వారా దీని ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.



# పెరుగు తినడం ఆరోగ్యానికి మంచిదేనా..? పెరుగు తినేటప్పుడు ఈ తప్పులు చేయకండి..

పెరుగుతినడం ఆరోగ్యానికి మంచిదే.కానీ పెరుగుతో చక్కెర కలపాలా..?లేక ఉప్పు కలపాలా..?ఏది మంచిదో తెలుసుకోవాలి. ముందుగా ఆయుర్వేదం నిపుణులు ఏంచెబుతున్నారో తెలుసుకుందాం.పెరుగును వేసవిలో ఎక్కువగా తింటారు.ఎందుకంటే ఇది వేడిని తగ్గిస్తుందని భావిస్తారు.కానీ ఆయుర్వేద నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసా..?పెరుగు తిన్నాదాని స్వభావం మాత్రం వేడిగానే ఉంటుందని చెబుతున్నారు.

**ఎలా తినాలి..?**

చాలా మంది పెరుగుతో లస్సీ తయారు చేసుకుంటారు.మరికొందరు దానిలో చక్కెర లేదా ఉప్పు కలిపి తింటారు.అయితే పెరుగులో ఏది కలపడం ఆరోగ్యానికి మేలు చేస్తుందో తెలుసుకోవాలి ఆయుర్వేద నిపుణులు చెప్పిన ప్రకారం పెరుగు స్వభావం ఆమ్లంగా ఉంటుంది.దాన్ని ఏదైనా కలపకుండా తినాలి.ఎందుకంటే పెరుగును తప్పుగా తీసుకుంటే రక్తం కలుషితం అవుతుందని చర్మసమస్యలు రావచ్చని చెబుతున్నారు.



**రాత్రి పెరుగు తినొచ్చా..?**

ప్రతిరోజూ పెరుగు తినడం మంచిది కాదు. ముఖ్యంగా రాత్రి పెరుగు తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రావచ్చు. కానీ పెరుగును తేనె, నెయ్యి, బెల్లంతో కలిపి తింటే ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెబుతున్నారు.

**పెరుగులో ఉప్పు..?**

కొన్నిసార్లు పెరుగులో ఉప్పు కలిపి తినొచ్చు. కానీ ఎల్లప్పుడూ ఇలా చేయడం మంచిది కాదు. ఎందుకంటే పెరుగు సహజంగా వేడిగా ఉంటుంది.ఎక్కువ ఉప్పు కలిపితే చర్మసమస్యలుజుట్టు రాలడం,మొటిమలు వంటి సమస్యలు రావచ్చు.

**పెరుగులో చక్కెర..?**

పెరుగుతో చక్కెర కలిపి తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.చక్కెర కలిపితే పెరుగులోని వేడిమి తగ్గి శరీరానికి చల్లదనం లభిస్తుంది.అలాగే బెల్లం కలిపి తింటే కూడా ఆరోగ్యానికి చాలా మంచిది.

**లస్సీ మంచిదేనా..?**

వేసవిలో పెరుగుతో లస్సీ తాగడం వల్ల శరీరానికి మంచి శక్తి లభిస్తుంది.ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచి నీటి కొరతను నివారిస్తుంది. అయితే ఏదైనా ఆహారాన్ని మితంగా తీసుకోవడం మంచిది.

# కొబ్బరి నీళ్లు మేలు చేస్తాయని అధికంగా తాగుతున్నారా..? అయితే జాగ్రత్త..!

కొబ్బరి నీళ్లను తాగడం వల్ల మన శరీరానికి ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. ప్రకృతి మనకు సహజ సిద్ధంగా అందించిన మధురమైన పానీయం కొబ్బరి నీళ్లు. వీటిని సీజన్లతో సంబంధం లేకుండా ఎప్పుడైనా సరే తాగుతుంటారు. కొబ్బరి నీళ్లు మనకు వేసవిలో దాహాన్ని తీర్చడమే కాదు, ఎండ దెబ్బ బారిన పడకుండా చూస్తాయి.కొబ్బరి నీళ్లను వేసవిలో తాగడం వల్ల శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందుతుంది.అలాగే వేసవి తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది.అయితే కొబ్బరి నీళ్లు ఆరోగ్యకరమే అయినప్పటికీ వీటిని మోతాదు లోనే తాగాల్సి ఉంటుంది. పెద్ద మొత్తంలో కొబ్బరి నీళ్లను తాగితే ఆరోగ్యకరమైన ప్రయోజ నాలు కలగకపోగా అనారోగ్య సమస్యలు వస్తాయి. కొబ్బరి నీళ్లను రోజూ తాగే వారు కచ్చితంగా జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది.

**మోతాదులోనే తాగాలి..**

కొబ్బరి నీళ్లను తాగితే మనకు తాజాదనపు అనుభూతి కలుగుతుంది. శరీరానికి కొత్త శక్తి వచ్చినట్లు అయి ఉత్తేజంగా మారుతారు. యాక్టివ్‌గా ఉంటారు.అయితే మెడికల్ మైక్రో బయాలజిస్ట్ డాక్టర్ జమాల్ ఎ.ఖాన్ చెబుతున్న ప్రకారం కొబ్బరి నీళ్లను రోజూ మోతాదుకు మించి తాగితే అందులో ఉండే పొటాషియం గుండెకు హాని చేస్తుందని అంటున్నారు. కొబ్బరి నీళ్లు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కానీ వాటిల్లో పొటాషియం, సోడియం, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. కనుక కొబ్బరి నీళ్లను మోతాదుకు మించి తాగితే ఆరోగ్యానికి హాని కలుగుతుందని అంటున్నారు. కొబ్బరి నీళ్లను ఎవరైనా సరే మోతాదులోనే తాగాల్సి ఉంటుంది.కొబ్బరి నీళ్లను అధికంగా తాగడం వల్ల శరీరంలో పొటాషియం లెవల్స్ పెరిగిపోయి హైపర్ కలేమియా అనే సమస్య వస్తుందని అంటున్నారు. దీని వల్ల గుండె అసాధారణ రీతిలో కొట్టుకుంటుంది.కొందరికి ప్రాణాంతక పరిస్థితులు సంభవించేఅవకాశాలుఉంటాయని హెచ్చరిస్తున్నారు.



**వీరు తాగకూడదు..**

వైద్య నిపుణులు చెబుతున్న ప్రకారం కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు ఉన్నవారు కొబ్బరి నీళ్లను తాగకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. కిడ్నీ సంబంధ సమస్యలు ఉన్నవారు కొబ్బరి నీళ్లను తాగకపోవడమే మంచిది. లేదంటే కొబ్బరి నీళ్ల కారణంగా శరీరంలో చేరే పొటాషియంను కిడ్నీలు బయటకు పంపించలేకపోతే అప్పుడు కిడ్నీలపై భారం పడుతుంది. కనుక ఈ సమస్య ఉన్నవారు కొబ్బరి నీళ్లను తాగకూడదు. అలాగే శస్త్ర చికిత్స చేయించుకుంటానికి 2 వారాల ముందు కానీ 2 వారాల తరువాత కానీ కొబ్బరి నీళ్లను తాగవద్దని వైద్యులు చెబుతుంటారు. ఎందుకంటే వీటిల్లో ఉండే పొటాషియం కారణంగా రక్తపోటు నియంత్రణలో ఉండదు. దీని వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది.

**ఎంత తాగాలి..?**

కిడ్నీ వ్యాధులు లేదా హైబీపీ మందులను వాడేవారు డాక్టర్ సలహా మేరకు కొబ్బరి నీళ్లను తాగవచ్చు. లేదంటే మెడిసిన్ల ప్రభావం మరీ ఎక్కువయ్యే లేదా తక్కువయ్యే అవకాశాలు ఉంటాయి. అలాగే జీర్ణ సమస్యలు ఉన్నవారు కొబ్బరి నీళ్లను తాగకపోవడమే మంచిది. కొబ్బరి నీళ్లను ఎవరైనా సరే రోజుకు 1 గ్లాస్ మోతాదులో తాగవచ్చు. వేసవిలో రెండు సార్లు ఇలా రోజుకు తాగవచ్చు. కానీ మోతాదుకు మించితే శరీరంలో పొటాషియం స్థాయిలు ఎక్కువై అది రక్తపోటుపై ప్రభావం చూపిస్తుంది.దీంతో గుండెకు హాని కలుగుతుంది. కనుక అధికంగా కొబ్బరి నీళ్లను తాగుతున్న వారు ఈ విషయాలనుతప్పనిసరిగా గుర్తుంచుకోవాల్సి ఉంటుంది.

# కలల ద్వారా మరణం ముందే తెలుస్తుందా.. నిద్రలో ఇవి కనిపిస్తే ఏం జరుగుతుందో తెలుసా

హిందూ మతంలో కలలకు ఎన్నో అర్థాలున్నాయి.వీటినే ఆత్మలు లేదా దేవదూతల సందేశాలుగా కూడా చూస్తారు.తరచుగా ఒకరి ఆలోచనలు వేటి చుట్టు అయితే తిరుగుతాయో అవే కలల రూపంలో వస్తాయని సైన్స్ చెప్తోంది. కానీ కలలకు అంతకు మించిన నిగూఢార్థం ఏదో ఉందని స్వప్న శాస్త్రం అంటోంది. ఇందులో ఏది నిజం.. అసలు కలలకు భవిష్యత్తును తెలిపే పవర్ ఉందా. కలలో మనం తరచుగా చూసేవాటికి అర్థాలు ఏంటో తెలుసుకుందాం..

మనకు వచ్చే కలలు జీవితంలో మనకు ఎదురయ్యే మంచి మరియు చెడు శకునాలను కూడా సూచిస్తాయి. కొన్నిసార్లు మనస్సు అర్థం చేసుకోలేని లోతైన అర్థాలను కలిగి ఉంటాయి హిందూ మతం ప్రకారం కొన్ని సాధారణ కలలు మరియు వాటి అర్థాలను ఇక్కడ డీకోడ్ చేయొచ్చు.పాములను కలలో చూడటం రాబోయే ఇబ్బందులకు మరియు శత్రువులకు సూచన అని చెబుతారు. మరోవైపు, దీనికి కొన్ని సానుకూల వివరణలు కూడా ఉన్నాయి. పామును పట్టుకోవడం ఆ శత్రువులపై విజయాన్ని సూచిస్తుందని చెబుతారు. ఇది వైద్యం మరియు అంతర్గత జ్ఞానాన్ని కూడా సూచిస్తుంది.

**మరణం ముందే తెలుస్తుందా..**

మరణాన్ని కలలు కనడం చాలా మందికి బాధ కలిగించే అనుభవం కావచ్చు,కానీ అది సాధారణంగా సానుకూల సంకేతం.మీరు చనిపోతున్నట్లు కలలు కన్నట్లయితే, అది సాధారణంగా మీ శక్తిని ఎక్కువగా ఆక్రమిస్తున్న దాని ముగింపును సూచిస్తుంది మరియు కొత్తదానికి మార్గాన్ని సుగమం చేస్తుంది. ఇది వివాహం, శిశువు లేదా కొత్త ఉద్యోగం వంటి ముఖ్యమైన జీవిత మార్పును కూడా సూచిస్తుంది. మీరు వేరొకరి మరణం గురించి కలలు కన్నట్లయితే, మీరు వారి శ్రేయస్సు మరియు భద్రత కోసం ఆందోళన చెందుతున్నారని అర్థం.



**పసిపిల్లలు**

కలలలో బిడ్డను చూడటం అనేక అర్థాలను కలిగి ఉంటుంది. పసివారు కలలో కనిపించడం స్వచ్ఛతకు మరియు ప్రేమను సూచన అయినప్పటికీ కొన్ని కలవరపెట్టేవిగా కూడా ఉంటాయి. ఉదాహరణకు,ఏడుస్తున్న శిశువు కనిపిస్తే మీరు త్వరలో జీవితంలో కొన్ని నిరాశలను ఎదుర్కోవలసి ఉంటుందని,ముఖ్యంగా మీ ప్రేమ జీవితంలో కొన్ని నిరాశలను ఎదుర్కోవలసి ఉంటుందని అర్థం.మీరు నడవడానికి ప్రయత్నిస్తున్న శిశువును చూస్తే,అది మీ యొక్క బలాన్ని చూపిస్తుంది.

**నీరు..**

నీరు జీవితంలో కీలకమైన అంశం,నీటి గురించి కలలు ఎక్కువగా సానుకూల స్వభావం కలిగి ఉంటాయి. కొత్త నీరు కలలో కనిపిస్తే మంచిదే. మరోవైపు, మీరు ఎవరికైనా డబ్బు అప్పుగా ఇచ్చినప్పుడు, మీరు కలలో నీరు తాగుతున్నట్లు కనిపిస్తే,ఆ డబ్బు మీకు తిరిగి వస్తుందని అర్థం. నీటిపై నడవడం అసమానమైన విజయాన్ని సూచిస్తుంది.

**గుర్రం..**

గుర్రం హిందూ మతంలో ఒక ముఖ్యమైన చిహ్నం. ఇలాంటి కలలు జీవితంలో సానుకూల శకునాలు.మీరు గుర్రపు స్వారీ చేస్తుంటే, కనీసం ప్రస్తుతానికి మీ జీవితం సజావుగా సాగుతుందని అర్థం.మరోవైపు,మీరు పరుగెత్తుతుంటే, జీవితం ఇచ్చే కష్టాలు మిమ్మల్ని పెద్దగా ప్రభావితం చేయవని మీరు వాటిని సులభంగా దాటుతారని అర్థం.

**చెట్టు..**


చెట్టు మీ కలలో పచ్చని చెట్టు కనిపిస్తే, మీరు జీవితంలో సంతృప్తిగా ఉన్నారని అర్థం.అయితే,మీరు ఒక మొక్కను చూసినట్లయితే,మీ దారిలో కొంత అసంతృప్తి వస్తోందని అర్థం. పసుపు చెట్టు కుటుంబంలో ఆసన్నమైన అనారోగ్యాన్ని సూచిస్తుందని చెబుతారు.మీరు ఒక చెట్టు నుండి పండ్లు కోస్తున్నట్లు కనిపిస్తే, మీరు త్వరలో కొంత వారసత్వాన్ని పొందుతారని అర్థం.

**ఏనుగు..**

కలలో ఏనుగు కనిపిస్తే, అది గొప్ప విజయం, బలం మరియు శ్రేయస్సును సూచిస్తుంది. మరోవైపు, సింహాన్ని చూడటం గౌరవం, శక్తి మరియు కీర్తిని సూచిస్తుంది.

# లొట్టలేసుకుంటూ తినే Chicken 65కి.. అసలు ఆ పేరు ఎలా వచ్చిందో తెలుసా?

మాంసాహారులకు ఇష్టమైన వంటకం చికెన్. చికెన్‌తో రకరకాల వంటకాలను తయారు చేసుకుని ఆరగిస్తుంటాం.కానీ ఎప్పుడైనా రెస్టారెంట్‌కి వెళితే మాత్రం అక్కడ చికెన్ బిర్యానీ, చికెన్ లాలిపాప్, చికెన్ తందూరీ వంటివాటితోపాటు చికెన్ 65 కూడా మెనూలో కనిపిస్తుంది. ఇందులో చికెన్ 65 స్పైసీ డిష్ అందరికీ బలేగా ఇష్టం.అందుకే చాలా మంది చికెన్ 65ని ఇష్టంగా తింటారు.అంతర్జాతీయ గుర్తింపు పొందిన చికెన్ 65కు ఆ పేరు రావడం వెనుక ఇంటెరెస్టింగ్ స్టోరీ ఉందట. చికెన్ 65 అనే పేరు ఎలా వచ్చిందనే దానిపై రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. వాటి గురించి ఇక్కడ తెలుసుకుందాం..



**భారత సైనికుల ప్రత్యేక వంటకం**

చికెన్ 65 అనేది ఇండియన్ సైనికులకు ఇచ్చే ఒక ప్రసిద్ధ వంటకం. దీనిని ప్రత్యేకంగా భారత ఆర్మీ సైనికుల కోసం ప్రత్యేకంగా తయారు చేస్తారు. ఈ 65 సంఖ్య సైన్యంలోని ఒక నిర్దిష్ట బెటాలియన్‌కు సంబంధించింది. అందుకే ఈ వంటకానికి చికెన్ 65 అని పేరు పెట్టారని చెబుతారు.

**65 రకాల మసాలాలతో తయారు చేస్తారు కాబట్టే దానికా పేరు..**

చికెన్ 65 తయారీకి 65 రకాల మసాలా దినుసులు ఉపయోగిస్తారని, అందుకే ఆ పేరు వచ్చిందని మరో కథనం ప్రచారంలో ఉంది. నిజానికి ఈ చికెన్ 65 వంటకాన్ని తయారు చేయడానికి కొన్ని పదార్థాలు ఉన్నా చాలా. ఇట్టే తయారు చేయొచ్చు. కాబట్టి ఈ పేరు వెనుక ఉన్న కథ కూడా అంత నిజం కాదు.

**కోడి వయస్సుకి, ఈ పేరుకి సంబంధం ఉందా?**

ఆ కోడి వయసు కారణంగా దీనికి చికెన్ 65 అనే పేరు వచ్చిందని మరికొందరు చెబుతారు. ఈ వంటకం తయారు చేయడానికి 65 రోజుల వయసున్న కోడిని ఉపయోగిస్తారట. ఈ వంటకానికి ఈ పేరు ఎలా వచ్చిందో చెప్పే కథల్లో ఇది కూడా ఉంది.

**ఈ పేరు పెట్టడానికి మెనూ నంబర్ కారణం..**

దక్షిణ భారతదేశంలోని ఒక సైనిక క్యాంటీన్‌లో చికెన్ 65 మెనూలో 65వ వంటకం ఇది. గతంలో కస్టమర్‌లు వాటిని సులభంగా గుర్తించడానికి మెనూలకు సంఖ్యలు ఇచ్చేవారు. ఈ సంఖ్య వల్ల ఈ వంటకానికి చికెన్ 65 అనే పేరు వచ్చిందని ఇంకొందరు చెబుతారు.

**చికెన్ 65 చెన్నైలోని బుహారీ హోటల్‌లో పుట్టిందా?**

చికెన్ 65 అనే వంటకం 1965లో తమిళనాడులోని చెన్నైలోని బుహారీ హోటల్‌లో ఉద్భవించిందనే కథ కూడా ప్రచారంలో ఉంది.ఈ వంటకాన్ని బుహారీ హోటల్ వ్యవస్థాపకుడు బుహారీ తొలిసారి తయారు చేశాడని, మొదట్లో హోటల్‌లోని కస్టమర్లకు చికెన్ 65ను త్వరిత స్నాక్‌గా అందించేవారనే కథనం ప్రచారంలో ఉంది.దీని రుచి అద్భుతంగా ఉండటంతో బాగా ఫేమస్ అయిందట. అందుకే ఈ వంటకానికి చికెన్ 65 అనే పేరు పెట్టారని చెబుతారు.

# వన్డే సిరీస్‌కు టీమిండియా కెప్టెన్‌గా రాహుల్!

**• దక్షిణాఫ్రికా వన్డేతో**

**రోహిత్, కోహ్లీ పునరాగమనం**



భారత్ -దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. మొదటి టెస్ట్ 30 పరుగుల తేడాతో ఓడిపోయిన తర్వాత, టీమ్ ఇండియా ఇప్పుడు నవంబర్ 22 నుంచి గౌహతిలో రెండో టెస్ట్ ఆడనుంది. దీని తరువాత, రెండు జట్లు నవంబర్ 30 నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో తలపడనున్నాయి. వన్డే సిరీస్ కోసం బీసీసీఐ ఎలాంటి జట్టును సిద్ధం చేస్తుందో చాలా పేర్లు బయటకు వచ్చాయి. ఈసారి చాలా పెద్ద పేర్ల పునరాగమనం చర్చను మరింత పెంచింది. వన్డే సిరీస్‌కు కెప్టెన్సీ కెఎల్ రాహుల్‌కు దక్కే అవకాశం ఉంది. శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా ఆడటం అనుమానంగా ఉంది. అటువంటి పరిస్థితిలో, రాహుల్‌ను కెప్టెన్‌గా నియమించడం దాదాపు ఖాయం. భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే మ్యాచ్‌లు నవంబర్ 30, డిసెంబర్ 3, డిసెంబర్ 6 తేదీల్లో జరగనున్నాయి. చాలా కాలం తర్వాత వన్డేల్లో భారత్ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్ళు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఒకేసారి కనిపించారు. ఆస్ట్రేలియాతో జరిగిన ఇటీవలి వన్డే సిరీస్‌లో రోహిత్ అద్భుత ప్రదర్శన చేశాడు. ప్రారంభ మ్యాచ్‌లో తక్కువ పరుగులు చేసిన తర్వాత, అతను రెండో వన్డేలో అర్ధ సెంచరీ, మూడవ మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీ సాధించి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు. విరాట్ కోహ్లీ కూడా తన క్లాస్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన తర్వాత, అతను మూడవ వన్డేలో 74 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి భారత్‌ను గెలిపించాడు. ఛేజింగ్‌లో తనకంటే గొప్పవారు లేరని మరోసారి నిరూపించాడు. దక్షిణాఫ్రికాతో జరిగే మ్యాచ్‌లో ఈ జోడీ జట్టుకు రన్ మెషిన్ అవుతుందని భావిస్తున్నారు. ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ఆసియా కప్‌లో గాయపడిన తర్వాత ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాడు. అతని రాక టీమ్ ఇండియా బ్యాలెన్సింగ్‌ను మరింత బలోపేతం చేస్తుంది. హార్దిక్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ముఖ్యమైన పాత్ర పోషిస్తాడు. వేగవంతమైన బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు ఆస్ట్రేలియాతో జరిగిన %వాణ×% సిరీస్‌లో విశ్రాంతి ఇచ్చారు, కాని ఇప్పుడు అతను కూడా వన్డే సిరీస్‌లో తిరిగి రావచ్చు. అతని ఉనికి భారత బౌలింగ్‌కు పదును పెడుతుంది. అదేవిధంగా, దేశవాళీ క్రికెట్‌లో నిరంతరం పరుగులు సాధిస్తున్న రుతురాజ్ గైక్వాడ్‌కు కూడా జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. అతని ఫామ్, స్థిరత్వం జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్.

## బంగారు పతకానికి కూతవేటు దూరంలో.. ప్రపంచకప్ ఫైనల్‌లో బాక్సర్ నిఖత్ జరీన్



ప్రపంచ బాక్సింగ్ కప్ 2025 టోర్నీలో భారత మహిళా బాక్సర్ నిఖత్ జరీన్ ఆధిపత్యాన్ని చలాయిస్తుంది. ఇప్పటికే రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన నిఖత్ జరీన్.. ఇప్పుడు మరోసారి ఫైనల్‌కు చేరి బంగారు పతకానికి కూతవేటు దూరంలో నిలిచింది. గురువారం జరిగిన పోరులో గెలిచి తుదిపోరుకు చేరడం ద్వారా నిఖత్ జరీన్ పతకాన్ని ఖాయం చేసుకుంది. మహిళల 51 కేజీల విభాగంలో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో బరిలో దిగిన నిఖత్ జరీన్.. ఉజ్బెకిస్థాన్ బాక్సర్ గనీవా గుల్సెవర్‌ను మట్టికరిపించింది. బాక్సింగ్ న్యాయనిర్ణేతలు అందరూ ఆమెను ఏకగ్రీవంగా విజేతగా ప్రకటించారు. దీంతో ప్రపంచ బాక్సింగ్ కప్ 2025 టోర్నీ ఫైనల్లో నిఖత్.. చైనీస్ తైపీకి చెందిన గువో జి జువాన్ తో బంగారు పతకం కోసం పోటీ పడనుంది. ఈ సందర్భంగా తెలంగాణకి చెందిన బాక్సర్ నిఖత్ జరీన్ మాట్లాడింది. "చాలా ఏళ్ల తర్వాత మళ్లీ నాకు మెడల్ దక్కడం హ్యాపీగా ఉంది. రాబోయే రోజుల్లో ఇదే విధంగా ముందుకు సాగుతా. గతంలో సొంత గడ్డపై ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచా. ఇప్పుడు ఈ టోర్నీ సెమీఫైనల్‌లో గెలిచి.. ఫైనల్‌లో గోల్డ్ మెడల్ సాధిస్తానని ధీమాగా ఉన్నా"నని నిఖత్ జరీన్ చెప్పుకొచ్చారు. ప్రపంచ బాక్సింగ్ కప్ ఛాంపియన్‌షిప్‌లో ఇప్పటి వరకు ఐదుగురు బాక్సర్లు ఫైనల్ చేరారు. వారిలో 57 కిలోల విభాగం సెమీస్‌లో జాస్మిన్ 5-0తో కజకిస్థాన్‌కు చెందిన సర్సెన్బెక్‌పై నెగ్గింది. 57 కిలోల విభాగంలో జాదుమణి సింగ్, 55 కిలోల విభాగంలో పవన్ బర్త్వాల్, 60

## ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్స్‌కు రెడీ

**• పలువురు స్టార్ ప్లేయర్ల కోసం సిద్ధం**



అబుదాబిలో డిసెంబర్ 16న ఐపీఎల్ 2026 మినీ వేలం జరగనుంది. ఇక పలువురు స్టార్ ప్లేయర్ల కోసం.. ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్స్‌కు రెడీ అవుతున్నాయి. అయితే ఈసారి చాలా మంది ఆటగాళ్లు వేలంలోకి వస్తుండగా.. వారిపై భారీ ధర పలికే ఛాన్స్ ఉంది. ఇప్పటివరకూ ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడైన రిషబ్ పంత్ రికార్డును కూడా బద్దలు కొట్టేందుకు.. ఓ ముగ్గురు ప్లేయర్లు లైన్‌లో సిద్ధంగా ఉన్నారు. ఐపీఎల్ 19వ సీజన్ వేలం డిసెంబర్ 16న అబుదాబిలో జరగనుంది. అయితే ఇది మినీ వేలం కావడంతో ఒకే రోజులో క్లోజ్ అవ్వనుంది. కామెరాన్ గ్రీన్ నుండి ఆండ్రీ రస్సెల్ వరకు.. పలువురు స్టార్ ఆటగాళ్ల కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్లకు సిద్ధమవుతున్నాయి. పంత్ పేరు మీదున్న రూ. 27 కోట్ల రికార్డు కూడా చెరిగే అవకాశం ఉంది. ఈ వేలంలో అందరి కంటే ముందున్న ఆటగాడు.. ఆస్ట్రేలియాకు చెందిన విధ్వంసక ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్. ఐపీఎల్ 2026 మినీ వేలంలోకి కామెరాన్ కూడా రానున్నాడు. ఐపీఎల్ 2024లో ఈ ప్లేయర్‌ని ఆర్సీబీ..ముంబై ఇండియన్స్ నుండి రూ. 17.5 కోట్లకు ట్రేడ్ చేసుకుంది. అయితే ఐపీఎల్ 2025 సీజన్‌లో కామెరాన్ గ్రీన్ గాయం కారణంగా ఆడలేకపోయాడు. కానీ ఈసారి ఫుల్ ఫామ్‌తో తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మెగా వేలంలో ఈ ఆటగాడి కోసం ఫ్రాంచైజీల మధ్య గట్టి పోటీ ఉండబోతోంది. కామెరాన్ గ్రీన్‌పై రూ. 25 కోట్ల వరకు బిడ్ పడే అవకాశం ఉంది. ఇక 2014 ఐపీఎల్ నుండి కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఆడుతున్న ఆండ్రీ రస్సెల్‌ను..ఈసారి రిలీజ్ చేయడంతో మినీ వేలంలోకి రాబోతున్నాడు. గత సీజన్‌లో ఈ ఆల్‌రౌండర్‌ను మెగా వేలంలో రూ. 12 కోట్లు చెల్లించి రిటైన్ చేసుకున్నారు. బ్యాట్, బాల్ రెండింటితోనూ మ్యాచ్‌ను మలుపు తిప్పగల సామర్థ్యం ఇతని సొంతం. అందువల్ల ఆండ్రీ రస్సెల్‌పై భారీ బిడ్ పడే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. గత సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడిన శ్రీలంక ఫాస్ట్ బౌలర్ మతీష పతిరానాను.. ఈసారి విడుదల చేసింది. ఐపీఎల్ 2025లో మతీషను రూ. 13 కోట్లు చెల్లించి రిటైన్ చేసుకున్నారు. ఈ సూపర్ బౌలర్‌కు డెత్ ఓవర్లలో వికెట్లు తీయగల అద్భుతమైన సామర్థ్యం ఉంది. మతీష పతిరానాపై కూడా రూ. 10 కోట్ల

## 2026 మినీ వేలాన్ని ఆపేయండి

**• భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప**



ఐపీఎల్ 2026 మినీ వేలాన్ని ఆపేయాలని బీసీసీఐకి భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప సూచించాడు. ఈ వేలం ప్రక్రియను ఆపేసి ఏడాది పాటు ఆటగాళ్లను ట్రేడ్ చేసుకునే అవకాశం కల్పించాలన్నాడు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఐపీఎల్‌లో మార్పులు చేయాలని తెలిపాడు. రెండున్నర నెలల పాటు నిర్వహిస్తున్న ఈ టోర్నీని 6 నెలల టోర్నీగా మార్చాలని సూచించాడు. ఐపీఎల్‌లో కేకేఆర్‌కు ప్రాతినిథ్యం వహించిన రాబిన్ ఊతప్ప 205 మ్యాచ్‌లు ఆడి 4952 పరుగులు చేశాడు. 2014లో కేకేఆర్ టైటిల్ గెలవడంలో రాబిన్ ఊతప్ప 660 పరుగులతో కీలక పాత్ర పోషించాడు. తాజాగా ఐపీఎల్ గురించి మాట్లాడిన రాబిన్ ఊతప్ప.. లీగ్ స్వరూపాన్ని మార్చాలన్నాడు.'ఐపీఎల్ టోర్నీని స్టార్టప్ దశకు మించి తీసుకెళ్లడం లేదు. ప్రపంచంలోనే అత్యుత్తమ క్రికెట్ లీగ్ ఇది. మారుతున్న కాలానికి అనుగుణంగా టోర్నీని మార్చాలి. వేలం ప్రక్రియను నిలిపేసి ఏడాది పాటు ట్రేడ్ విండో తెరిచి ఉంచాలి. వేలాన్ని పక్కన పెట్టి డ్రాఫ్ట్ సిస్టమ్‌ను తీసుకు రావాలి. నేను ఐపీఎల్ ఆడుతున్నప్పటి నుంచి ఈ విషయం చెబుతున్నా. కానీ వారు టీవీ వినోదం గురించి మాత్రమే ఆలోచిస్తున్నారు. డ్రాఫ్ట్ విధానం అంతకంటే గొప్పది కావొచ్చు. ఇది అభిమానులను ఆకట్టుకుంటుంది. దీన్ని అమలు చేయండి. అంతేకాకుండా ఐపీఎల్ 6 నెలల లీగ్‌లాగా ఉండాలని నేను భావిస్తున్నాడు. మధ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లను నిర్వహించాలి. కానీ, ఐపీఎల్ అభివృద్ధి చెందాలి'అని రాబిన్ ఊతప్ప పేర్కొన్నారు. డ్రాఫ్ట్ సిస్టమ్ అంటే ఆటగాళ్లను సమాన పద్దతిలో జట్లకు కేటాయించడానికి ఉపయోగించే విధానం. అత్యుత్తమ ప్రతిభను కనబర్చే క్రికెటర్లపై ఒక ఫ్రాంచైజీ గుత్తాధిపత్యం ఉండకుండా జట్ల బలబలాల మధ్య సమతుల్యం తీసుకురావడానికి దీన్ని ప్రవేశపెట్టారు. డ్రాఫ్ట్‌లో అర్హత ఉన్న ఆటగాళ్ల సమూహం నుంచి జట్లు వంతులవారీగా ఎంపిక చేసుకుంటాయి.

## నేటి నుండి యాషెస్ సిరీస్



**• సిద్ధంగా ఇంగ్లాండ్- ఆస్ట్రేలియా జట్లు**

**• పెర్త్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం**

టెస్టు క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మక సిరీస్ యాషెస్ కు అంతా రెడీ అయ్యింది. ఆస్ట్రేలియా వేదికగా మరికొన్ని గంటల్లోనే ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఇంగ్లాండ్- ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే ఈ యాషెస్ టెస్టు సిరీస్‌ను క్రికెట్‌లో అతిపెద్ద టెస్టు సిరీస్‌గా అభివర్ణిస్తారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నవంబర్ 21న పెర్త్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఈసారి ఈ సిరీస్‌కు ఆస్ట్రేలియా ఆతిథ్యం ఇస్తుంది. ఇరుజట్ల ఆటగాళ్లు ఇప్పటికే నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నారు. ద్వైపాక్షిక సిరీస్‌లు ఎన్ని ఉన్నప్పటికీ, ఇరుజట్లు ఈ సిరీస్‌ను మాత్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటాయి. ఈ సిరీస్‌లో నెగ్గాలని తీవ్రంగా ప్రయత్నిస్తాయి. ఈ క్రమంలోనే కాంట్రవర్సీలు, ప్రత్యర్థుల మధ్య మాటల యుద్ధాలు ఇవన్నీ ఇంకొక ఎత్తు! ఇందులో బ్యాటర్ సెంచరీ చేసినా, బౌలర్ ఐదు వికెట్లు కూల్చినా ఆ ప్లేయర్ పేరు మార్మోగిపోతుంది. అలాంటి సిరీస్‌కు ఆసీస్, ఇంగ్లాండ్ ప్లేయర్లు రెడీ అయ్యి, టెస్టు క్రికెట్ ఫ్యాన్స్‌కు ఫుల్ మజా ఇవ్వనున్నారు. ఆస్ట్రేలియా పిచ్‌లపై ఫాస్ట్ బౌలర్ల ఆధిపత్యం ఉంది. రేపు పెర్త్ స్టేడియంలో జరగనున్న యాషెస్ తొలి మ్యాచ్‌లోనూ పిచ్ పేసర్లకే సహకరించవచ్చు! అలాగే ఈ పిచ్‌పై టెస్టుల్లో ఆసీస్‌కు మంచి ట్రాక్ రికార్డ్ ఉంది. ఆతిథ్య ఆస్ట్రేలియా ఇక్కడ నాలుగు మ్యాచ్‌లు గెలిచింది. పెర్త్ స్టేడియంలో జరిగిన అన్ని టెస్ట్ మ్యాచ్‌ల్లో ముందుగా బ్యాటింగ్ చేసిన జట్టు గెలిచింది. అందుకే ఈ మ్యాచ్‌లో టాస్ కీలక పాత్ర పోషిస్తుంది. టాస్ గెలిచిన జట్టు ముందుగా బ్యాటింగ్ తీసుకనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పెర్త్ వేదికగా జరిగనున్న తొలి టెస్టు ఉదయం 7:50 గంటలకు ప్రారంభమవుతుంది. దీనికి అరగంట ముందు టాస్ పడుతుంది. టీవీలో స్టార్ స్పోర్ట్స్‌కు సంబంధించిన ఛానెళ్లలో లైవ్ చూడవచ్చు. అలాగే జియో హాట్‌స్టార్ ఓటీటీలో లైవ్ స్ట్రీమింగ్ చేయవచ్చు. అయితే దీనికి సబ్‌స్క్రిప్షన్ తీలుకోవాల్సి ఉంటుంది. కానీ జియో యూజర్లకు ఎంపిక చేసిన ప్లాన్‌పై ఫ్రీగా అందిస్తోంది. కాగా, ఈ సిరీస్ 1882- 83లో ప్రారంభమైంది. అంటే దీని చరిత్ర 140 సంవత్సరాలకు పైమాటే! ఇరు దేశాలకు ఈ సిరీస్ ప్రతిష్ఠాత్మకం. ఇప్పటిదాకా యాషెస్‌లో 73 సిరీస్‌లు జరిగాయి. చివరిసారిగా 2023లో సిరీస్ జరిగింది. అప్పుడు ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా ఆసీస్ 34సార్లు నెగ్గగా, ఇంగ్లాండ్ 32 సార్లు సిరీస్‌లో దక్కించుకుంది. 7 సిరీస్‌లు డ్రా గా ముగిశాయి. ఇక టెస్టుల విషయానికొస్తే, 364 టెస్టు మ్యాచ్‌ల్లో ఆసీస్- ఇంగ్లాండ్ తలపడ్డాయి. ఇందులోనూ ఆస్ట్రేలియా ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఆసీస్ 152 టెస్టుల్లో విజయం సాధించగా, ఇంగ్లాండ్ 112 మ్యాచ్‌ల్లో నెగ్గింది. మరో 97 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. ఇంగ్లాండ్ జట్టు: బెన్ డకెట్, జాక్ క్రాలే, ఓల్లీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జేమీ స్మిత్ (వికెట్ కీపర్), గస్ అట్కిన్సన్, జోఫ్రా ఆర్చర్, మార్క్ వుడ్, బ్రైడాన్ కార్సే, షోయబ్ బషీర్, జాకబ్ బెథెల్, మాథ్యూ పాట్స్, జోష్ టోంగ్, విల్ జాక్స్ ఆస్ట్రేలియా జట్టు : ఉస్మాన్ ఖవాజా, జేక్ వెదరాల్, మార్నస్ లాబుషేన్,స్టీవ్ స్మిత్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, కామెరాన్ గ్రీన్, అలెక్స్ కేరీ (వికెట్ కీపర్), మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్, బ్రెండన్ డాగెట్, స్కాట్ బోలాండ్, బ్యూ వెబ్‌స్టర్, జోష్ ఇంగ్లిస్, మైఖేల్ నెసెర్

## రింకూ సింగ్ అద్భుతమైన సెంచరీ



భారత జట్టు దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడుతోంది. నవంబర్ 22న గౌహతిలో జరిగే రెండవ, చివరి మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. ఇంతలో, భారత స్టార్ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ రింకూ సింగ్ రంజీ ట్రోఫీలో తన బ్యాటింగ్‌తో సంచలనం సృష్టించాడు. రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో రింకూ సింగ్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. వరుసగా ఫోర్లు, సిక్సర్లు బాదాడు. భారత జట్టు తరపున టెస్ట్ క్రికెట్ ఆడటానికి తన సంసిద్ధతను కూడా అతను సూచించాడు. 2025-26 రంజీ ట్రోఫీలో తమిళనాడుపై జరిగిన మ్యాచ్‌లో భారత యువ బ్యాట్స్‌మన్ రింకు సింగ్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. అతను 247 బంతులు ఎదుర్కొని 176 పరుగులు చేశాడు. రింకు సింగ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఉత్తరప్రదేశ్ తొలి ఇన్నింగ్స్ లో 460 పరుగులు చేసి తమిళనాడుపై ఐదు పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. రింకు తన ప్రత్యేకమైన స్వభావాన్ని ప్రదర్శించి మైదానం అంతటా అద్భుతమైన షాట్లు ఆడాడు. ఉత్తరప్రదేశ్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ రింకు సింగ్ క్లిష్ట పరిస్థితుల్లో ఈ సెంచరీ చేశాడు. రింకు సింగ్ బ్యాటింగ్‌కు వచ్చే సమయానికి ఉత్తరప్రదేశ్ 149 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత రింకు సింగ్ వచ్చి శివమ్ మావితో కలిసి అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. జట్టును బలమైన స్థితిలో ఉంచాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ అద్భుతమైన రంజీ ట్రోఫీ సీజన్‌తో దేశీయ క్రికెట్‌లో తన సెంచరీల సంఖ్యను పెంచుకున్నాడు. తరచుగా అగ్రశ్రేణి %ఓష%20 బ్యాట్స్‌మన్‌గా పేరుగాంచిన రింకు సింగ్, టెస్ట్ క్రికెట్ ఆడే తన సామర్థ్యాన్ని మరోసారి ప్రదర్శించాడు. అతను దేశీయ క్రికెట్‌లో తన తొమ్మిదవ సెంచరీని సాధించాడు. భారత టెస్ట్ జట్టులో స్థానం కోసం తన వాదనను కూడా పదిలం చేసుకున్నాడు. ఈ సెంచరీ సెలెక్టర్లకు కూడా ఒక ముఖ్యమైన సందేశాన్ని పంపింది. రింకు సింగ్ దేశీయ టెస్ట్ కెరీర్‌లో 57 సగటుతో 3600 పరుగులు సాధించాడు.

# పైరసీపై కొత్త పోరు..

## రూ.99కే సినిమా టికెట్ ప్రకటించిన ఈటీవీ విన్!




పైరసీపై పోరాటంలో భాగంగా ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ ఒక కీలక ముందడుగు వేసింది. తమ సంస్థ నిర్మించిన 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా టికెట్ ధరను కేవలం రూ.99గా నిర్ణయించినట్లు ప్రకటించింది. సింగిల్ థియేటర్లలో ఈ ధర వర్తిస్తుండగా, మల్టీప్లెక్స్ థియేటర్లలో రూ.105గా ఉంటుందని తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా ప్రేక్షకులను థియేటర్లకు రప్పించి, పైరసీని అరికట్టవచ్చని సంస్థ భావిస్తోంది. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో 'రాజు వెడ్స్ రాంబాయి' ప్రీ-రిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమంలో ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ, "ఇటీవల ఐబొమ్మ రవి అరెస్ట్ తర్వాత, సినిమా టికెట్, పాప్‌కార్న్ ధరలు తగ్గితే థియేటర్లకు వస్తామని చాలా మంది అభిప్రాయపడ్డారు. వారి అభిప్రాయాన్ని గౌరవించే మేము ఈ నిర్ణయం తీసుకున్నాం" అని వివరించారు. రవిని అరెస్ట్ చేసిన తెలంగాణ పోలీసులకు ఆయన అభినందనలు తెలిపారు. గతంలో తమ సంస్థ నుంచి వచ్చిన 'క' సినిమాను పైరసీ కాకుండా విజయవంతంగా అడ్డుకున్నామని సాయికృష్ణ గుర్తుచేశారు. "పైరసీ మన నుంచే మొదలైంది, దాన్ని ఆపే బాధ్యత కూడా మనదే. ప్రతి ఒక్కరూ థియేటర్లలో సినిమా చూసి సహకరించాలి" అని ఆయన ప్రేక్షకులను కోరారు. అఖిల్, తేజస్విని జంటగా నటించిన ఈ చిత్రానికి సాయిలు కంపాటి దర్శకత్వం వహించారు. ఈ సినిమా నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువ హీరో కిరణ్ అబ్బవరం హాజరు కాగా, చిత్రబృందం మొత్తం పాల్గొంది.

# ఏప్రిల్లో ఉస్తాద్ భగత్ సింగ్



2023లో బ్రో మూవీతో పలకరించాక రెండేళ్లకు పైగా బాక్సాఫీస్ పోటీకి దూరంగా ఉన్న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. ఈ ఏడాది రెండు నెలల వ్యవధిలో రెండు సినిమాలతో పలకరించాడు. జులైలో హరిహర వీరమల్లు రిలీజైతే.. సెప్టెంబర్లో ఓజీ విడులైంది. మొదటి సినిమా నిరాశపరిచినా.. రెండో మూవీ అభిమానులతో పాటు సామాన్య ప్రేక్షకులనూ మెప్పించింది. ఈ రెండు చిత్రాలను పూర్తి చేసిన వెంటనే పవన్.. ఉస్తాద్ భగత్ సింగ్ మూవీని కూడా టేకప్ చేయడం.. వరుసగా కాల్ షీట్స్ ఇచ్చి చకచకా తన పార్ట్ షూటింగ్ అంతా పూర్తి చేయడం తెలిసిందే. మరి ఈ మూవీ రిలీజ్ ఎప్పుడు అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఐతే పవన్ తన పార్ట్ వరకు చిత్రీకరణ పూర్తి చేసినప్పటికీ.. ఇంకా కొంత షూట్ మిగిలే ఉండడంతో సినిమా కొంచెం ఆలస్యం కానున్నట్లు ఇప్పటికే చిత్ర వర్గాలు సంకేతాలు ఇచ్చాయి. వచ్చే రెండు మూడు నెలల్లో అయితే రిలీజ్‌కు స్కోప్ లేదు. అలాంటపుడు వేసవికే విడుదల ఉండొచ్చని భావిస్తున్నారు. ఇప్పుడు స్వయంగా నిర్మాత రవిశంకర్ ఉస్తాద్ భగత్ సింగ్ రిలీజ్ గురించి క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రం ఏప్రిల్లో విడుదలవుతుందని ఆయన ప్రకటించారు. తమ ప్రొడక్షన్లో రానున్న కొత్త చిత్రం ఆంధ్ర కింగ్ తాలూకా ప్రమోషన్లలో భాగంగా ఆయన తమ సంస్థ సినిమాల గురించి మాట్లాడారు. రామ్ చరణ్ పెద్ది మూవీ మార్చిలోనే రాబోతోందని నొక్కి వక్కాణించిన రవిశంకర్... ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రీకరణ పూర్తి చేసుకుందని, వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపారు.సంక్రాంతికి సినిమాను రెడీ చేసే అవకాశమున్నా.. అప్పుడు చిరు సినిమా మన శంకర వరప్రసాద్ ఉండడంతో వేసవి వైపు దృష్టి మళ్లింది. మార్చిలో రామ్ చరణ్ సినిమా వస్తుంది కాబట్టి.. ఆ నెలను విడిచిపెట్టి ఏప్రిల్‌ను ఎంచుకున్నారు. మేలో ఎలాగూ చిరు మరో సినిమా విశ్వంభర వస్తుందనే అంచనాలున్నాయి. హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్‌లో చిరు సరసన శ్రీలీల, రాశి ఖన్నా నటించారు.

# జపాన్ ఫ్యాన్స్‌ను కలిసేందుకు ప్రభాస్..

## ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న డార్లింగ్!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తన జపాన్ అభిమానులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. తన సినిమాలకు జపాన్‌లో లభిస్తున్న ఆదరణ నేపథ్యంలో, అక్కడి అభిమానులను స్వయంగా కలిసేందుకు ఆయన వచ్చే నెలలో జపాన్ పర్యటనకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటన కోసం ప్రస్తుతం నటిస్తున్న 'ఫౌజీ' సినిమా చిత్రీకరణ నుంచి ఆయన స్వల్ప విరామం తీసుకోనున్నారు.'బాహుబలి' నుంచి ఇటీవల విడుదలైన 'కల్కి 2898 ఎ.డి' వరకు ప్రభాస్ చిత్రాలు జపాన్‌లో భారీ విజయాన్ని సాధించాయి. దీంతో అక్కడ ఆయనకు బలమైన అభిమానగణం ఏర్పడింది. నిజానికి 'కల్కి' విడుదల సమయంలోనే జపాన్ వెళ్లాలని ప్రభాస్ భావించారు. అయితే, అప్పుడు కాలి గాయంతో బాధపడుతుండటంతో తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. త్వరలోనే తప్పకుండా వస్తానని ఓ వీడియో సందేశం ద్వారా అభిమానులకు హామీ ఇచ్చారు.ఇప్పుడు ఆ వాగ్దానాన్ని నెరవేర్చేందుకు ఆయన సిద్ధమయ్యారు. మరోవైపు, ఈ నెలాఖరులో ప్రభాస్ తన కొత్త సినిమా 'స్పిరిట్'ను ప్రారంభించనున్నారు. ఈ చిత్రం కోసం ఆయన తన లుక్‌ను మార్చుకునే పనిలో ఉన్నారని సమాచారం. జపాన్ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చాక, కొత్త సినిమాల షూటింగ్‌లతో పాటు 'రాజాసాబ్' ప్రచార కార్యక్రమాలతో ఆయన బిజీ అవ్వనున్నారు.

# మోడ్రన్ స్త్రీ: ఉపాసన ఫేవరిజంపై జాతీయ చర్చ



స్త్రీ ఆకాశంలో సగం. పురుషుడిలోను సగం. కానీ సంఘంలో స్త్రీ స్థానం ఎక్కడ ఉంది? మగువకు అర్ధరాత్రి స్వాతంత్ర్యం సంపూర్ణంగా అందుతోందా? ఇవన్నీ ఇప్పటికీ శేష ప్రశ్నలుగానే ఉన్నాయి. అయితే ఆడది తనకు తానుగా ఆర్థిక స్వావలంబన సాధించాలని, మానసిక శారీరక - ఆరోగ్యం సహా స్వయం ఉపాధిలోను సమృద్ధిగా ఉన్నప్పుడే తనను తాను సంస్కరించుకోగలదనే అభిప్రాయం వ్యక్తం చేసారు ఉపాసన. స్త్రీలు వివాహం చేసుకున్నా కెరీర్ ని కూడా కొనసాగించాలని, అయితే దీనికోసం భాగస్వామితో కలిసి నిర్ణయం తీసుకోవాలని ఉపాసన సూచించారు. నేటి మహిళలకు ఆర్థిక స్థిరత్వం చాలా అవసరం. తన కాళ్లపై తాను నిలబడాలి. అలాగే స్త్రీ ఇతరుల ఒత్తిడితో పని లేకుండా తనకు తగ్గ వ్యక్తిని ఎంపిక చేసుకునే అవకాశం ఉండాలి! అని కూడా ఉపాసన అన్నారు. నేటితరం ఇతరుల ఒత్తిడి కంటే నిజాయితీతో కూడిన సంబంధం కోసం వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుంటున్నారని కూడా ఉపాసన అన్నారు. ప్రస్తుతం ఉపాసన అభిప్రాయం జాతీయ స్థాయిలో డిబేట్ గా మారింది. పెళ్లిలో అస్థిరత, గృహ హింస గురించి ఉపాసన గతంలో తన దృక్పథాన్ని వెల్లడించారు. స్త్రీలను గౌరవించి పూజించకపోతే దేవుడి గుడిలో దేవత విగ్రహం ఎందుకు? అని కూడా ప్రశ్నించారు. ఇప్పుడు స్త్రీ ఆర్థిక భద్రత గురించి, భర్త విషయంలో స్త్రీల ఎంపిక గురించి ఉపాసన సూటిగా మాట్లాడటం ఆసక్తిని పెంచుతోంది. కెరీర్- పెళ్లి కచ్చితంగా అమ్మాయి విషయంలో కలిసే ఉండాలని కూడా కుండబద్ధలు కొట్టారు. ప్రతి స్త్రీ భవిష్యత్ ని భద్రంగా ఉంచుకోవాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. స్త్రీలు తమ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మానసిక శ్రేయస్సు చాలా ముఖ్యమని కూడా సూచించారు. మహిళలు తమ సొంత లక్ష్యాలను, సంతృప్తికరమైన జీవితాన్ని గడపడానికి టైమ్ ని మ్యానేజ్ చేయడం నేర్చుకోవాలని కూడా అన్నారు. ఉపాసన ఆదర్శవంతమైన సూచనలపై ఇప్పుడు జాతీయ స్థాయిలో డిబేట్ కొనసాగుతోంది. ఉపాసనపై నెటిజనులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# అందాల భామకి ఎక్కడ తేడా కొడుతుంది..?



అందం అభినయం ఉంటే చాలు వరుస ఛాన్స్ లు వచ్చేస్తాయి. కానీ ఆ రెండిటిలో పాటు లక్ అనే ఫ్యాక్టర్ కూడా ఉండాలి లేదంటే కాస్త ఇబ్బంది పడక తప్పదు. ప్రస్తుతం అలాంటి పరిస్థితుల్లోనే ఉంది అందాల భామ భాగ్య శ్రీ బోర్స్. మామూలుగా అయితే రవితేజ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్ కి హిట్ క్రేజ్ రావడమే కాదు కెరీర్ అదిరిపోతుంది. అదే దారిలో మిస్టర్ బచ్చన్ తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది భాగ్య శ్రీ బోర్స్. ఐతే ఆ సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్ కాలేదు కాబట్టి ఫస్ట్ షాక్ తగిలినట్టు అయ్యింది.భాగ్య శ్రీ బోర్స్ థర్డ్ అటెంప్ట్ గా వచ్చిన కాంత.. ఐతే అది ఫ్లాప్ అయినా అమ్మడికి వరుస ఛాన్స్ లు వచ్చాయి. రెండో సినిమాగా రిలీజైన విజయ్ దేవరకొండ కింగ్ డమ్ మీద చాలా హోప్స్ పెట్టుకుంది భాగ్య శ్రీ. ఐతే ఆ సినిమా కూడా నిరాశపరచింది. ముఖ్యంగా భాగ్య శ్రీ రోల్ కూడా రన్ టైమ్ లిమిటేషన్స్ వల్ల క్లారిటీ లేకుండా పోయింది. ఇక థర్డ్ అటెంప్ట్ గా వచ్చిన కాంత సినిమా కూడా కమర్షియల్ సక్సెస్ అందుకోలేదు. తెలుగులో దుల్కర్ సినిమా అంటే కచ్చితంగా సూపర్ హిట్టే అనే రేంజ్ క్రేజ్ ఏర్పరచుకున్నాడు. అలాంటి దుల్కర్ తో కాంత సినిమా చేసిన భాగ్య శ్రీ ఆ సినిమాతో కూడా ఫెయిల్యూర్ చవిచూసింది. ఐతే 3 సినిమాల్లో కింగ్ డమ్ లో తప్పితే మిగతా రెండిటిలో అటు గ్లామర్ పరంగా యాక్టింగ్ పరంగా భాగ్య శ్రీకి మంచి మార్కులే వేశారు ఆడియన్స్. రామ్ తో జత కట్టిన ఈ అమ్మడు.. ఇక ఫైనల్ గా అమ్మడి చేతిలో ఉన్న ఒకే ఒక్క సినిమా ఆంధ్రా కింగ్ తాలూకా. రామ్ తో జత కట్టిన ఈ అమ్మడు అతనితో తొలి హిట్ అందుకుంటుందా అన్నది ఎగ్జైటింగ్ గా ఉంది. రామ్ తో తొలి పరిచయమైన ఇలియానా, కీర్తి సురేష్ లాంటి వాళ్లు స్టార్ హీరోయిన్స్ గా ఒక రేంజ్ కి వెళ్లారు. మరి అదే దారిలో భాగ్యానికి రామ్ సినిమా సక్సెస్ అందిస్తుందేమో చూడాలి. రామ్ భాగ్య శ్రీ చేసిన ఆంధ్రా కింగ్ తాలూకా సినిమా ప్రమోషన్స్ అయితే ఇంప్రెసివ్ గా ఉన్నాయి.. ఈ సినిమా ఒక ఫ్యాన్ బయోపిక్ గా మేకర్స్ చెబుతూ వస్తున్నారు. మరి సినిమాతో భాగ్యానికి ఏమేరకు లక్ కలిసి వస్తుందో చూడాలి.

# 'కొదమసింహం' రీ రిలీజ్..

## పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న చిరంజీవి



మెగాస్టార్ చిరంజీవి నటించిన క్లాసిక్ కౌబాయ్ చిత్రం 'కొదమసింహం' 35 ఏళ్ల తర్వాత మళ్లీ థియేటర్లలో సందడి చేయనుంది. 1990లో విడుదలైన ఈ సినిమాను ఈ నెల 21న రీ రిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి చిరంజీవి హాజరుకాకపోయినా, ఓ స్పెషల్ వీడియో ద్వారా సినిమాకు సంబంధించిన మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు.కౌబాయ్ సినిమాలంటే తనకు చాలా ఇష్టమని, కానీ అలాంటి చిత్రంలో తాను నటిస్తానని ఎప్పుడూ ఊహించలేదని చిరంజీవి అన్నారు. "అప్పటికే కృష్ణ గారు నటించిన 'మోసగాళ్లకు మోసగాడు' సంచలనం సృష్టించింది. ఆ సమయంలో మరో కౌబాయ్ సినిమా చేయడం సాహసమే. నిర్మాత కైకాల నాగేశ్వరరావు గారు దర్శకుడు మురళీ మోహన్ రావును పరిచయం చేసి కథ చెప్పించారు. కథ నచ్చడంతో వెంటనే అంగీకరించాను. తొలిసారి గడ్డం పెంచి నటించిన సినిమా ఇదే" అని గుర్తుచేసుకున్నారు. ఈ చిత్రంలో మోహన్‌బాబు పోషించిన 'సుడిగాలి' పాత్ర తన ఫేవరెట్ అని చిరంజీవి తెలిపారు. ఆ పాత్రకు మోహన్‌బాబు తప్ప మరెవరూ న్యాయం చేయలేరని ప్రశంసించారు. లెజెండరీ నటుడు ప్రాణ్‌తో కలిసి పనిచేయడం అదృష్టమన్నారు.

Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com